ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 28.09.2026 | సంపుటి : 13 సంచిక : 69 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## 2బీ బార్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో 41 బార్ల(2బీ)కు రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. క్యూర్ పరిధిలో 14.. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో 27 బార్లకు దరఖాస్తులను స్వీకరించనుంది. 2బీ బార్ల దరఖాస్తుకు రుసుము రూ.లక్షగా నిర్ణయించారు. ఈనెల 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనానికి అనుగుణంగా 2బీ బార్లు ఏర్పాటు చేయనున్నారు. క్యూర్ పరిధిలోని మిగతా 2లో..




## హెచ్-1బీ వీసాల్లో సమూల మార్పులు

- మరో ఏడాదిలో చర్యలు ప్రారంభమవుతాయి
- అమెరికా కార్మికశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంటోనీ డీఎస్పోసిటో

2లో..

## బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

### నేటి నుంచి యథావిధిగా కార్యకలాపాలు

### ఐబీఏ,యూఎఫ్‌బీయూల మధ్య ఫలించిన చర్చలు

**వారానికి ఐదు రోజులే..**

వారానికి ఐదు రోజుల పని కోసం డిమాండ్ బ్యాంకు ఉద్యోగ సంఘాలు చాలాకాలంగా వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నాయి. ప్రస్తుతం ప్రతి నెల రెండో, నాలుగో శనివారాల్లో మాత్రమే బ్యాం కులకు సెలవు ఉంటుంది. మిగిలిన శనివా రాల్లో సాధారణంగా సేవలు కొనసాగుతాయి. అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించి, సోమవారం నుంచి శుక్రవారం వరకు పని వేళలను కొంత పెంచాలని యూనియన్లు ప్రతిపాదిస్తున్నాయి. శనివారాల్లో సెలవు కల్పిస్తే వారంలో మిగిలిన రోజుల్లో రోజుకు అదనంగా 40 నిమిషాలు పని చేసేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని సంఘాలు చెబుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్సూరెన్స్ రంగం, కేంద్ర ప్రభుత్వ విభాగాలు, ఐటీ రంగంలో ఐదు రోజుల పని విధానం అమల్లో ఉందని యూనియన్లు గుర్తుచేస్తున్నాయి.




**ఈ మేరకు సమ్మెను వాయిదా వేసుకుంటున్నట్లు ప్రకటిన యూఎఫ్‌బీయూ**

**ఐదు రోజుల పని దినాలపై రెండు సంఘాలతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి): బ్యాంకుల 3 రోజుల సమ్మె వాయిదా పడింది. దీంతో సోమవారం నుంచి యథావిధిగా బ్యాంకులు పని చేయనున్నాయి. ఆదివారం రాత్రి ఇండియన్ బ్యాంకుల అసోసియేషన్ (ఐబీఏ), యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. దీంతో సమ్మెను వాయిదా వేసుకుంటున్నట్లు యూఎఫ్‌బీయూ ప్రకటించింది. వారి మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. ఐదు రోజుల పని మిగతా 2లో..



## యూపీలో వర్షబీభత్సం

### మూడు రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

### 56 మంది మృతి.. 46 మందికి గాయాలు

లక్నో(జనంసాక్షి): ఉత్తర్‌ప్రదేశ్‌ను వర్షాలు వణికిస్తున్నాయి. మూడు రోజుల వ్యవధిలో భారీ వర్షాలు, తుపాను సంబంధిత ఘటనల్లో రాష్ట్రవ్యాప్తంగా 56 మంది మృతి చెందారు. మరో 46 మంది గాయపడ్డారు. సీతాపూర్ జిల్లాలో అత్యధికంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అనేక జిల్లాలు వరద పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. సాధారణం వర్షపాతం 1.8 మి.మీ.తో పోల్చితే.. గత 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలో ఏకంగా 45.1 మి.మీ మిగతా 2లో..

## కేదార్‌నాథ్‌లో విరిగిపడిన కొండచరియలు



ట్రాఫిక్‌లో చిక్కుకున్న తెలంగాణ యాత్రికులు 2లో..



## భారత్‌కు డబుల్ 'సిల్వర్'


**స్క్వాష్‌లో రికార్డు • ఆసియా క్రీడల్లో మెరిసిన భారత అథ్లెట్లు**

టోక్యో(జనంసాక్షి): భారత్ ఖాతాలోకి మరో రెండు పతకాలు వచ్చి చేరాయి. ఆసియా క్రీడల స్క్వాష్‌లో మహిళల, పురుషుల సింగిల్స్‌లో రజత పతకాలను భారత క్రీడాకారులు సొంతం చేసుకున్నారు. దీంతో మన పతకాల సంఖ్య 32కి చేరుకుంది. పురుషుల స్క్వాష్ సింగిల్స్ ఫైనల్లో భారత మిగతా 2లో..



## రేవంత్‌కు కేటీఆర్ బహిరంగలేఖ

- బీఆర్‌ఎస్ అవినీతి ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేశాకే సిరిసిల్లలో అడుగుపెట్టాలి
- దయచేసి సిరిసిల్లలో దుర్భాషలాడే ఆ సంస్కృతిని కొనసాగించొద్దని వెల్లడి



న్యూఢిల్లీ(జనంసాక్షి): రాష్ట్రాన్ని నడిపించే ఒక బాధ్యతయుతమైన పదవిలో ఉన్నామన్న విషయాన్ని కూడా మరిచిపోయి, మీరు పర్యటించిన ప్రతిచోట కేవలం బూతు పురాణాలతో బురదజల్లే సంస్కృతిని దయచేసి సిరిసిల్లలో కొనసాగించవద్దంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన లేఖలో కోరారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల, సిద్దిపేటలో కూడా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది.. త్వరలో సిరిసిల్ల, సిద్దిపేటలో సభలు పెట్టి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తానంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల స్పందిస్తూ.. సిరిసిల్లకి వచ్చి రాజన్నను దర్శించుకుని పాపప్రాప్తి చేసుకోవాలని రేవంత్ రెడ్డిని సూచిస్తున్నానన్నారని తెలిసిందే. ఈ క్రమంలో సిరిసిల్లకు వస్తున్న రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రాన్ని నడిపించే ఒక బాధ్యతయుతమైన పదవిలో ఉన్నామన్న మిగతా 2లో..

## 'యూఎల్‌సీ'దరఖాస్తులను పరిశీలించి క్రమబద్ధీకరించాలి

### తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు



హైదరాబాద్(జనంసాక్షి): దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హత ఉన్న యూఎల్‌సీ కేసులను పరిశీలించి క్రమబద్ధీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. అర్హత ఉన్న కేసుల్లో నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. యూఎల్‌సీ భూములపై 2016లో జీవో జారీ చేసినా గత ప్రభుత్వం అమలు చేయలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 22-ఏ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. 22ఏ సమస్యలపై ఇప్పటికే 3 కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. జీవో 118, 76కు అనుగుణంగా ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. 22ఏలో ఉన్నా అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతిచ్చినట్లు తెలిపారు. మిగిలిన సమస్యలకూ ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కారం చూపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



### భవిష్యత్ ప్రధానిగా రాహుల్ వైపే

## దేశం చూపు

- రాజ్యాంగాన్ని రక్షించే శక్తి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే ధైర్యం కాంగ్రెస్‌కే సొంతం
- నియంతృత్వ రాజకీయాలపై రాహుల్‌ది రాజీలేని పోరాటం
- ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ
- తెలంగాణలోని ప్రతి లోక్‌సభ స్థానాన్ని గెలిచి రాహుల్‌ను ప్రధానిని చేద్దాం
- కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపు

నేరేడుచర్ల(జనంసాక్షి): భారత రాజ్యాంగానికి రక్షణ కవచంగా, ప్రజాస్వామ్యానికి ఆశాకిరణంగా నిలుస్తున్న రాహుల్‌గాంధీని భవిష్యత్ ప్రధానమంత్రిగా స్వాగతించేందుకు దేశం సిద్ధమవుతోందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. అధికార అహంకారానికి ఎదురొడ్డి నిలిచే ధైర్యం, ప్రజల పక్షాన పోరాడే నిబద్ధత, రాజ్యాంగ విలువలను కాపాడే దృఢ సంకల్పం రాహుల్‌గాంధీలోనే దేశ ప్రజలు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రసంగించారు. భారతదేశం ప్రస్తుతం కేవలం రాజకీయ మార్పును మాత్రమే కాదు రాజ్యాంగబద్ధమైన, ప్రజాస్వామ్యయుతమైన, ప్రజల గొంతును గౌరవించే నాయకత్వాన్ని కోరుకుంటోందన్నారు. మిగతా 2లో..

## సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారు

### ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలి : కాంగ్రెస్ ఫైర్

### సర్‌పై ఈసీ చర్యలు డ్యామేజ్ కంట్రోల్ మాత్రమే: జైరాం రమేశ్

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎస్‌ఐఆర్ విషయంలో జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించిన రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్, ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గత పది నెలలుగా ఇతర ఎన్నికల కమిషనర్ల ప్రమేయం లేకుండా, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు. స్థానిక అధికారులను పక్కనపెట్టి దిల్లీలోని ద్వారానే ఓటర్ల చేర్పులు, తొలగింపులు చేపట్టారని, ప్రభుత్వ నోటిఫికేషన్ లేకుండానే ఫారమ్-6లో మార్పులు చేశారని ఆయన విమర్శించారు. కొత్త చట్టం ప్రకారం సీఈసీకి నేర విచారణ నుంచి మినహాయింపు ఉన్నందున, చట్టబద్ధమైన రక్షణ లేని

మిగతా 2లో..

## మొజ్తబాను శిథిలాల నుంచి వెలికితీశాం

### ఒకటి కాదు రెండు సార్లు మొజ్తబాపై దాడులు జరిగాయి

### ఇరాన్ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ సభ్యుడు మొహ్సెన్ హెయ్‌దరీ కీలక వ్యాఖ్యలు

టెహ్రాన్(జనంసాక్షి): ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన ప్రారంభంలోనే మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఆ దాడిలో ఆయన కుమారుడు, కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా కూడా మరణించినట్లు తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. దాడుల నుంచి ఆయన త్రుటిలో బయటపడినట్లు ఇరాన్ వెల్లడించింది. ఫిబ్రవరిలో జరిగిన ఈ ఘటన గురించి ఇరాన్ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ సభ్యుడు మొహ్సెన్ హెయ్‌దరీ తాజాగా కీలక విషయాలు వెల్లడించారు. తమ అగ్రనేతపై దాడి జరిగింది ఒకసారి మాత్రమే కాదని.. రెండు సార్లు అమెరికా ఆయనను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. 'అలీ ఖమేనీ సహా కీలక నేతలు ఓ భవనంలో



సమావేశమైన సమయంలో అమెరికా దాడులు చేసింది. ఈ ఘటనలో మాజీ సుప్రీం నేత ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మొజ్తబాను వైద్యం కోసం వెంటనే ఓ ఆస్పత్రికి తరలించాం. అనంతరం అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఆ ఆస్పత్రిపై కూడా విరుచుకుపడ్డారు. మిగతా 2లో..

## టెర్రరిజంపై జీరో టాలరెన్స్

- భారత్ భద్రతకు ముప్పు కలిగించే ఏ చర్యనూ ఉపేక్షించబోం
- ఉగ్రదాడులకు తగిన సమాధానం ఇస్తున్నాం మన్ కీ బాత్‌లో మోదీ
- జనగణనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపు



న్యూఢిల్లీ(జనంసాక్షి): ఉగ్రవాదంపై భారత్ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. భారత్ భద్రతకు ముప్పు కలిగించే ఏ చర్యనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో.. టెర్రరిజంపై దేశం అవలంభిస్తున్న విధానాన్ని ప్రధాని వివరించారు. "దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే శక్తులపై కఠినంగా వ్యవహరిస్తాం. ఉగ్రదాడులకు భారత్ తగిన సమాధానం ఇస్తోంది" అని మోదీ పేర్కొన్నారు. సర్జికల్ స్ట్రైక్స్ చేపట్టి పదేళ్లు అవుతోందని ప్రధాని గుర్తుచేశారు. నాడు ఉగ్రవాదుల లాంచ్‌ప్యాడ్లను ధ్వంసం చేయడమే లక్ష్యంగా 2016లో సదరు ఆపరేషన్ చేపట్టినట్లు మిగతా 2లో..






## దేశంలోనే తొలి ఎల్‌ఎన్‌జీ రైలు..

- ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా
- కాంగ్రెస్ తన పాలనలో కుంభకోణాలు తప్ప ఇంకేమీ చేయలేదని మండిపాటు

అహ్మదాబాద్(జనంసాక్షి): దేశ రైల్వే వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ సమూలంగా మార్చారని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గుజరాత్‌లోని సబర్మతి రైల్వేస్టేషన్‌లో దేశంలోనే మొట్టమొదటి ఎల్‌ఎన్‌జీ రైలును పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ తన పాలనలో కుంభకోణాలు తప్ప ఇంకేమీ చేయలేదని విమర్శించారు. మరోవైపు.. గత 12 ఏళ్లలో మోదీపై ఎవరూ మిగతా 2లో..

# దేశంలోనే తొలి ఎల్ఎన్జీ రైలు

అవినీతి ఆరోపణలు చేయలేకపోయారని అన్నారు. అర్థరహితంగా మాట్లాడే హస్తం పార్టీని.. వాస్తవాలు, గణాంకాల ఆధారంగా చర్చకు రావాలని సవాలు చేయాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు."2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. రైల్వే వ్యవస్థలో అనేక కొత్త సదుపాయాలను కల్పించి, దానిని ఆధునికీకరించారు. ప్రత్యేక సరకు రవాణా కారిడార్, రాపిడ్ రైల్ సిస్టమ్, అత్యాధునిక స్టేషన్లకు శ్రీకారం చుట్టారు. హైడ్రోజన్‌తో నడిచే రైలును ప్రారంభించడం ద్వారా.. ప్రపంచంలో ఆ సాంకేతికత కలిగిన నాలుగు దేశాల సరసన భారత్‌ను నిలిపారు. ముంబయి నుంచి వడోదర వరకు మొట్టమొదటి లాంగ్ డబుల్ స్టాక్ కంటైనర్ రైలు ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. 11 వేల కిలోమీటర్ల రైలు కారిడార్‌ను నాలుగు ట్రాక్‌ల నెట్‌వర్క్‌గా మార్చుతున్నాం" అని అమిత్ షా తెలిపారు."2015-16లో రైల్వేలు 293 కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగించాయి. 2024-25 నాటికి అది 108 కోట్ల లీటర్లకు తగ్గింది. 2030 నాటికి సున్నాకి తగ్గిస్తాం. దీనివల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. 2010-11లో ఏటా కేవలం 75 కి.మీ. మేర రైల్వే మార్గాల విద్యుదీకరణ జరగగా.. 2023-24 నాటికి ఆ సంఖ్య 7,188 కి.మీ.కి పెరిగింది. 99.6 శాతం రైల్వే నెట్‌వర్క్ విద్యుదీకరణ పూర్తయ్యింది" అని అమిత్ షా వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఈ కొత్త రైలు ఎల్ఎన్జీ (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్), డీజిల్ రెండింటిపై నడుస్తుంది. డీజిల్ వినియోగంలో సుమారు 40 శాతాన్ని ఎల్ఎన్జీతో భర్తీ చేస్తుంది. డీజిల్ వినియోగం, ఇంధన ఖర్చులు, ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా దీన్ని ప్రవేశపెట్టారు.

# మొజ్తబాను శిథిలాల నుంచి వెలికితీశాం..!

దీంతో అది పూర్తిగా ధ్వంసమయ్యింది. కొన్ని గంటల పాటు శ్రమించి మా బలగాలు శిథిలాల నుంచి మొజ్తబాను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న ఆయనను మరో సురక్షిత ప్రాంతానికి తరలించి చికిత్స అందించాం. బహిరంగంగా ప్రకటించే వరకు.. ఆయనను తదుపరి సుప్రీంగా ఎన్నుకున్న విషయం కూడా మొజ్తబాకు తెలియదు. తర్వాత దానిని ఆయన అంగీకరించక తప్పలేదు.

**నష్టపోతోంది.. అందుకే ఒప్పందాన్ని కోరుకుంటోంది: ట్రంప్**

ఇరాన్‌కు కొత్త నాయకుడిని ఎన్నుకోవడానికి నియమించిన కమిటీ నేతలను కూడా అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యం చేసుకున్నాయి. వారు తరచూ సమావేశమయ్యే ఖోమ్ సెక్రటేరియట్‌పై దాడి చేశాయి. దీంతో వారిలో 8మంది ప్రాణాలు కోల్పోయారు. మొజ్తబా ను సుప్రీం నేతగా ఎన్నుకోవడానికి రూపొందించిన నివేదికలు, సిఫార్సులు కాలి బూడిదయ్యాయి. అదే సమయంలో ఆయనను సుప్రీంగా ఎన్నుకోవద్దని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. అయినప్పటికీ మొజ్తబానే దేశాన్ని ముందుకు నడిపించగలడని భావించి మా నాయకుడిగా ఎన్నుకున్నాం' అని మొహ్సెన్ హెయ్‌దరీ ఖతార్ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

# భారత్‌కు డబుల్ 'సిల్వర్'

**ఆసియా క్రీడల్లో మెరిసిన భారత అథ్లెట్లు**

ఒలింపిక్ బెర్తులు దూరం..

క్రీడాకారుడు అభయ్‌సింగ్ చివర్లో నిరాశపర్చాడు. మలేసియాకు చెందిన ఇయాన్ యోవ్ చేతిలో వరుస సెట్లలో ఓడిపోయాడు. ఇయాన్ 11-9, 11-5, 11-5 తేడాతో విజయం సాధించి స్వర్ణం సాధించగా.. అభయ్ రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అనంతరం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్‌లో అనహత్ సింగ్ ఓటమిని చవిచూసింది. మలేసియాకే చెందిన శివసంగరి సుబ్రమణియమ్ 11-4, 4-11, 7-11 తేడాతో అనహత్‌పై విజయం సాధించి స్వర్ణం కైవసం చేసుకుంది. 18 ఏళ్ల అనహత్ సింగ్ చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో స్క్వాష్ సింగిల్స్ విభాగంలో ఫైనల్‌కు చేరిన తొలి భారత క్రీడాకారిణిగా ఘనత సాధించింది. దీపికా పల్లికల్, జోష్న చిన్నప్ప మాత్రమే గతంలో కాంస్యాలను సొంతం చేసుకున్నారు. ఇప్పుడు అనహత్ ఆ రికార్డును అధిగమిస్తూ సిల్వర్‌ను దక్కించుకుంది. ఇక అభయ్ సింగ్ కూడా ఆసియా క్రీడల్లో ఫైనల్‌కు చేరిన రెండో భారత ఆటగాడిగా నిలిచాడు. ఇంతకుముందు సౌరభ్ ఘోషల్ ఫైనల్‌కు చేరుకుని పతకం సాధించాడు. ఇక ఒకే ఎడిషన్‌లో పురుషుల, మహిళల సింగిల్స్‌లో భారత అథ్లెట్లు ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. రికార్డుల పరంగా మన ప్లేయర్ల ప్రదర్శన గొప్పే. కానీ, ఇప్పుడీ ఓటములతో భారత క్రీడాకారులు స్వర్ణాలు చేజార్చుకోవడమే కాకుండా.. లాస్ ఏంజెలెస్ వేదికగా 2028 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశం కూడా కోల్పోయారు. గోల్డ్ గెలిచిన వారు మాత్రమే డైరెక్ట్ క్వాలిఫై అవుతారు. ఇప్పుడు మలేసియా అథ్లెట్లకు ఆ అవకాశం వరించింది.

**బాక్సింగ్‌లో మరొకటి ఖాయం..**

ఇప్పటికే బాక్సర్ అంకుష్ పంగల్ 80 కేజీల విభాగంలో సెమీస్‌కు చేరుకుని పతకం ఖాయం చేసుకున్నాడు. ఇప్పుడు 60 కేజీల మహిళల విభాగంలో పర్వీన్ హుడా కూడా సెమీస్‌కు చేరుకుంది. దీంతో పతకం ఖాయమైంది.

**చెస్ ఒలింపియాడ్.. భారత్‌కు రెండు పతకాలు**

చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్లు పతకాలను సాధించాయి. పురుషుల జట్టు రజతం అందుకోగా.. మహిళా టీమ్ కాంస్యం సొంతం చేసుకుంది. దీంతో 2026 ఒలింపియాడ్‌లో రెండు విభాగాల్లోనూ పోడియం ఎక్కిన ఏకైక దేశం భారత్ కావడం గమనార్హం. డిఫెండింగ్ ఛాంపియన్‌గా భారత్ ఫిడే 46వ చెస్ ఒలింపియాడ్ బరిలోకి దిగింది. చివరి రౌండ్‌లో హంగేరీతో భారత పురుషుల జట్టు తలపడింది. అయితే, డ్రా చేసుకోవడంతో రెండో స్థానానికే పరిమితమైంది. మరోవైపు ఆధిక్యంలో ఉన్న ఆతిథ్య దేశం ఉజ్బెకిస్థాన్ తన ప్రత్యర్థి ఉక్రెయిన్‌ను ఓడించి స్వర్ణం సొంతం చేసుకుంది. ఇక మహిళల జట్టు తన చివరి రౌండ్‌లో జార్జియాతో డ్రా చేసుకుంది. మెరుగైన టై బ్రేక్ పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకుంది. చైనా, కజకిస్థాన్ స్వర్ణ, రజతాలను సొంతం చేసుకున్నాయి.

# ఉగ్రవాదం ఉన్నంతకాలం దాడులు కొనసాగుతూనే ఉంటాయి

### వాటికి సిద్ధంగా ఉండండి..పాక్‌కు రాజ్‌నాథ్ హెచ్చరిక



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జాతీయ భద్రత విషయంలో భారత్ ఎన్నడూ రాజీపడబోదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా వారిని అంతం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేస్తే.. దాని ఫలితానికి సిద్ధంగా ఉండాలని పాకిస్థాన్‌ను హెచ్చరించారు. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది తప్ప యుద్ధాన్ని గానీ.. మరో దేశ భూభాగాన్ని గానీ కోరుకోదన్నారు. ఎవరిపైనా బెదిరింపులకూ పాల్పడబోదన్నారు. అయితే ఈ మౌనాన్ని బలహీనత అనుకుంటే తగిన రీతిలో బదులిస్తుందని హెచ్చరించారు. జాతీయ మీడియా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఏదైనా సమస్యను పరిష్కరించడానికి మేము మొదట చర్చలను ఎంచుకుంటాము. అయినప్పటికీ దేశ ప్రజలకు హాని కలిగించే చర్యలు, ఉగ్ర కార్యకలాపాలను ప్రోత్సహిస్తే ఇక చర్చలకు తావుండదు. భారత ప్రతిస్పందన ఊహించని రీతిలో, నిర్ణయాత్మకంగా ఉంటుంది. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్ర చర్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

# భవిష్యత్ ప్రధానిగా రాహుల్ వైపే దేశం చూపు



ఆ ఆకాంక్షకు ప్రతిరూపంగా రాహుల్‌గాంధీ ఎదిగారని చెప్పారు."దేశ ప్రజల చూపు ఇప్పుడు రాహుల్‌గాంధీ వైపే ఉంది. అధికారాన్ని అనుభవించేందుకు కాదు?ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు, రాజ్యాంగాన్ని కాపాడేందుకు, దేశాన్ని ఐక్యంగా ముందుకు నడిపించేందుకు ఆయన ప్రధానమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. భారతదేశ తదుపరి ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీని చూడాలన్న ఆకాంక్ష దేశవ్యాప్తంగా ఒక ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటోంది" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.గత పదేళ్లకు పైగా రాహుల్‌గాంధీపై రాజకీయ దాడులు, వ్యక్తిత్వ హనన ప్రయత్నాలు, అణచివేత చర్యలు కొనసాగుతున్నప్పటికీ ఆయన ఒక్క అడుగు కూడా వెనక్కి వేయలేదన్నారు. పదవుల కోసం రాజీపడకుండా, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారని కొనియాడారు. పార్లమెంట్ నుంచి ప్రజాక్షేత్రం వరకు, విద్యార్థుల నుంచి రైతుల వరకు, కార్మికుల నుంచి నిరుద్యోగ యువత వరకు ప్రతి వర్గం ఆవేదనకు రాహుల్‌గాంధీ గొంతుకగా నిలిచారని పేర్కొన్నారు."రాహుల్‌గాంధీని మౌనం చేయాలని ప్రయత్నించిన ప్రతిసారీ ఆయన గొంతు మరింత శక్తివంతమైంది. ఆయన అడుగులను అడ్డుకోవాలని చూసిన ప్రతిసారీ దేశ ప్రజలు ఆయనకు మరింత దగ్గరయ్యారు. రాజకీయ వేధింపులను ఎదుర్కొని నిలబడిన ఆయన ధైర్యమే నేడు దేశానికి భరోసాగా మారింది" అని మంత్రి వ్యాఖ్యానించారు.కేవలం ఎన్నికలు నిర్వహించడం మాత్రమే ప్రజాస్వామ్యం కాదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండటం, ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు భద్రంగా ఉండటం, ప్రజాస్వామ్య సంస్థలు రాజకీయ ఒత్తిడులకు అతీతంగా పనిచేయడం, ప్రతిపక్షాలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ ఉండటం, పౌరులు నిర్భయంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలగడం.ఇవన్నీ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువులని అన్నారు.ఓటరు జాబితాలు, ఎన్నికల నిర్వహణ, ఓట్ల భద్రతపై రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రశ్నలు దేశ ప్రజల అనుమానాలకు ప్రతిధ్వనిగా నిలిచాయని చెప్పారు. "ఓట్ చోరీ" అంశాన్ని దేశం ముందుంచి ప్రజాస్వామ్య వ్యవస్థల నుంచి జవాబుదారీతనాన్ని కోరడం తప్పుకాదన్నారు. ఎన్నికల ప్రక్రియపై తీవ్రమైన సందేహాలు వ్యక్తమైనప్పుడు వాటిని రాజకీయ విమర్శలుగా కొట్టిపారేయకుండా, పారదర్శకంగా ఆధారాలతో సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉందని స్పష్టం చేశారు.ఢిల్లీ ఓటరు జాబితాల సవరణకు సంబంధించిన నోటీసులపై సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రశ్నలను ప్రస్తావిస్తూ, ఓటర్ల హక్కులకు సంబంధించిన ప్రతి ప్రక్రియ స్పష్టంగా, నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా ఉండాలన్నారు. అర్హుడైన ఒక్క పౌరుడి పేరు కూడా ఓటరు జాబితా నుంచి అన్యాయంగా తొలగిపోకూడదని, ప్రతి ఓటుకూ సమాన విలువ దక్కాలని పేర్కొన్నారు.

# సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారు!

ఇఅఎ ఔఖ నిర్వాహకురాలు సీమా ఖన్నాపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. చట్టవిరుద్ధంగా సాగిన ఈ నిర్ణయాల నేపథ్యంలో గత జూన్ నుంచి ఏప్రిల్ వరకు జరిగిన ఎన్నికలను రద్దు చేసే అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించాలని సిబల్ విజ్ఞప్తి చేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు అందులో ఈదడం నాకు చాలా ఇష్టం. ఎందుకంటే అల్లకల్లోలం కూడా ఒక రకమైన ప్రశాంతతేనని అది మనకు నేర్పుతుంది" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, ఆయన ఆ వ్యాఖ్యలను ఏ ఉద్దేశంతో చేశారనేది స్పష్టంగా పేర్కొనలేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన సమస్యలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, పదేపదే ప్రశ్నలు లేవనెత్తారన్న అంశంపై రాజకీయ దుమారం మధ్య ఈ పోస్ట్ వెలువడింది.మరోవైపు, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కేరళ మాజీ ప్రధాన కార్యదర్శికి బీజేపీ టికెట్ ఆఫర్ చేశారన్న వార్తలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన సీఈసీ అధికార పార్టీకి అనుకూలంగా పనిచేయటం దారుణమన్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ప్రియాంక డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధం, పూర్తిగా అనైతికం. మన ఎన్నికల వ్యవస్థలో, ఎన్నికలను నిర్వహించే సంస్థల్లో అత్యున్నత స్థాయిలో ఉన్న ఈ వ్యక్తులకు పార్టీల పట్ల పక్షపాతం ఉందని ఇది స్పష్టంగా చూపిస్తోంది. వారికి పార్టీ పక్షపాతం ఉండటమే కాకుండా, ఆయా పార్టీల కోసం వారు క్రియాశీలకంగా ప్రచారం కూడా చేస్తున్నారు. అలాంటప్పుడు వారు నిష్పక్షపాతంగా ఎన్నికలను ఎలా నిర్వహించగలరు? ఈ పెద్దమనిషి చేసిన పూర్తిగా చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన పనుల పరంపరలో ఇది ఒకటి మాత్రమే. కాబట్టి వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలి. దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. ఢిల్లీతో పాటు ప్రతి జిల్లాలో మేం ఆయనకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపాం."అని వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ అన్నారు.

**సీజేపీకి మద్దతు తెలిపిన సోనమ్ వాంగ్‌చుక్**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 2న 'కాక్రోచ్ జనతా పార్టీ' తలపెట్టనున్న ఆందోళనకు ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు ప్రకటించారు. దేశంలో జవాబుదారీతనాన్ని, ఎన్నికల ప్రక్రియను మెరుగుపరిచేందుకు జరిగే ప్రయత్నాలకు తన మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ ఉద్యమంలో తాను భౌతికంగా పాల్గొనకపోవచ్చన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ అనేది అత్యంత కీలకమని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. ఆ ప్రక్రియే దెబ్బతింటే, ఇక ప్రజాస్వామ్యానికి విలువేముంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వాలు తామిచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చాలన్నారు. లద్దాఖ్‌కు 6వ షెడ్యూల్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలను ఆయన పట్టించుకోలేదన్న మీడియా కథనాలతో దుమారం రేగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘంలో జవాబుదారీతనం కోరుతూ అక్టోబర్ 2న సీజేపీ ముంబయిలో ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించింది.

# బ్యాంకుల ఉద్యోగుల సమ్మె వాయిదా

దినాలపై రెండు సంఘాలతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను తీసుకుని నిర్ణయం తీసుకోనున్నారు. ఇది వినియోగదారుల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోనుంది. స్కేల్-4, ఆపై అధికారులకు సంబంధించి పీఎల్ఐ పథకంలో మార్పులపై ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపేందుకు ఐబీఏతో చర్చలు జరగనున్నాయి. మిగిలిన అంశాలపైనా సాధ్యమైనంత త్వరగా చర్చలు జరుగుతాయి.

# యూపీలో వర్షబీభత్సం



లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరించింది. ఉన్నావ్‌లోని సోనిక్ టోల్‌ప్లాజా వద్ద గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీనికి సంబంధించిన వీడియోను షేర్ చేస్తూ.. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ యూపీ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఆ రహదారి పేరును 'గంగా ఎక్స్‌ప్రెస్ వాటర్‌వే'గా పేరు మార్చాలని ఎద్దేవా చేశారు. వర్షపాతం నమో దైందని అధికారులు వెల్లడించారు. యూపీలో మొత్తం 75 జిల్లాలు ఉండగా.. 56 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఫరూఖాబాద్ జిల్లాలో సాధారణం కంటే 7,385 శాతం ఎక్కువ వర్షం కురిసింది.కాన్పూర్, వార ణాసి, ప్రయాగ్‌రాజ్, గోరఖ్‌పూర్, బరేలీ తదితర ప్రాం తాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశా యి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం వెయ్యికిపైగా ఇళ్లు ధ్వంస మయ్యాయి. ఘాఘ్రా, రాప్తి నదుల్లో నీటిమట్టం క్రమం గా పెరుగుతోందని, దీనివల్ల

# కేదార్‌నాథ్‌లో విరిగిపడిన కొండచరియలు..

### ట్రాఫిక్‌లో చిక్కుకున్న తెలంగాణ యాత్రికులు

గౌరీకుండ్(జనంసాక్షి): కేదార్‌నాథ్ సమీపంలోని గౌరీకుండ్ వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. రోడ్డుకు అడ్డంగా పెద్ద ఎత్తున మట్టి పెళ్లలు పడిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 10వేల మందికిపైగా యాత్రికులు అక్కడ చిక్కుకున్నట్లు సమాచారం. వారిలో 40 మంది తెలుగు యాత్రికులు ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు హైదరాబాద్ నుంచి వెళ్లిన వారు కూడా ఉన్నారు. చిక్కుకున్న వారిలో తూర్పుగోదావరి జిల్లా రాయవరానికి చెందిన పీవీ కృష్ణారెడ్డి ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వాహనాల్లోనే వేచి చూస్తున్నట్లు ఆయన తెలిపారు. రాకపోకలు పునరుద్ధరించకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నట్లు చెప్పారు.

# తెలంగాణలో 2బీ బార్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

2బీ బార్లకు ఏడాదికి రూ.44 లక్షలు, నిజామాబాద్ బోధన్ బార్‌కు రూ.42 లక్షలు, మిగిలిన 2బీ బార్‌లకు రూ.30 లక్షలు ఎక్సైజ్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం వెబ్ సైట్‌ను పరిశీలించాలని ఎక్సైజ్ అధికారులు కోరారు.

# హెచ్-1బీ వీసాల్లో సమూల మార్పులు

**వాషింగ్టన్(జనంసాక్షి):**

మరో ఏడాదిలో హెచ్-1బీ వీసా విధానంలో సమూల మార్పులు చోటు చేసుకోనున్నాయని అమెరికా కార్మికశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంటోనీ డీఎస్పోసిటో వెల్లడించారు. ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే ఈ వీసాల్లో జరుగుతోన్న మోసాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. అమెరికా యూట్యూబర్ బెన్నీ జాన్సన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ హెచ్-1బీ వీసా ప్రస్తుత విధానం పూర్తిగా తొలగించే అవకాశం ఉన్నట్లు సంకేతాలు ఇచ్చారు. అరెస్టులు చేసేలా మరిన్ని ఆధారాలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో "మా వద్ద సంకెళ్లు సిద్ధంగా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో అమెరికా కార్మిక శాఖలోని ఆఫీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ జాతీయ స్థాయిలో హెచ్-1బీ వీసాల దుర్వినియోగం, మోసం, మానవ అక్రమ రవాణాపై దర్యాప్తులను ముందుకు తీసుకెళ్లిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడటం గమనార్హం."అమెరికా ప్రజలకు స్పష్టంగా అర్థమయ్యేలా మేం ఆధారాలను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వం ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతోంది. ఫలితంగా రానున్న 365 రోజుల్లో ఫారెన్ లేబర్ వీసా ప్రోగ్రామ్ పూర్తి భిన్నంగా మారిపోనుంది" అని ఆంటోనీ వెల్లడించారు.గతంలో అమెరికా కార్మికశాఖ స్పందిస్తూ ఇప్పటికే హెచ్-1బీ వీసాల మోసం విషయంలో డజన్ల కొద్ది సమన్లు, సెర్చ్ వారెంట్లు జారీ చేసినట్లు వెల్లడించింది. ఇప్పటికే కాగ్నిజెంట్, క్లౌడ్‌ఎరా వంటి దిగ్గజ కంపెనీల వీసా అప్లికేషన్లను సస్పెండ్ చేసింది. వీటిపై క్రిమినల్ దర్యాప్తులు పెండింగ్‌లో ఉండటంతో ఈ నిర్ణయం తీసుకొంది. వీసా మోసాలు, తప్పుడు ప్రాక్టీస్‌లతో సంబంధం ఉన్న కంపెనీలపై దర్యాప్తు కొనసాగుతుందని ఆంటోనీ వెల్లడించారు. 2025 సెప్టెంబర్‌లో అమెరికా కార్మికశాఖ స్థానిక టెక్ వృత్తి నిపుణుల ఉద్యోగాలు.. హెచ్-1బీతో విదేశీయుల పాలుకాకుండా కాపాడేందుకు ప్రాజెక్ట్ ఫైర్‌వాల్ చేపట్టింది. ఇప్పటికే కొన్ని రకాల హెచ్-1బీ వీసా ఉద్యోగులు రాకుండా 2027 సెప్టెంబర్ 21 వరకు అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించింది.




# రేవంత్‌కు కేటీఆర్ బహిరంగలేఖ

విషయాన్ని కూడా మరిచిపోయి, మీరు పర్యటించిన ప్రతిచోట కేవలం బూతు పురాణాలతో బురదజల్లే సంస్కృతిని దయచేసి సిరిసిల్లలో కొనసాగించవద్దంటూ కేటీఆర్ తన లేఖలో కోరారు. అయితే సిరిసిల్లలో 8000 ఎకరాల ప్రభుత్వభూమిని బీఆర్ఎస్ నాయకులు దోచుకున్నారని, అందులో నుండి 2400 ఎకరాలు మీ ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని మీరు అసెంబ్లీలో చేసిన నిరాధారమైన ఆరోపణలపై ఒక శ్వేతపత్రం విడుదల చేసిన తరువాతే సిరిసిల్లలో అడుగు పెట్టాలని లేఖలో డిమాండ్ చేశారు.అసలు బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల నియోజకవర్గంలో పంపిణీ చేసిన ప్రభుత్వ భూమి ఎంత..? అందులో నుంచి రికవరీ చేసినట్టుగా చెబుతున్న భూమి ఎంత..? అది ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్, ఏ రైతుకు చెందినది.. ఎంత విస్తీర్ణం వంటి సమగ్ర వివరాలను బహిరంగంగా ప్రకటించాలని కోరుతున్నానంటూ సుదీర్ఘ అంశాలను సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో కేటీఆర్ ప్రస్తావించారు.

**బీఆర్ఎస్‌పై ప్రజలకు ప్రేమ తగ్గలేదు: కేటీఆర్**

బీఆర్ఎస్‌కు అధికారం మాత్రమే పోయిందని.. పార్టీ పట్ల ప్రజలకు ఉన్న ప్రేమ ఇంకా తగ్గలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. శంషాబాద్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్‌లో ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. శాంతిభద్రతలు సైతం సరిగా లేవని.. పోలీసులు కూడా కాంగ్రెస్ నేతల మాటలే వింటున్నారని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రెండేళ్లలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందన్నారు.ఈ నెల 30న సిరిసిల్లకు వెళ్లనున్న సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. 8 వేల ఎకరాల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2,400 ఎకరాలు రికవరీ చేసిన వివరాలు బయటపెట్టాలన్నారు. " నేతన్నలకు రూ.60 కోట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు. 10 శాతం యార్న్ సబ్సిడీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. దాని సంగతేంటి? నేతన్న, రైతన్న, విద్యార్థులకు సీఎం రేవంత్ సమాధానం చెప్పాలి. హామీల అమలుపై స్పష్టమైన తేదీలు ప్రకటించాలి. సిరిసిల్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# టెర్రరిజంపై జీరో టాలరెన్స్

తెలిపారు. రాత్రికి రాత్రే ఆపరేషన్ పూర్తి చేసి సైనికులు తిరిగి వచ్చారని చెప్పారు. ఉగ్రవాదానికి సంబంధించిన కీలక కేంద్రాలు, శిక్షణ, ఆయుధాలు, నిధుల వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నామని వివరించారు. ఉగ్రవాదంపై పోరులో సాయుధ బలగాల ధైర్యసాహసాలను ప్రధాని ప్రశంసించారు. దేశ రక్షణ కోసం వారు చేసిన త్యాగాలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో దేశం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని యువత ఓ పురాతన బావిని శుభ్రం చేస్తున్న వీడియోను మోదీ పంచుకున్నారు. చెత్తచెదారంతో కూడిన బావిని యువకులు శుభ్రం చేస్తున్నట్లు అందులో కనిపిస్తోంది. గతంలో జరిగిన కార్యక్రమంలో నంద్యాల జిల్లాలోని పురాతన బావిని శుభ్రం చేయడాన్ని మోదీ ప్రస్తావించిన విషయం తెలిసిందే.

**ఉగ్రవాదంపై భారత్ ఉక్కుపాదం**

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని తెలిపారు. ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందనే విషయాన్ని భారత్ స్పష్టం చేసిందని తెలిపారు. 2016 పాకిస్థాన్‌లో ఉగ్రశిబిరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ అందుకు నిదర్శనమని అని అన్నారు. గాంధీ జయంతి వేళ స్వచ్ఛతకు సంబంధించి ఆయన ఇచ్చిన నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని మోదీ, ప్రజలను కోరారు. 138వ 'మన్ కీ బాత్'లో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు.భారత సైనికులు నియంత్రణ రేఖ దాటి ఉగ్రవాద స్థావరాలపై చర్యలు చేపట్టడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని మోదీ అన్నారు. దేశం చాలా కాలంగా ఉగ్రదాడుల వల్ల ఎదుర్కొన్న బాధకు ఈ చర్య నిర్ణయాత్మక ప్రతిస్పందనగా నిలిచిందని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం 2016లో చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్ ప్రపంచం ముందు భారత్ ఉగ్రవాద వ్యతిరేక విధానానికి ఒక కొత్త ఉదాహరణగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్ 18న జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో ఆర్మీ శిబిరంపై ఉగ్రదాడి జరిగింది. ఈ దాడికి ప్రతిస్పందనగా సెప్టెంబర్ 28-29 రాత్రి నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల లాంచ్ ప్యాడ్‌లపై భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది.

**జనగణనపై ప్రజలకు పిలుపు**

'మన్ కీ బాత్'లో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రక్రియను కూడా ప్రధాని ప్రస్తావించారు. జనగణనను జాతీయ బాధ్యతగా అభివర్ణించారు. ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని కోరారు. జనగణన సమయంలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. దేశ జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

**డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత**

దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు యువత ముందుకు రావడాన్ని ప్రధాని ప్రశంసించారు. 'నషా ముక్త్ యువ అభియాన్' ద్వారా యువత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. యువత తమంతట తామే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారని మోదీ చెప్పారు. 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో దేశవ్యాప్తంగా యువత భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది.

**మోధేరా గ్రామం ప్రస్తావన**

గుజరాత్‌లోని చారిత్రాత్మక మోధేరా సూర్య దేవాలయం వెయ్యేళ్ల ప్రస్థానాన్ని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. విదేశీ దండయాత్రల సమయంలో ఈ ఆలయం ఎదుర్కొన్న విధ్వంసాన్ని, ఆ తర్వాత జరిగిన పునర్నిర్మాణాన్ని గుర్తుచేసుకున్నారు. అదే సమయంలో, ఈ గ్రామం దేశంలోనే మొట్టమొదటి 24ీ7 సోలార్ విలేజ్?గా మారడాన్ని ఆయన అభినందించారు. అలాగే మోధేరాలో పర్యాటకుల కోసం అనేక వసతులను పెంచినట్లు ప్రధాని తెలిపారు.

# దక్షిణాఫ్రికాలోని ప్రధాన నగరాల్లో కాల్పులు..

### 27 మంది మృతి

కేప్‌టౌన్(జనంసాక్షి):దక్షిణాఫ్రికాలో దారుణం చోటుచేసుకుంది. జొహన్నెస్‌బర్గ్ కేప్‌టౌన్ నగరాల సమీపంలోని టౌన్‌షిప్‌లలో జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో 27 మంది మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. జొహన్నెస్‌బర్గ్‌లోని వెడెలా టౌన్‌షిప్‌లోని ఓ బార్‌లో శనివారం రాత్రి దుండగులు కాల్పులు జరిపారు. ఏకే 47 రైఫిళ్లు, పిస్టళ్లతో వచ్చిన ఎనిమిది మంది ఈ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 17 మంది చనిపోయారు. మరో 15 మంది గాయపడ్డారు.కేప్‌టౌన్ సమీపంలోని ల్యాండ్లేలోనూ ఆదివారం తెల్లవారుజామున ఓ దుకాణంలో కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 10 మంది మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. ఈ ఘటనలకు కొద్ది రోజుల ముందే దర్బన్ సమీపంలో ఇంట్లో జరిగిన పార్టీలో కాల్పులు జరిగిన విషయం తెలిసిందే. ముగ్గురు దుండగులు జరిపిన దాడిలో గర్భిణితో సహ 11 మంది మృతిచెందారు. ఆయా ఘటనల్లో నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటి వరకూ ఎవరినీ అరెస్టు చేయకపోవడం గమనార్హం. వరుస ఘటనలతో ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



# విద్యార్థిని చితకబాదిన కరస్పాండెంట్

- టీసీ తీసుకెళ్లాలని బెదిరించారు : తండ్రి దయాకర్‌రెడ్డి
- అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



**దేవరుప్పుల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామానికి చెందిన చింతల వంశీరెడ్డి, తండ్రి దయాకర్‌రెడ్డి, దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు తన కుమారుడిని విచక్షణారహితంగా కొట్టడంతో పాటు, సరిగా చదవడం లేదంటూ టీసీ తీసుకెళ్లాలని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని బెదిరించారని విద్యార్థి తండ్రి దయాకర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఉదయం విద్యార్థికి లంచ్‌బాక్స్ ఇచ్చేందుకు దయాకర్‌రెడ్డి పాఠశాలకు వెళ్లగా, కుమారుడు ఏడుస్తూ తన వద్దకు వచ్చాడని తెలిపారు. విషయం అడిగి తెలుసుకోగా జేసురాజు కొట్టినట్లు తనకు చెప్పాడన్నారు. దీంతో ఆగ్రహించిన దయాకర్‌రెడ్డి తన కుమారుడు చింతల వంశీరెడ్డితో కలిసి దేవరుప్పుల ప్రధాన చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం దేవరుప్పుల మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థిపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాఠశాల కరస్పాండెంట్ జేసురాజుపై చర్యలు తీసుకోవాలని తండ్రి దయాకర్‌రెడ్డి కోరారు.

# కోట్ల రూపాల ఆశ చూపి ఇంట్లో ఉన్న బంగారంతో పరార్

- మత్తు ప్రయోగంతో మాయ
- స్పృహ కోల్పోయాక దోపిడీ

**కౌటాల సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** కోట్ల రూపాలు ఆశ చూపి లక్షలు దండుకున్న ఘటన కౌటాల మండలంలో కలకలం రేపింది. కౌటాల మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులను కోట్ల రూపాయలు ఇస్తామని నమ్మించి మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు మోసం చేసినట్లు తెలిసింది. ఘటనలోబాధితుల వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల నుంచి రూ. 8.50 లక్షల వరకు నగదు, బంగారు చైన్, ఉంగరాలు తీసుకుని పరారైనట్లు తెలుస్తోంది. మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు వ్యాపారులను నమ్మించి మత్తు మందు ప్రయోగించడంతో వారు స్పృహ కోల్పోయారని, అనంతరం నగదు, బంగారం తీసుకుని వెళ్లినట్లు సమాచారం. మత్తు ప్రభావంతో బాధితులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు తెలుస్తోంది. ఈ విషయం పోలీసుల దృష్టికి రావడంతో కౌటాల పోలీసులు, కాగజ్‌నగర్ డీఎస్పీ ఘటనపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్ర వ్యక్తులకు, వ్యాపారులకు మధ్యవర్తులుగా మొగడధగడ్ గ్రామానికి చెందిన ముగ్గురు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని కౌటాల ఎస్ఐ సతీష్ తెలిపారు.

## ఊరువాడా ఉత్సాహంగా..

# అమ్మకు అక్షరమాల

- చదువుకు వయసు అడ్డంకి కాదని చాటిన 6 లక్షల వయోజనులు
- ఉల్లాస్ పరీక్ష రాసిన వయోజనులకు మంత్రి సీతక్క అభినందనలు
- లక్ష్యం చేరే వరకు అక్షరాస్యత ఉద్యమం కొనసాగిస్తాం
- మంత్రి సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఏళ్ల తరబడి అక్షరాలకు దూరంగా ఉన్న వయోజనులు ఇప్పుడు తమ జీవితాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. తెలుగు అక్షరాలను గుర్తించలేని స్థితి నుంచి చదవడం, రాయడం, లెక్కలు చేయడం నేర్చుకున్న లక్షలాది మంది ఆదివారం 'ఉల్లాస్' పరీక్ష రాశారు. అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్‌కు 6.32 లక్షల మంది వయోజనులు హాజరయ్యారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 5.32 లక్షల మంది మహిళలు, పట్టణ ప్రాంతంలో లక్ష మంది వరకు పరీక్ష రాశారు. రాష్ట్రంలోని 124 పట్టణ స్థానిక సంస్థల్లో (యూఎల్‌బీఎస్), అలాగే జీహెచ్‌ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ పరిధిలోని సర్కిళ్లలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 98,324 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు, 720 మంది వీధి వ్యాపారులు హాజరై పరీక్ష రాశినట్లు, వయోజన విద్యాశాఖ సమన్వయంతో ఈ పరీక్షను నిర్వహించినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్ష రాసిన స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇతర వయోజన అభ్యాసకులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందనలు తెలిపారు. "అక్షరం నేర్చుకోవడం అంటే కేవలం చదవడం, రాయడం రావడం కాదు.. అది ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకోవడం. ఇంతకాలం వేలిముద్రతో తమ అవసరాలను పూర్తి చేసుకున్న మహిళలు ఇకపై తమ పేరును తామే రాసుకునే స్థాయికి రావడం ఒక గొప్ప మార్పు. చదువుకు వయసు లేదు.. నేర్చుకోవాలన్న సంకల్పమే ముఖ్యం" అని మంత్రి సీతక్క అన్నారు. చిన్న వయసులోనే పెళ్లిళ్లు, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులు, ఉపాధి కోసం ఎదురైన పరిస్థితులు తదితర కారణాలతో చదువుకు దూరమైన మహిళలు రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. జీవితంలో ఏ దశలో చదువు ఆగిపోయినా, మళ్లీ అక్కడి నుంచే విద్యను కొనసాగించే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. "ఒక మహిళ అక్షరాస్యురాలైతే ఒక్క వ్యక్తి మాత్రమే చదువుకున్నట్టు కాదు.. ఒక కుటుంబానికి వెలుగు వస్తుంది. ఆమె తన పిల్లల చదువును పట్టించుకుంటుంది, బ్యాంకు లావాదేవీలను అర్థం చేసుకుంటుంది, ఆరోగ్యం గురించి తెలుసుకుంటుంది, ప్రభుత్వ పథకాలను స్వయంగా తెలుసుకుని వినియోగించుకోగలుగుతుంది. అందుకే మహిళా అక్షరాస్యతను కేవలం విద్యాశాఖ కార్యక్రమంగా కాకుండా సామాజిక మార్పు ఉద్యమంగా చూడాలి" అని సీతక్క స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీ తెలివి చోరీ అయ్యింది : ఎంపీ అర్వింద్

**నిజామాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ నేతలు చెపుతున్నట్లు దేశంలో ఓటు చోరీ జరగడం లేదని, కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి ఖండించారు. ఆదివారం ఆయన నిజామాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యల పై స్పందించారు. ఈ సందర్భంగా అర్వింద్ రాహుల్ రాహుల్ గాంధీ పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ విమర్శిస్తున్నట్లుగా దేశంలో ఓటు చోరీ జరగలేదని, రాహుల్ గాంధీ "అఖల్ చోరీ" జరిగిందంటూ ఘాటుగా స్పందించారు. ఎన్నికల సంఘంలో అభిప్రాయ భేదాలు ఉండటం సహజమేనని, తుది నిర్ణయం చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌దే అని అర్వింద్ అన్నారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలు రాజ్యాంగబద్ధంగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘంలో ఎవరి అభిప్రాయాలు వారు చెప్పుకునే స్వేచ్ఛ ఉంటుందన్నారు. దీన్ని డిక్టేటర్ షిప్ అనరని, డెమోక్రసీ అంటారని కాంగ్రెస్ కు గుర్తు చేశారు. ఈ విషయాలన్నీ గాంధీ కుటుంబానికి అర్థం కావని, అందుకే వాళ్ల పార్టీ డెమోక్రటిక్ ప్రాసెస్ పాటించక పోవడంతో ప్రతిరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చీలిపోయిందని అర్వింద్ గుర్తు చేశారు. బెంగాల్ లో మమతా బెనర్జీ, తమిళనాడులో మూపనార్, ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ జగన్, మహారాష్ట్రలో శరద్ పవార్, అస్సాంలో హేమంత్ బిశ్వశర్మలు ఆ పార్టీతో వీడిపోయారన్నారు.

# జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్‌కార్డులివ్వాలి

- సంక్షేమ నిధికి వంద కోట్లు విడుదల చెయ్యాలి
- టీయూ డబ్ల్యు జే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ
- ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం నుంచే జర్నలిస్టులకు ఇళ్లస్థలాల పంపిణీ ప్రారంభించాలి
- జర్నలిస్టుల సమస్యల పై అక్టోబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్త పోస్టు కార్డు ఉద్యమం
- మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు విడుదల చెయ్యాలి: టీయూ డబ్ల్యూ జే డిమాండ్



**వికారాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గత ప్రభుత్వంలో లాగే జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులను జారీ చెయ్యాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు మూడు సంవత్సరాలు అవుతున్నా జర్నలిస్టుల సంక్షేమం కోసం ఒక్క రూపాయి నిధులను విడుదల చేయకపోవడం బాధాకరం అని అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభలో అల్లం నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సబ్బండ వర్గాలను ఏకం చేసి రాజకీయాలకు అతీతంగా పనిచేసిన సంఘం టీజేఎఫ్,టీయూ డబ్ల్యు జే అని ఆయన అన్నారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం రూ.42 కోట్లు ఇచ్చిందని, ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులను అమలు చేసిందని అల్లం నారాయణ గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కానీ, సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ఉన్న హెల్త్ కార్డులను కూడా తీసేసిందని, ఇది జర్నలిస్టులకు అన్యాయం చెయ్యడమేనని అల్లం నారాయణ అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2 నుంచి వారం రోజుల పాటు పోస్టు కార్డు ఉద్యమ చేస్తామని ఆయన ప్రకటించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్ మాట్లాడుతూ సంక్షేమానికి తూట్లు పొడిచిన వారే జర్నలిస్టుల సంక్షేమం గురించి మాట్లాడడం విడ్డురంగా ఉందని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని మారుతీ సాగర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం అయిన కొడంగల్ లో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని ఇంతకంటే దారుణం మరొకటి ఉండదని మారుతి సాగర్ అన్నారు. టీయూ డబ్ల్యూ జే వికారాబాద్ జిల్లా మహా సభల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. పార్టీలకు అతీతం జర్నలిస్టుల సంక్షేమం కోసం అందరూ పనిచేయాలని ఆనంద్ అన్నారు. ఈ మహా సభలో మాజీ ఎమ్మెల్యే మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని కితాబునిచ్చారు. మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చంద్ర ప్రియ, మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, బీజేపీ నాయకుడు రాజశేఖర్ రెడ్డి, టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర కోశాధికారి పి.యోగనంద్, టెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్,టీయూ డబ్ల్యూ జే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శేఖర్ సాగర్, బి.సి కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, ఆసీఫ్ హుస్సేన్, నర్సింహులు, ఆనంద్, జావీద్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షులుగా ఎం.రవీందర్, ప్రధాన కార్యదర్శి గా డి.ప్రహ్లాద్ లు ఎన్నికయ్యారు.

## పదేళ్ల నుంచి పని చేసిన ఉద్యోగులను తొలగించడం అన్యాయం

- ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** ఎన్ఐటీలో ఎన్నో సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తూ విధులు నిర్వహించిన ఉద్యోగులకు అండగా ఉంటానని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. ఎన్ఐటీ నుంచి ఇటీవల తొలగించబడిన పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దాస్యం వినయ్ భాస్కర్‌ని కలిసి తమ సమస్యలను వివరించారు. తాము గత పదేళ్లుగా ఎన్ఐటీలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి తమ వంతు సేవలు అందించామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పనిచేసిన తమను ఒక్కసారిగా విధుల నుంచి తొలగించడం వల్ల తమ కుటుంబాలపై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, ఏళ్ల తరబడి ఒకే సంస్థలో పనిచేసిన ఉద్యోగులను అకస్మాత్తుగా విధుల నుంచి తొలగించడం వల్ల వారి కుటుంబాల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. పదేళ్లుగా సేవలందించిన ఉద్యోగుల అనుభవాన్ని, వారి కుటుంబాల పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సమస్యను ఎన్ఐటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ స్థాయిలో కూడా చర్చించి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. బాధిత ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్య పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ లీగల్ సెల్ అడ్వైజర్ నాయిని రవి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



## అడవిపందిని హతమార్చిన కేసులో 13 మందిపై కేసు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** అడవి పందిని హతమార్చిన కేసులో పదమూడు మందిపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి రేంజ్ అధికారి సీహెచ్ పూర్ణచందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి నియోజకవర్గం కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి గ్రామములో చింతపురి లింగయ్య అనే వ్యక్తి అడవిపందిని హతమార్చి దాని మాంసాన్ని కొందరు వ్యక్తులకు అమ్మినాడనే సమాచారం నిమిత్తం అతనిని పట్టుకొని విచారించగా, టేకులపల్లి పత్తి చేనులో ఒక అడవిపంది చనిపోయి ఉన్నదని, అట్టి అడవిపందిని పోగులు వేసి కొంతమందికి ఇచ్చినాను అని చెప్పగా ఇట్టి నేరానికి సంబందించిన మొత్తం 13 మందిని తదుపరి విచారణ నిమిత్తం బెల్లంపల్లి రేంజ్ కార్యాలయముకు తరలించినట్లు వివరించారు. దాడిలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కే గౌరీ శంకర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాలకృష్ణ ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు గ్రూప్-1లో అవకాశాలు కల్పించాలి

- యూపీఎస్సీ తరహాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించాలి
- గ్రామీణ ప్రాంతాల్లో కోచింగ్ సెంటర్లు, లైబ్రరీల ఏర్పాటు అవసరం
- మాజీ మంత్రి డా. జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన, ఉన్నత విద్యార్హతలు కలిగిన యువత ఖూజా, ౧ఉూజ పరీక్షలకు సన్నద్ధమై గ్రూప్-1 సర్వీసుల్లో అత్యున్నత స్థానాలు సాధించేలా ప్రభుత్వం అవసరమైన శిక్షణ, కోచింగ్ సౌకర్యాలను కల్పించాలని మాజీ మంత్రి డాక్టర్ జీ.చిన్నారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం ప్రత్యేక కోచింగ్ సెంటర్లతో పాటు సిటీ లైబ్రరీలు, అన్ని ప్రాంతాల్లో ఆధునిక సౌకర్యాలతో కూడిన లైబ్రరీలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు స్వయంగా చదువుకుని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా వాతావరణం కల్పించడంతో పాటు గ్రూప్-1 పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని అన్నారు.

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల తరహాలో గ్రూప్-1 నియామక ప్రక్రియను మూడు దశల్లో-ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ /పర్సనాలిటీ టెస్ట్-నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా ప్రిలిమినరీ పరీక్షను యూపీఎస్సీ ద్వారా తెలంగాణలో నిర్వహించే అవకాశాన్ని పరిశీలించాలని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం, ఒక రాష్ట్ర గవర్నర్ అభ్యర్థన మేరకు, భారత రాష్ట్రపతి అనుమతితో యూపీఎస్సీ రాష్ట్ర అవసరాలకు సేవలందించే అవకాశం ఉందని తెలిపారు. ఈ నిబంధన ఆధారంగా తెలంగాణ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు యూపీఎస్సీని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించవచ్చని పేర్కొన్నారు. యూపీఎస్సీ ద్వారా ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తే పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెరగడంతో పాటు పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి సంవత్సరం పరీక్ష నిర్వహించే విధానం ద్వారా తెలంగాణ యువత ముందుగానే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు గ్రూప్-1 పోస్టుల నియామకాలు చేపట్టలేదని డా. చిన్నారెడ్డి పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షకు సంబంధించి పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయాల్సి వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్-1 పరీక్షను నిర్వహించి నియామక ప్రక్రియను చేపట్టిందని, ఖూజ తరహాలో దశలవారీగా పరీక్షలు నిర్వహించి అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. భవిష్యత్తులోనూ అభ్యర్థులకు తగిన అవకాశాలు కల్పిస్తూ పారదర్శకంగా, క్రమబద్ధంగా నియామక ప్రక్రియ కొనసాగించాలని ఆయన కోరారు.

## నీట్ పీజీలో జీహాన్ సత్తా ఆల్ ఇండియా 941వ ర్యాంకు

**చెన్నూర్ సెప్టెంబర్ 27(జనం సాక్షి) :** నీట్ పీజీ 2026లో 570 మార్కులు సాధించి ఆల్ ఇండియా 941వ ర్యాంక్ సాధించిన డా. మహమ్మద్ జీహాన్‌ను ఆదివారం భక్తావర్ మసీదులో ఘనంగా సన్మానించారు. ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డా. మహమ్మద్ జీహాన్ సాధించిన విజయం విద్యార్థులు, యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ప్రముఖులు, యువకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకు అన్యాయం

- స్థానికత, పేదరికంపై అవగాహన లేని అధికారులు
- డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ పై వెల్లువెత్తుతున్న విమర్శలు
- ప్రత్యేక నిఘా విభాగంతో రీ-సర్వే చేయించాలని డిమాండ్



**ఖానాపూర్ సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** సొంతిల్లు లేని నిరుపేదలకు గూడు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకం పక్కదారి పడుతోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అర్హులకు దక్కాల్సిన ఇళ్లను ఏసీలు బిగించుకునే స్థాయి ఉన్న శ్రీమంతులకు కట్టబెట్టారని స్థానిక నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే లక్షల రూపాయలు వెచ్చించి అన్ని హంగులలో తీర్చిదిద్దుకొని డబల్ బెడ్ రూమ్ సైతం అమ్మకానికి పెట్టిన వారు కూడా లేకపోలేరు.

తిమ్మాపూర్ శివారులో నిర్మించిన 400 డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో 398 మందికి పంపిణీ చేశారు. అధికారికంగా మిగిలిన రెండు డబల్ బెడ్ రూమ్ లు సైతం అక్రమంగా చొరబడి ఆక్రమించుకున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే ఇందులో సగానికి పైగా అనర్హులే ఉన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అర్హులను పక్కన పెట్టి, రాజకీయ ఒత్తిళ్లకు అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే ధనికులకు ఇళ్లు దక్కాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా నిరుపేద లబ్ధిదారులు అని ప్రభుత్వం గుర్తించి నిరుపేదలకే గూడు కల్పించాలని అప్పజెప్పిన డబుల్ బెడ్ రూమ్ లను అద్దెకు ఇచ్చి వారి సొంత ఇళ్లలో డబల్ బెడ్ రూమ్ పొందిన లబ్ధిదారులు ఉంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా విక్రయానికి సైతం సిద్ధమవడంతోపాటు ఒక డబల్ బెడ్ రూమ్ ను విక్రయించినట్లు కూడా తెలిసింది.

### స్థానికత లేని సర్వేలు:

అధికారులకు స్థానికత, అసలైన నిరుపేదలపై ఎలాంటి అవగాహన లేదు. క్షేత్రస్థాయి పరిశీలన సరిగా చేయకపోవడం వల్ల స్థానికేతరులకు, ఉన్నత వర్గాలకు ఇళ్లు కేటాయించారన్న విషయాన్ని డబల్ బెడ్ రూమ్ లు దక్కని నిరుపేదలు బాహాటంగా ఆరోపిస్తున్నారు. అధికారులు తాజాగా విడుదల చేసిన అనర్హుల జాబితాలోనూ కొంతమంది నిజమైన పేదల పేర్లే ఉండటం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ప్రత్యేక నిఘా విభాగంతో సమగ్ర విచారణ చేయించాలని కోరుతున్నారు. అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఇళ్లు దక్కేలా రీ-సర్వే జరిపి న్యాయం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నిరసన హక్కు.. నష్ట నివారణా? హృదయపరివర్తనా?

సంపాదకీయం

శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు విద్యార్థుల ప్రాథమిక హక్కు. దాన్ని కాపాడటం న్యాయవ్యవస్థ బాధ్యత. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పాట్నాలో విద్యార్థులతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. పోలీసుల చర్యలతో ఈ హక్కు ఉల్లంఘించబడితే కోర్టులు మౌనంగా ఉండవని అన్నారు. ఈ మాటలు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమే. అయితే అసలు ప్రశ్న-ఇదే ప్రమాణం గతంలోనూ వర్తించిందా?

జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల నిరసన, దానిపై సుప్రీంకోర్టులో జరిగిన పరిణామాలు, న్యాయ విద్యార్థుల్లో వ్యక్తమైన అసంతృప్తి తీవ్రమైన చర్చకు దారితీశాయి. నల్సార్ విద్యార్థుల నుంచి కూడా అభ్యంతరాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు నిరసన హక్కును బలంగా సమర్థిస్తూ ప్రధాన న్యాయమూర్తి మాట్లాడటం సహజంగానే ప్రశ్నలు రేకెత్తిస్తోంది. గత వ్యాఖ్యలు సందర్భం తప్పుగా ప్రచారమయ్యాయని వివరణ ఇవ్వవచ్చు. కానీ అత్యున్నత న్యాయస్థానాన్ని నడిపించే వ్యక్తి మాటలపై ఏర్పడిన సందేహాలను "తప్పుగా అర్థం చేసుకున్నారు" అనే వివరణతోనే ముగించగలమా? ఒక వ్యాఖ్య వల్ల న్యాయ విద్యార్థుల్లోనే న్యాయవ్యవస్థపై అసంతృప్తి పెరిగితే, దాని ప్రభావాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం లేదా?

ఇక్కడే రాజీనామా ప్రశ్న వస్తుంది. రాజీనామా శిక్ష కాదు; నైతిక బాధ్యతను స్వీకరించే మార్గం. అత్యున్నత న్యాయపదవిలో ప్రజల విశ్వాసం కీలకం. ఆ విశ్వాసంపై తీవ్రమైన సందేహాలు తలెత్తినప్పుడు పదవిలో కొనసాగడమే ఏకైక మార్గమని భావించడం సరికాదు. "నేను తప్పు చేయలేదు" అనడం ఒక హక్కు. "నా వల్ల సంస్థపై విశ్వాసం దెబ్బతింటే నేను తప్పుకుంటాను" అనడం మరింత ఉన్నతమైన బాధ్యత.

న్యాయవ్యవస్థకు ప్రజల విశ్వాసమే మూలధనం. అది దెబ్బతిన్నదన్న భావన విస్తరించినప్పుడు మరో ప్రకటనతో దాన్ని పూడ్చలేరు. తన మాటలు, వ్యవహారశైలి లేదా తనపై ఏర్పడిన ప్రజాభిప్రాయం వల్ల నిష్పక్షికతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని భావిస్తే, పదవికి అంటిపెట్టుకుని ఉండటంకంటే దాని గౌరవాన్ని కాపాడుతూ తప్పుకోవడమే ఉన్నత నైతిక ప్రమాణం.


ఇది వ్యక్తిగత వ్యతిరేకత కాదు; న్యాయవ్యవస్థను బలహీనపరచే డిమాండ్ కూడా కాదు. విమర్శకులు, అసమ్మతివాదులు, విద్యార్థులు, తనపై ప్రశ్నలు వేసేవారికీ నిరసన హక్కు సమానంగా వర్తిస్తుందని ఆచరణలో నిరూపించాలి. మాటలకు, ఆచరణకు మధ్య తేడా ఉంటే ప్రజా విశ్వాసం మరింత దెబ్బతింటుంది.

రాజీనామా కోరడం ఒక వ్యక్తిని అవమానించడం కాదు. అత్యున్నత పదవికి అత్యున్నత నైతిక ప్రమాణం ఉండాలని కోరడం. ప్రజాస్వామ్యంలో ఏ పదవీ వ్యక్తిగత హక్కు కాదు; ప్రజల విశ్వాసంతో అప్పగించిన బాధ్యత. ఆ విశ్వాసంపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తినప్పుడు సమాధానం మాటలతోనే కాదు, అవసరమైతే పదవితోనూ ఇవ్వాలి.

నిరసన హక్కును కాపాడటం న్యాయవ్యవస్థ బాధ్యత. న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని కాపాడటం పదవిలో ఉన్నవారి బాధ్యత. ఆ విశ్వాసాన్ని నిలబెట్టలేని పరిస్థితి వస్తే, పదవిని వదులుకోవడానికైనా సిద్ధంగా ఉండటమే నిజమైన నైతిక ధైర్యం. ఇప్పుడు దేశం ఎదురుచూస్తున్నది మరో ప్రకటన కాదు-ప్రజా విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు స్వీకరించబోయే నైతిక బాధ్యత ఏమిటన్నదే.

# కులాధిపత్యంపై జాషువా కలం తిరుగుబాటు

*గుర్రం జాషువా జయంతి - సెప్టెంబర్ 28*



"చెప్పులు కుట్టు వాని సేవకు భరతవాని అప్పు పద్దస సుమీ"- గుర్రం జాషువా పలికిన ఈ ఒక్క వాక్యం భారతీయ కులవ్యవస్థలోని సామాజిక, ఆర్థిక వైరుధ్యాలను బట్టబయలు చేస్తుంది. అందువల్ల "భరతవాని అప్పు పద్దు" అనే జాషువా మాటను శ్రమకు సమాజం చెల్లించాల్సిన చారిత్రక రుణానికి ప్రతీకగా చూడవచ్చు. శ్రమించే బీసీ ఎస్సీ ఎస్టీ కులాలకు గౌరవం, ఆర్థిక భద్రత, సమాన అవకాశాలు, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేకుండా సామాజిక న్యాయం సంపూర్ణం కాదనే భావన ఇందులో అంతర్లీనంగా ఉంది. వేల ఏళ్లుగా శ్రమతో సమాజాన్ని నిర్మించిన సబ్బండ శ్రామిక కులాలకు గౌరవం, సమానత్వం, సామాజిక గుర్తింపు దక్కకపోవ దాన్ని ఆయన ప్రశ్నించారు. శ్రమజీవుల పట్ల సమాజం చారిత్రకంగా రుణపడి ఉందనే భావనను అత్యంత సరళమైన, పదునైన భాషలో వ్యక్తం చేశారు. 1895 సెప్టెంబర్ 28న గుంటూరు జిల్లా వినుకొండ ప్రాంతంలో జన్మించిన జాషువా చిన్ననాటి నుంచే కులవివక్ష, అవమానాలను ఎదుర్కొన్నారు. ఆ అనుభవాలను ప్రతిఘటనకు ఇంధనంగా, కవిత్వాన్ని సామాజిక ప్రశ్నగా మలిచారు. 1971 ఆగస్టు 24న ఆయన మరణించినా, ఆయన అక్షరం సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటాల్లో నేటికీ సజీవంగా ఉంది.

**అసమానతలను ప్రశ్నించిన కవి.**

కవిత్వాన్ని సామాజిక ఆయుధంగా మలిచిన కవి జాషువా. కులమే మనిషి విలువకు కొలమానంగా మారిన కాలంలో జాషువా అట్టడుగు మనిషి జీవితాన్ని సాహిత్య కేంద్రంలోకి తీసుకొచ్చారు. "గబ్బిలం" వంటి రచనల్లో అంటరానితనం, సామాజిక అవమానం, ఆత్మగౌరవం వంటి ప్రశ్నలను బలంగా ముందుకు తెచ్చారు. ఆయన కవిత్వం బాధను నమోదు చేయడంతో ఆగిపోలేదు. బాధకు మూలమైన కుల అసమానతను ప్రశ్నించింది. గబ్బిలం, గాడిద, గుర్రం వంటి ప్రతీకల ద్వారా అణగారిన జీవన వాస్తవాలను సాహిత్యంలోకి తీసుకొచ్చారు. జాషువా కాలం నుంచి నేటికి కులవివక్ష రూపాలు మారినా, కులం ఆధారంగా అవకాశాలు, గౌరవం, ప్రాతినిధ్యం, సామాజిక స్థానం నిర్ణయించే ధోరణులు అనేక రూపాల్లో కొనసాగుతున్నాయి. విద్య, ఉద్యోగాలు, భూమి, రాజకీయాధికారం, సామాజిక ప్రతిష్ఠ వంటి రంగాల్లో సమాన అవకాశాల కోసం దళిత-బహుజన వర్గాలు ఇప్పటికీ పోరాడుతున్నాయి. సాంకేతికంగా దేశం ముందుకు సాగుతున్నా, అట్టడుగు 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీలకు నిర్ణయాధికారంలో సముచిత భాగస్వామ్యం, విద్య-ఉపాధిలో సమాన అవకాశాలు వంటి ప్రశ్నలు ఇంకా ప్రాసంగికంగానే ఉన్నాయి. అందుకే జాషువా కవిత్వం చరిత్ర పుటల్లో నిలిచిపోయిన సాహిత్యం కాదు, వర్తమానాన్ని ప్రశ్నించే అర్థం. "చెప్పులు కుట్టు వాని సేవకు..." అనే వాక్యం నేడు మరింత విస్తృతమైన అర్థాన్ని సంతరించుకుంటోంది. చెప్పులు కుట్టే మాదిగ కులం నుంచి సమస్త సబ్బండ కులాల సమాజాన్ని నడిపించే శ్రమజీవులందరి శ్రమకు గౌరవం, భద్రత, సమాన హక్కులు లభించాలనే ప్రశ్నను అది ముందుకు తెస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో బీసీ ఎస్సీ ఎస్టీ ల విముక్తి ఉద్యమ సారథి డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో సాగిన "దళిత శక్తి" ఉద్యమ కరపత్రంలో జాషువా వాక్యాన్ని వినియోగించడం. ఇదీ ఆయన ఆలోచనలు సమకాలీన బహుజన చైతన్యంతో అనుసంధానమవుతున్న తీరుకు ఒక ఉదాహరణ. పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రలోనూ ఈ భావన ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని రగిలించే నినాదంగా వినిపించింది.

**జాషువా - బహుజన విముక్తి స్వరం**

జాషువా కవిత్వంలో కులవివక్షను ప్రశ్నించడం, శ్రమకు గౌరవం కల్పించడం, అణగారిన మనిషి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం, సమానత్వాన్ని కోరడం ప్రధానాంశాలు. ఈ భావాలు అంబేద్కర్ సామాజిక విముక్తి ఆలోచనలతో అనుసంధానమయ్యే అనేక అంశాలను కలిగి ఉన్నాయి. అంతటి గొప్ప కవికి ఆయన జీవించిన కాలంలోనూ, ఆ తరువాత కూడా ఆధిపత్య వర్గాల నుంచి ఆశించిన స్థాయిలో ఆదరణ, గుర్తింపు లభించలేదనే చర్చ ఉంది. ఈ నేపథ్యంలో బహుజన రాజ్యాధికార ఉద్యమ పితామహుడిగా ప్రసిద్ధి చెందిన కాన్షీరాం వినుకొండకు వచ్చి జాషువా విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రపంచానికి తెలియజేశారు.

జాషువా కవిత్వం ఊహాజనిత తిరుగుబాటు నుంచి పుట్టింది కాదు. కులవివక్షను అనుభవించిన మనిషి జీవితంలో నుంచి పుట్టిన ప్రశ్నల స్వరం. పేదరికం, కులమత భేదాలను తన గురువులుగా పేర్కొన్న ఆయన, అవి తనలో సహనంతో పాటు ఎదిరించే శక్తిని పెంచాయని చెప్పారు. అందుకే ఆయన కవిత్వాన్ని కేవలం సాహిత్యంగా కాకుండా సామాజిక ప్రతిఘటనగా చూడాల్సిన అవసరం ఉంది. నేడు దళిత-బహుజన సమాజాల నుంచి అనేక మంది కవులు, రచయితలు, కళాకారులు ముందుకు వస్తున్నారు. అయితే జాషువా వారసత్వాన్ని కొనసాగించడం అంటే ఆయన పేరును స్మరించడం మాత్రమే కాదు. ఆయన ప్రశ్నించిన అసమానతలను వర్తమానంలో గుర్తించడం, దళిత, బహుజన హక్కుల కోసం నికార్సైన భావజాలంతో మాట్లాడటం, సామాజిక సమానత్వం-రాజకీయ ప్రాతినిధ్యం-ఆత్మగౌరవం కోసం అక్షరాన్ని ఉపయోగించడం. ఈ నేపథ్యంలో జాషువా కవిత్వం నేటి బహుజన సమాజానికి ఒక కీలక సందేశాన్ని అందిస్తుంది. శ్రమకు గౌరవం, మనిషికి సమానత్వం, అణగారినవారికి ఆత్మగౌరవం, ప్రజలకు సముచిత భాగస్వామ్యం. జాషువాను నివాళి పూలమాలలకే పరిమితం చేయకుండా, ఆయన ప్రశ్నలను వర్తమానంలో కొనసాగించే కార్యాచరణగా మారాలి.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# భగత్ సింగ్ దేశభక్తుడు మాత్రమే కాదు - గొప్ప హేతువాది



భారతదేశ దాస్య శృంఖలాలను తెంచడానికి నవ్వుతూ ఉరికొయ్యను ముద్దాడిన మహావీరుడు షహీద్ భగత్ సింగ్. సెప్టెంబర్ 28 ఆయన జయంతి. భగత్ సింగ్ అనగానే మనకు ఆయన ధైర్యసాహ సాలు, వీరత్వం, అంతులేని దేశభక్తి మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ, ఆయన కేవలం ఒక సాయుధ పోరాట యోధుడు మరియు భారత స్వాతంత్ర సమరంలో ప్రముఖ ఉద్యమకారుడు మాత్రమే కాదు... ఆయనలో ఒక గొప్ప మేధావి, సామాజిక తత్వవేత్త, ప్రగతిశీల హేతువాది ఉన్నారని చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

గ్రుడ్డి నమ్మకాలపై గర్జన - "నేను ఎందుకు నాస్తికుడిని అయ్యాను అనే పుస్తక రచన .....


లాహోర్ జైలులో ఉరిశిక్ష కోసం ఎదురుచూస్తున్న ఆఖరి రోజుల్లో భగత్ సింగ్ రాసిన నేను ఎందుకు నాస్తికుడిని అయ్యాను అనే పుస్తకం ఆయన మేధోమథనానికి, హేతువాద దృక్పథానికి సజీవ సాక్ష్యం. దేవుడు, మతం, కర్మ సిద్ధాంతం పేరుతో ప్రజలను మభ్యపెట్టి, అణచివేతను సహించేలా చేస్తున్న వ్యవస్థను ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు. ఒక దేశం స్వేచ్ఛ వాయువులు పీల్చుకోవాలంటే కేవలం వలస పాలకుల నుంచి విముక్తి లభిస్తే సరిపోదని, మతం, మూఢనమ్మకాల మానసిక బానిసత్వం నుంచి కూడా ప్రజలకు విముక్తి కలగాలని ఆయన బలంగా నమ్మాడు.

**ప్రశ్నించడమే ప్రగతికి మూలం ....**

పాత నమ్మకాలను గ్రుడ్డిగా అంగీకరించడం మానసిక బానిసత్వం. విమర్శనాత్మక ఆలోచన , ప్రశ్నించే తత్వం లేని సమాజం ఎప్పటికీ అభివృద్ధి చెందదు" అని భగత్ సింగ్ స్పష్టం చేశాడు. ఎవరైనా ఒక విషయాన్ని చెబితే, అది తరతరాలుగా వస్తున్న ఆచారమైనా సరే, దానిని తర్కంతో విశ్లేషించిన తర్వాతే అంగీకరించాలని ఆయన యువతకు పిలుపునిచ్చాడు.


**నేటి సమాజానికి భగత్ సింగ్ స్ఫూర్తి ....**

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచం అంతరిక్షాన్ని జయిస్తున్న ఈ రోజుల్లో కూడా, మన సమాజం ఇంకా కుల, మత జాడ్యాల్లో, మూఢనమ్మకాల చీకట్లలో మగ్గుతుండటం బాధాకరం. బాబాలు, దొంగ స్వాములు, జ్యోతిష్యం, వాస్తు, చేతబడుల పేరుతో అమాయక ప్రజలు మోసపోతూనే ఉన్నారు. గ్రహణాల పేరుతో భయాలు, పిల్లి ఎదురైతే అపశకునం లాంటి అర్థం లేని నమ్మకాలు ఇంకా ప్రజల మెదళ్లను తొలిచేస్తున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో భగత్ సింగ్ హేతువాద భావజాలం నేటి యువతకు అత్యంత ఆవశ్యకం. యువత కేవలం ఆయన చిత్రాన్ని తమ టీ-షర్టులపై వేసుకుంటే సరిపోదు, ఆయన ప్రగతిశీల ఆలోచనలను మెదడులో నింపుకోవాలి. మూఢనమ్మకాల నిర్మూలన సంఘం తరపున యువతకు నేను చేసే విజ్ఞప్తి ఒక్కటే.. ప్రతి విషయాన్ని శాస్త్రీయ కోణంలో చూడండి. సమాజంలో వేళ్లూనుకుపోయిన అశాస్త్రీయ విధానాలను సాహసోపేతంగా ప్రశ్నించండి. సైంటిఫిక్ టెంపర్ (శాస్త్రీయ దృక్పథం) అలవర్చుకున్న నాడే భగత్ సింగ్ కలలు కన్న నిజమైన నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. జోహార్ భగత్ సింగ్!



గుర్రాల నాగరాజు జర్నలిస్ట్
(MA,PGDJ)
9573188975
మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం
(MNS)
తెలంగాణ రాష్ట్ర యూత్ జాయింట్
సెక్రెటరీ

# జాతీయ కవి- జాషువ





తరతరాలుగా సమాజాన్ని పట్టిపీడిస్తున్న అస్పృశ్యతను, దారిద్ర్యాన్ని పారద్రోలడానికి తన కలాన్ని కరవాలంగా ఝుళిపించిన మహాకవి గుఱ్ఱం జాషువా. ఆయన తేదీ 28.9.1895న గుంటూరు జిల్లా వినుకొండ గ్రామంలో లింగమాంబ, వీరయ్య దంపతులకు జన్మించాడు. చిన్నతనం నుంచే దుర్భరమైన పేదరికాన్ని అనుభవిస్తూనే మరోవైపు కుల వివక్షతను ఎదుర్కొంటూ అందుకు ప్రతిఘటనగా తన సృజనాత్మకమైన రచనలతో సమాజానికి కనువిప్పు కలిగించాడు. ఉపాధ్యాయునిగా, ఆకాశవాణి ప్రయోక్తగా విధులు నిర్వహించిన జాషువా అనాథ, స్వప్న కథ, గబ్బిలం, కాందిశీకుడు, నేతాజీ వంటి ఖండకావ్యాలతో పాటు, ఫిరదౌసి, ముంతాజ్ మహల్, క్రీస్తు చరిత్ర అనే కావ్యాలు రాశాడు. తనకి ఇష్టమైన పద్య ప్రక్రియలోనే జాషువా "నా కథ" పేరుతో స్వీయ చరిత్రను వెలువరించాడు. నవయుగ కవి చక్రవర్తి బిరుదాంకితుడైన జాషువా రాసిన క్రీస్తు చరిత్ర అనే కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. శాసనమండలి సభ్యులుగా వ్యవహరించారు. భారత ప్రభుత్వం తరపున "పద్మ భూషణ్" పురస్కారాన్ని అందుకున్నారు.

"నా కవితా వధూటి... సిగ్గగున్" అని వాపోయిన జాషువా కాళిదాసు మేఘ సందేశాన్ని దృష్టిలో పెట్టుకుని అంటరానితనాన్ని ఇతివృత్తంగా, గబ్బిలం వాహికగా పరమేశ్వరునికి తన వేదనను వినిపించడం అపూర్వం, అభినవం. మేఘసందేశం ప్రణయ సంబంధితమైతే గబ్బిలం అస్పృశ్యత, ఆకలి కేకల ఆర్తనాదాలకు ప్రతిబింబం. వర్ణ దృక్పథాన్ని, వర్గ దృక్పథాన్ని దృష్టిలో పెట్టుకుని జాషువా "నాదు కన్నీటి కథ సమన్వయము చేయ, ఆర్ద్ర హృదయంబు గూడ కొంత వసరంబు" అన్నాడు. "నిమ్న జాతుల కన్నీటి నీరదములు, పిడుగులై దేశమును కాల్చివేయున'ని హెచ్చరించాడు. దళిత దండోరాను వినిపించినట్లు "వాని తల మీద పులిమి న పంకిలమును, కడిగి కరుణింప లేదయ్యే గగనగంగ" అని ఆక్రందించాడు. అనుభవించి పలవరించాడు కాబట్టే జాషువా కవిత్వం కదిలిస్తుంది. కరిగిస్తుంది. దళితులను గురించి నిర్వచిస్తూ ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ "సాంఘిక దోపిడీకి గురవుతున్న వారు, అస్పృశ్యులుగా పరిగణింపబడుతున్నవారు, నీచ వృత్తులుగా భావింపబడుతున్న వృత్తులు చేసుకుంటున్న వారు, శారీరక శ్రమపై ఆధారపడి బ్రతుకు బండిని లాగుతున్న వారు, శతాబ్దాలుగా విద్యకు, విజ్ఞానానికి, వికాసానికి దూరం చేయబడిన వారు దళితులు అని నిర్వచించారు. ఆ దళిత శ్రమజీవిని తలచుకుంటూ మానవతావాదముతో "వాని రెక్కల కష్టంబు లేని నాడు, సస్యరమ పండి పులకింప సంశయించు, వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు, భోజనము బెట్టు వానికి భుక్తి లేదు" అని ప్రశ్నించాడు. జాషువా ఎంతటి సామాజిక చైతన్యవంతుడో అంతటి భావుకుడు. ఆయన రాసిన సాలీడు, గిజిగాడు, శిశువు మొదలైన ఖండికలు పాఠకులను అలరిస్తాయి. శిశువును గూర్చి వర్ణిస్తూ "ఉయ్యేల దిగని భాగ్యోన్నతుండు" అని గిజిగాడిని "పులుంగు టెకిమీడవురా" అని భాగవతంబు నా బాలశిక్ష అని అభివర్ణించారు. మాతలకు మాత సకల సంపత్సమేత అని భారతమాతను, అర్థ దిగంబరేశ్వరుడని గాంధీని, శిలలు కరిగి బాష్పజలములు జిమ్మగ పలికినాడు నిమ్నజుల చరిత్ర అని అంబేద్కర్ ను కీర్తించాడు.

"ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలం నిప్పుల లోన కరిగిపోయె" అని జాషువా రాసిన శ్మశాన పద్యాలను సత్యహరిశ్చంద్ర నాటకాలలో ఆలపిస్తున్నారు.

ఫిరదౌసి కావ్యంలో గజనీ మహమ్మద్ తన పూర్వ వైభవాన్ని చాటుతూ కావ్యం రాయమని చెప్పి పూర్తయిన తర్వాత తనకు ఇస్తానన్న బంగారు నాణాలకు బదులు వెండి నాణాలను పంపడం మోసంగా భావించి "రాజు తల మీద కవి కప్పురంబు జల్లె, సుకవి తల మీద రాజు నిప్పుకలు విసరె" అని వేదన చెందాడు. అలాగే ముంతాజ్ మహల్ కరుణ రస నిర్భరమైన కావ్యం. గర్భవతి అయిన ముంతాజీ చలి జ్వరంతో మరణించడంతో రెక్క విరిగిన పక్షిలాగా విలవిలలాడుతూ షాజహాను "నిన్ను నాదరంబులో దాచుకున్న మహికి, రత్నగర్భాఖ్య నేడు సార్థకమయ్యే, నీవు తల మీద దాల్చి మన్నించు కతన, వసుధనొక బొగ్గ కోహినూరు వజ్రమయ్యే" అంటూ ఆమె శరీరాన్ని తనలో దాచుకోవడం వల్ల భూమికి రత్నగర్భ అనే పేరు అలాగే తనను తల పైన ధరించినందున కోహినూరు వజ్రంగా పేరు పొందినదని అభివ్యక్తం చేశాడు. అందుకే ఆమె ప్రణయ సంకేతానికి ప్రతీకగా పరాకాష్టగా షాజహాన్ తాజ్ మహల్ ను నిర్మించాడు."ప్రతిమల పెండ్లి చేయుటకు... క్షుత్తులారునే" అని లోకం తీరును ఎండగట్టాడు. "ధర్మమునకు పిరికితనమెన్నడును లేదు, సత్య వాక్యమునకు చావు లేదు" అనే సార్వకాలిక సత్యాన్ని చాటాడు. పోతన రాజులను " ఇమ్మనుజేశ్వరాధ ముల్" అని, ధూర్జటి "రాజుల్మత్తుల్ "అని విమర్శిస్తే జాషువా "టక్కరివి"(మోసగాడు) అని ఈసడించాడు. గవ్వకు సాటి రాని పలుగాకుల మూకలు అసూయ చేత ఆయనను ఏ విధంగా దూరినా తనదైన శైలిలో శరపరంపరగా రచనలను సంధించాడు. ఆయన మార్గాన్ని మరింత విస్తృతం చేస్తూ కుసుమ ధర్మన్న, బోయి భీమన్న, కత్తి పద్మారావు, శివసాగర్, గద్దర్, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి, జి.లక్ష్మీ నరసయ్య, మాస్టార్జీ మొదలైన వారెందరో ఆయన తాత్విక దృక్పథాన్ని విశ్లేషిస్తూ ఎన్నో రచనలు చేశారు.

వ్యక్తిత్వమే కవిత్వంగా, కవిత్వమే వ్యక్తిత్వంగా పెనవేసుకుని పోయిన అరుదైన కవి జాషువా. ఆయన తన నేపథ్యాన్ని గురించి వివరిస్తూ "జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నా గురువులు ఇద్దరు. పేదరికం. కులమత బేధం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే రెండోది నాలో ఎదిరించే శక్తిని పెంచింది" అని చెప్పుకున్నారు. "కుల మతాలు గీచుకున్న గీతల జొచ్చి, పంజరాన కట్టువడను నేను, నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు, తిరుగు లేదు విశ్వనరుడ నేను" అని ప్రకటించుకున్నారు. ఇలా వస్తు వైవిధ్యం గల పద్య కవిత్వంతో ఇటు పాఠకులను అటు ప్రజలను చైతన్యపరిచిన జాతీయ కవి జాషువా తేదీ 24.7.1971 న అస్తమించారు.

"రాజు మరణించె నొక తార రాలిపోయె,
కవియు మరణించె ఒకతా ర
గగన మెగసె,
రాజు జీవించెవ రాతి విగ్రహములందు,
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు" ఇలా ఆయన రాసిన పద్యమే ఆయనకూ అన్వర్థశీ కావడం కాల మహిమ.

గుఱ్ఱం జాషువ జయంతి సందర్భంగా..



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

# భారత కార్యకల్పనలలో నిపుణుడు - శంకర్ గుననియోగి

(సెప్టెంబర్ 28 శంకర్‌గుననియోగి వర్ధంతి సందర్భంగా)

79 ఏళ్ళు నిండిన భారతదేశ కార్యకల్పనల పరిధిలో సాయంత్రపు అన్ని రాక్షసులు కొలువు. అందులో ప్రధానమైనవి కార్యకల్పనల మరియు రంగాల్లో గొప్ప యోగులు వలె సాధించిన 8 గణులు మరియు కార్యకల్పన, కాకా కాలేజీలను కార్యకల్పనల అందరూ సమస్యలు తీర్చగల సాధకులు అయ్యే అభివృద్ధిని సాధించారు. వారిని రాక్షసులు ఏజెంట్లుగా చేయగలగడం గాని అది చంద్రా కార్యకల్పనల కేవలంగానే కాగలిగిన కార్యకల్పనలు కావు రాక్షసులు ఆ సాధనా విషయంలో వెలితిపడకపోతే సమస్యలు అపి చంద్రా తీసుకొని రాక్షసులు, రాక్షసులు రాక్షసులు అనుకొని జీవిత పరిధులు నెల్లూరు నుంచి కార్యకల్పనలు అందుకున్నారు. ఆ విషయంలో మనకు శంకర్ గుననియోగి లాంటి రాక్షసులు నాయకుడు ఉండటం మంచిది కాదు. నాయకుడు (లేక యాయిప్పుడు) రాక్షసులు ప్రధానంగా కోళ్ళదులు కాని వివిధ ఆజ్ఞాపాలకాలు గల వారు వలె వెల్లుబడులు ప్రధానంగా కాపాడుకునే సైకిల్ లాంటి పద్ధతులతో రాజు చల్లనికి (ప్రాంత అపాచారం ముఖ్యంగా 10 కార్యకల్పనలు 10 రాక్షసులు లేదా శంకర్ గుననియోగి అందుకున్న కార్యకల్పన. "నిర్వాహక" అనే పద్ధతిని నడుపుతూ కార్యకల్పన, పైన చూడాలు రాక్షసుల్లో (ప్రాంత కోళ్ళు. కార్యకల్పన కోసం అందరూ ప్రధానంగా కోళ్ళ నిర్మాణాలు, సిగ్నల్స్ అందుకు కోసం సాధన. ముఖ్యంగా రంగం సాధన నిర్మాణానికి అన్నిటికీ (ప్రాంత కోళ్ళు. నిర్మాణ సాధనలు. బిల్డింగ్ సైజు రాక్షసులను దూరం ఉంచాలని ఏర్పాటుచేసిన కొనసాగింపు. అయితే బిల్డింగ్ లాగా పడక పెట్టి రాక్షసులను పరిమితం కాక, చల్లనికి నిండ్డి, బామామాగా అనుకున్నప్పుడు అపాచార కార్యకల్పనలు నిర్మించి అన్నిటికీ వచ్చాయి. నిర్మాణ 1977లో చల్లనికి పైని (భూమి నుంచి (బి.ఎం.బి.ఎన్) సైంటిస్ట్. నిండ్డి కొనసాగింపులో రాజ్యంపైన నిర్మించి పడకలు వ్యక్తిగతంగా కార్యకల్పన లేక దూరం ఉంచి కోసం వెల్లుబడులు 8ను చేశాయి కోళ్ళ (భూమి నుంచి కోళ్ళు, రాజ్య విజయాలు సాధించింది. నిర్మాణ చల్లనికి మరొక ముఖ్యంగా రాక్షసులతో (ప్రాంత భక్తులనుంచి ఈ పద్ధతులు దూరంగాను పరిగణించడం కొద్దీ చేశాయి. ఇలా చేసి చేశారు కొనసాగింపు కొనసాగింపులకు కాక కార్యకల్పన, పరమ (భక్తుల ఆధిపత్యం నిర్మించి ఉన్న కొద్దీ.

యోగ్యతపరంగా మనకు అందరికీ రంగాలు నిండ్డి కార్యకల్పన, వివిధ పద్ధతుల్లో కార్యకల్పన తీసుకొని యాస్వర్యపరంతి పరిధుల్లో (ప్రాంతపడితే సూర్యకాంతి సైకిల్, శంకర్ గుననియోగి లాంటి కార్యకల్పనలు వంటి కొనసాగింపు సైకిల్ కార్యకల్పనలు అన్ని ముఖ్యమైన రాక్షసులు నేలా గావించి. (ప్రా చేసే దీని పరిధి కోసం ప్రధానంగా అందుకుంటున్న నిర్మించిన దీర్ఘకాలంగా శ్రీకృష్ణ పరమ. కార్యకల్పన రాక్షసులు కోసం ఉన్నప్పుడు పద్ధతిలో శంకర్ గుననియోగి ప్రధానంగా, దూరంలో లోబడి నిర్మించగలరు కొనసాగింపు వారు పద్ధతి. నిర్మాణంలో, రాజ్యంలో కావాలి కార్యకల్పనలు పాలు జరిగి సెప్టెంబర్ 28న నుంచి 31న వరకు 31మంది వారు కావాల్సిన. 1991లో సెప్టెంబర్ 28న కేడు, ఇతర వెల్లుబడులు కలిసి రాక్షసులు. ఆ రాక్షసులు సెప్టెంబర్ (భూమి నుంచి 8ను అప్పుడు నాయకుడిని కోళ్ళ రాక్షసులు నిర్మాణ వ్యాప్తంగా కమ్యూనిటీ సైకిల్ సంబంధాలు చెప్పగలి (భూమి నుంచి కార్యకల్పన మరియురాక్షసులు పరిధులు తీసుకొన్న. ఆకర్షణీయంగా వ్యక్తిగతంగా అందుకున్న కార్యకల్పన రాక్షసులు కోసం దూరంగాను దూరంగాను శ్రీకృష్ణ పాలకాలు కొనసాగింపు కార్యకల్పన రాక్షసులు సాధించారు. పరిధి మనకు ముందున్న అని తీసుకొని చల్లనికిలోని దీర్ఘం ఉన్న, పద్ధతిలో కొనసాగింపు. కార్యకల్పన కోసం పాల్ లో మనకు ఆ సాధ్యమైన కార్యకల్పన (ప్రాంతపడితే దూరం చేశాయి. కార్యకల్పన పద్ధతులు. మరియు రాక్షసులు. కార్యకల్పన ప్రధానంగా సందర్భంగా. కార్యకల్పన పైన తెలిసిన సందర్భంగా భక్తుల దూరం ప్రధానంగా అందుకుంటున్న, బంద్రాంతి, నిర్మించి, కేడు (ప్రాంత మరియు 1991 సెప్టెంబర్ 27 రాజు అందు పద్ధతి నాయకుడు దీర్ఘం సాధించిన దీర్ఘం ఉండేది కావాలు కలిసి రాక్షసులు. శంకర్ గుననియోగి నిర్మాణ రాజ్య అయినా బామా ఆయన కార్యకల్పన నాయకుడు కాక కాపాడుకున్న కాదు కాని విధం రాక్షసులు. శంకర్ గుననియోగి అయిన దీర్ఘం ఇతను మన భక్తుల మరియురాక్షసులు కొనసాగించాడు. అంటే సందర్భంగా, ఇతర కార్యకల్పనలు బిల్డింగ్, అపాచార నిర్మాణాలు లేదా అమ్ముకున్న, మంచి ఇతర భక్తుల దూరం భక్తులు కొనసాగించాడు. అది ఉన్న దూరం భక్తులు అమ్ముకోని కోసం దూరంగాను (ప్రాంత కొనసాగించాడు. ఆ విధంగా ఇతని కార్యకల్పన పాలకాలు దూరం మనకు ఆకాశం పరిధులు. 50 కేసులో వద్దు అన్ని పద్ధతి మరియురాక్షసులు వచ్చిన అన్ని పద్ధతుల్లో సీనియర్ సాధ్యం. వాట్లో వద్దు అప్పుడు దూరం కమ్యూనిటీ సైకిల్ సదుపాయం దూరం తీసుకొన్న. 1964లో కమ్యూనిటీ సైకిల్ బి.ఎం.బి.ఎన్. అయినప్పుడు, ఆ మరియురాక్షసులో కమ్యూనిటీ సైకిల్ నాయకుడు ఆ బి.ఎం. అప్పుడు బి.ఎం.బి.ఎన్, రిజిస్ట్రేషన్ అయినప్పుడు. అందులో దీర్ఘం అయిన పైన కాదు కావాల్సిన సాధకులు ఇతను. అప్పుడు బి.ఎం.బి.ఎన్ 1968 జూన్ 22న వచ్చింది. దీనిలో అపాచార నిర్మాణం 1971లో చల్లనికి లో దూరం ముఖ్యమైన సైకిల్ ఉన్న పరిధులు సందర్భంగా. ఇది సైకిల్ దూరం, కాకుడు సూర్య కలి కార్యకల్పన నిర్మించి. 1975లో రాజ్య ముఖ్యమైన సైకిల్ ఉన్న అందు ఇతను. అప్పుడే కమ్యూనిటీ కార్యకల్పన ఎ.ఎం.ఎస్ లాంటి కార్యకల్పన నుంచి 10ను కార్యకల్పనలు అప్పటి సైకిల్. చల్లనికిలో అపాచార ఇతను, రాజ్య రంగాలు దీర్ఘ రాక్షసులో ఉన్న, ముఖ్యం ప్రాంత కార్యకల్పన మరియురాక్షసులు ఎ.ఎం.ఎస్, ఎ.ఎం.ఎస్ లాంటి కార్యకల్పన నుంచి దూరంగానున్న కార్యకల్పన వ్యక్తిగత దూరం మరియురాక్షసులు. అది 308 పరమ మాత్రమే కార్యకల్పన రాక్షసుల్లో 70 శాతం దూరం మరియురాక్షసులు. రాజ్య వ్యక్తిగత శంకర్ గుననియోగి అందుకున్న ఆ 3 పరమ మాత్రమే నిండ్డి కార్యకల్పన అందుకు దీర్ఘ పర్య 3ని రాక్షసుల్లో నివరణ దూరాల్లో వచ్చాయి. కార్యకల్పన, దూరంగాను మరియురాక్షసులు ఆ అన్ని మాత్రమే దూరంలో వ్యక్తిగత అప్పుడు కొనసాగింపు సాధించారు.

ఆ సమయంలో బి.ఎం.ఎస్, ఎ.ఎం.ఎస్, బి.ఎం.ఎస్, లాంటి కార్యకల్పన నుంచులు సైనిక రాక్షసులు లేవు. కార్యకల్పన కార్యకల్పన రాక్షసులు కోళ్ళ చల్లనికి పైని (భూమి నుంచి (బి.ఎం.బి.ఎన్) లేదా శంకర్ గుననియోగి నాయకుడు. ఆ కార్యకల్పన నుంచి నిర్మాణ అందుకున్నప్పుడు రంగాల్లో అయినప్పుడు. దాని ఉన్నట్లు మనం అందు కార్యకల్పన రాజ్యానికి గొప్ప సాధించిన దీర్ఘం సాధించిన దీర్ఘం పాలకాలు నిర్మించి. 1977లో రాజ్యంపైన చేశాయి కోళ్ళ కొనసాగింపు. మేమందరం అందు వాలం కేవలంలో జూన్ 1 నుంచి కార్యకల్పనలు ముఖ్యమైన తీసుకొన్న. జూన్ నుంచి జూన్ రెండు ఉన్నట్లు దూరం గొప్పగా నిర్మించినట్లు ఉన్న కొనసాగింపులో అప్పటి కోళ్ళ. అప్పుడు తీసుకున్నట్లు మరొక రాక్షసులు పరిధులు చేశాయి. అది 7 కోళ్ళు కావాలు అని 7గురు కార్యకల్పనలు ఉన్న కొనసాగింపులో తీసుకొన్న. అప్పుడు మరొకరంగంలో మరొక కార్యకల్పనలు అందుకు గుననియోగి. అందులో అనుకొన్న దూరం, మంచు అని ఉన్న దూరం కార్యకల్పన మరియురాక్షసులు కాక మన దూరం అయినప్పుడు ఇలా దూరం తీసుకొన్న అయినప్పుడు ఇలా. కోళ్ళు మరియురాక్షసులు పరమాత్మ దూరం అప్పుడు రాజ్య 18ను కార్యకల్పన నిర్మించి ముఖ్యమైన తీసుకొన్న. పైని దూరంగాను. కార్యకల్పనలు దూరం అప్పుడు కాక దూరం పడక దూరం.

మిగితా తరువాయి సంచికలో..



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

## కుషాయిగూడలో సందడి చేసిన ప్రముఖ నటి హెబ్బా పటేల్

• చెన్నై షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన హెబ్బా పటేల్



**కాప్రా, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** హైదరాబాద్ కాప్రా సర్కిల్ కుషాయిగూడలో ప్రముఖ నటి హెబ్బా పటేల్ సందడి చేసింది. కుషాయిగూడ శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన చెన్నై షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి హెబ్బా పటేల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నై షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ఎగ్జిబిషన్ లో మీ కుటుంబానికి అందరికీ కావలసిన వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 27వ తేదీ నుండి అక్టోబర్ 19వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ ఉంటుందని రానున్న పండగలు, పర్వదినాల నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు ఈ ఎగ్జిబిషన్ సేల్ ను సందర్శించి తమకు నచ్చిన ఉత్పత్తులు కొనుగోలు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు, చిన్నారులు, భార్యభర్తలు, తమ ఫ్రెండ్స్ తో పాటు అందరితో కలిసి చెన్నై షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్ లో షాపింగ్ చేసి తమకు నచ్చిన వస్త్రాలు కొనుగోలు చేయాలని కోరారు. దీనితో పాటు బోడుప్పల్ లోకూడా ఎగ్జిబిషన్ సేల్ లను ప్రారంభించడం గొప్ప విషయం అన్నారు. చెన్నై షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్ లో అతి తక్కువ ధరకే నాణ్యమైన డ్రెస్ మెటీరియల్, పట్టు, ఫాన్సీ చీరలు, చిన్నారుల రెడీమేడ్ డ్రెస్సులు, పంచలు, ధోతీలు, దుప్పట్లు, బెడ్ షీట్లు, కర్టెన్లు, రంగురంగుల పట్టు చీరలు ఇలా అన్ని రకాల వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫ్యాక్టరీ నుండి హోల్ సేల్ లో నేరుగా కొని ప్రజలకు సేల్ చేయడం కారణంగా తక్కువ ధరకే లభిస్తాయని అందరూ సద్వినియోగం చేసుకోవాలని హెబ్బా పటేల్ కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నై షాపింగ్ మాల్ యాజమాన్యం, ఉద్యోగులు, వినియోగదారులు, హెబ్బా పటేల్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## యోగా, వాకింగ్‌తోనే సంపూర్ణ ఆరోగ్యం

• డీఎస్పీ నర్సింగ్ యాదయ్య



**తాండూరు, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** యోగా, వాకింగ్ తోనే సంపూర్ణ ఆరోగ్యంసాధ్యమని డీఎస్పీ నర్సింగ్ యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని సెయింట్ మార్క్స్ హై స్కూల్ గ్రౌండ్ లో తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్యని జై శ్రీరామ్ వాకింగ్ టీమ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యోగా, వాకింగ్ సభ్యులతో ఆరోగ్యం, రోజువారీ జీవనశైలి మరియు వాకింగ్ ప్రాముఖ్యత గురించి వివరించారు.ప్రతిరోజూ ఉదయం యోగా మరియు వాకింగ్ చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. మంచి ఆరోగ్యం కోసం యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ప్రతిరోజూ ఉదయం వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్యకరమైన జీవితం, ప్రశాంతమైన మనసు, ఆనందమయ జీవనం సొంతమవుతుందని తెలిపారు.

## ఫార్మాసిటీ రైతుల సమస్యలపై నేడు ఇబ్రహీంపట్నం ప్రజాభవన్ ముట్టడి

**యాచారం, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** ఫార్మాసిటీ రైతుల సమస్యలను పరిష్కరించడంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నేడు ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్ ను ముట్టడిస్తున్నట్లు ఫార్మాసిటీ ఉద్యమ నాయకులు ప్రకటించారు.యాచారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తమ డిమాండ్లను వివరించారు. రైతుల భూములను నిషేధిత జాబితా నుండి తక్షణమే తొలగించి ఆన్ లైన్ లో నమోదు చేయాలి. గౌరవ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్ ప్రకారం భూమిలేని రైతు కూలీలకు న్యాయం చేయాలి.భూములు ఇచ్చిన రైతులందరికీ ఫ్లాట్ల సర్టిఫికెట్లు వెంటనే అందజేయాలి. ఫార్మాసిటీ జీవోను తక్షణమే రద్దు చేయాలి. రైతుల సమస్యలు పూర్తిగా పరిష్కరించే వరకు గ్రామాల్లో జరుగుతున్న పనులను నిలుపుదల చేయాలి. కొత్త ప్రాజెక్టుకు సంబంధించి ముందుగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల అనుమతి తీసుకోవాలి. రైతుల ఐక్యతను చాటేందుకు ఈ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో మేడిపల్లి, నానక్ నగర్, తాటిపర్తి, కురుమిద్ద గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఎస్టీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలి


• నంగారా బేరీ లంబాడి హక్కుల పోరాట సమితి




**ముషీరాబాద్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఎస్టీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని నంగారా బేరీ లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ధరావత్ గణేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి నూతన జాతీయ అధ్యక్షుడిగా ధరావత్ గణేష్ నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బానోతు రాజ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ముడావత్ రవీందర్ నాయక్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా సుశీల బాయ్ ఎన్నికయ్యారు. అనంతరం ధరావత్ గణేష్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో జాప్యం చేస్తే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తామని హెచ్చరించారు.తెలంగాణలో గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. గిరిజనులకు మంత్రి పదవి కల్పించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం సమితి నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు పూల్‌సింగ్ నాయక్, పరుశురాం నాయక్, సుహాసిని, శివానీ, తణిష్క, సుశీల, ఇందల్ రాథోడ్, వెంకట్ బంజారా, రాజ్‌కుమార్, జైపాల్ నాయక్, బాలు నాయక్, హారీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మాసిటీ స్థానంలో ఫ్యూచర్ సిటీ ఆచరణ సాధ్యం కాదు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. శంషాబాద్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శంషాబాద్ మణికొండ కు చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి సమక్షంలో వివిధ పార్టీల నుంచి టిఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పుప్పాలగూడ మీదుగా ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైలు పొడిగింపునకు సర్వం సిద్ధం చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టును విఫలం చేసిందన్నారు. కరెంటు కోతలు, ట్రాఫిక్ సమస్యలు, రియల్ ఎస్టేట్ రంగం ఇబ్బందులతో ప్రజలు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన కోసం గత ప్రభుత్వం రూ.16 వేల కోట్లు మంజూరు చేసి 32 ఎస్టీపీల నిర్మాణానికి చర్యలు



చేపట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా వేయలేదని కేటీఆర్ విమర్శించారు. పేదలకు కొత్తగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం జరగలేదని, ఫార్మాసిటీకి బదులు ఫ్యూచర్ సిటీ నిర్మిస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ ఆచరణ సాధ్యం కాదని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిపించిన తర్వాత రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరి సీఎం రేవంత్ రెడ్డి సరసన చేయడానికి గల కారణాలు ప్రజలందరికీ తెలుసని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఘన్సిమియాగూడ, సుల్తాన్‌పల్లి భూముల కోసమే ఆయన కాంగ్రెస్‌లో చేరారని, తిరిగి మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక ఇంచు భూమిని కూడా వదలమని హెచ్చరించారు. ఈ సందర్భంగా మణికొండ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం దూళిపాల ఆధ్వర్యంలో మణికొండకు చెందిన మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. సాయిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ బి. రాజు, పాపాలాల్ సింగ్, మాజీ సర్పంచ్‌లు యాలాల నరేష్, బి. జైహింద్ రావు, మాజీ కౌన్సిలర్ యాలాల లావణ్య, చిత్తల రాజేందర్ గౌడ్, బి. అజయ్, బి. శ్రీనివాస్, ఎం. రామకృష్ణారెడ్డి, టి. గోవిందు, కాల్వ రమేష్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.అలాగే శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లి, కేబీ దొడ్డి గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కే. వీరాచారి, అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొనమెల శ్రీనివాస్,కొలన్ ప్రదీప్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

**కాప్రా, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) వెంటనే పదవి నుంచి తొలగించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని అంబేద్కర్ కూడలి వద్ద జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్. బోస్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, ఈ ప్రక్రియలో అన్యాయంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధరించాలని కోరారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను, ప్రజాస్వామ్య పద్ధతిలో దాని కార్యకలాపాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు గతంలో సూచించిన విధంగా ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ద్వారా ఎన్నికల కమిషనర్లను నియమించే విధానాన్ని తీసుకురావాలని కోరారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం కోసం భగత్ సింగ్, మహాత్మాగాంధీ నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. బీజేపీయేతర లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలతోపాటు పౌరసంఘాలు, ప్రజలు పెద్దఎత్తున ఈ ఆందోళనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయని, సమస్య కేవలం 'సర్'కే పరిమితం కాలేదని, ఎన్నికల సంఘం విశ్వసనీయతే ప్రశ్నార్థకంగా మారిందని



అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపుతోపాటు సర్ కు సంబంధించిన అంశాలపై ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు 14 సార్లు తమ విభేదాలను నమోదు చేసినట్లు వారు తెలిపారు. కమిషనర్ల అనుమతి లేకుండానే సీఈసీ నిర్ణయాలు తీసుకోవడంపై ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు చాలాకాలంగా వ్యక్తం చేస్తున్న అనుమానాలను తాజా పరిణామాలు బలపరుస్తున్నాయని వారు పేర్కొన్నారు. సర్, ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియలు పారదర్శకంగా, వికేంద్రీకృతంగా ఉన్నాయన్న ఈసీ వాదనలు తప్పని రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్, సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు రాఘవేంద్రరావు, నర్సింహా రావు, కార్యకర్తలు రాజ్ కుమార్, గిరి బాబు, శేఖర్, సుదర్శన్, అశోక్, సుధీప్, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

## రామంతపూర్‌లో బైక్ దహనం

• రోడ్డుపై నిలిపిన ద్విచక్ర వాహనానికి నిప్పంటించిన దుండగులు

రామంతపూర్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) : రామంతపూర్‌లో బైక్ దహనం ఘటన కలకలం రేపింది. రోడ్డుపై పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనంపై గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బైక్ పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనకు గల కారణాలు, నిప్పంటించిన వ్యక్తుల వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తాండూరు విద్యారంగంలో కొత్త శకం



**తాండూరు, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల సంఘం (పిఎస్ ఎ) 2026-28 సంవత్సరాలకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం తాండూరులో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి 450 మందికి పైగా ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు, యాజమాన్యాలు హాజరై సందడిగా మార్చారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. నూతన కార్యవర్గం వివరాలు.. అధ్యక్షుడిగా గంజిపల్లి ప్రశాంత్ కుమార్, గౌరవ అధ్యక్షుడిగా:ఐఆర్ ఎ స్కూల్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ద్యావరి జయవర్ధన్ రెడ్డి కోశాధికారిగా అబ్దుల్ సలీం, ఉపాధ్యక్షులుగా నాగార్జున స్కూల్ కల్పన, శివం స్కూల్ గూలి శివకుమార్,సంయుక్త కార్యదర్శులుగా స్మార్ట్ కిడ్స్ విష్ణువర్ధన్ రెడ్డి, అభ్యాస్ స్కూల్ కవిత,పెద్దేముల్ మండల ఇంచార్జ వివేకానంద స్కూల్ కరుణాకర్ రెడ్డి,బషీరాబాద్ మండల ఇంచార్జ బ్రిలియంట్ కాన్వెంట్ స్కూల్ రాజశేఖర్, న్యాయ సలహాదారుగా ప్రగతి స్కూల్ జిలాని ముఖ్య సలహాదారులుగా కే.పి. హెచ్ ఎస్ గోపిచంద్, మొయిన్ కాన్వెంట్ ఇస్మాయిల్, శివసాగర్ స్కూల్ అగ్గనూరు కిరణ్ కుమార్, సెయింట్ మేరీస్ స్కూల్ జసింతా బాస్కో వ్యవహరించనున్నారు.ముఖ్య అతిథి డా. భాస్కర యోగి స్ఫూర్తి ప్రసంగం.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత-2026-27, ప్రముఖ స్పీకర్ డా. భాస్కర యోగి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "విద్యకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యా వ్యవస్థ అనే నాలుగు స్తంభాలు ఉన్నాయి. కేవలం బోధన మాత్రమే కాదు, ప్రతి విద్యార్థి మానసిక స్థితిని అర్థం చేసుకుని బోధించడమే నిజమైన ఉపాధ్యాయుడి లక్షణం" అని సూచించారు. అనంతరం ఆయనను సంఘం ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడు గంజిపల్లి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ పదవిని అధికారంగా కాకుండా సేవ చేసే అవకాశంగా భావిస్తున్నాను. ఈ బాధ్యత నాది మాత్రమే కాదు, మనందరిది. నేను అనే భావన కాకుండా మనం అనే స్ఫూర్తితో తాండూరు విద్యారంగ అభివృద్ధికి కలిసి పనిచేద్దామని పిలుపు నిచ్చారు.

## గబ్బిలాలపేటలో ప్రభుత్వ పాఠశాల నిర్మించాలి




**జవహర్‌నగర్, సెప్టెంబర్ 27 (జనసాక్షి) :** జవహర్‌నగర్ పరిధిలోని గబ్బిలాలపేటలో విద్యార్థులు, తల్లిదండ్రుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలను తక్షణమే నిర్మించాలని తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ (టీపీఎఫ్) డిమాండ్ చేసింది. గబ్బిలాలపేటలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణంపై టీపీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ తెలంగాణలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనియంత్రిత ప్రైవేట్ పాఠశాలల ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత కారణంగా అనేక కుటుంబాలు ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. విద్యను వ్యాపార వస్తువుగా కాకుండా ప్రతి బిడ్డకు అందాల్సిన హక్కుగా ప్రభుత్వం గుర్తించాలని కోరారు.

### గబ్బిలాలపేటకు ప్రభుత్వ పాఠశాల అత్యవసరం

గబ్బిలాలపేటలో ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో స్థానిక పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సి వస్తోందని సమావేశంలో పేర్కొన్నారు. పెరుగుతున్న ఫీజులు తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని పెంచుతున్న నేపథ్యంలో గబ్బిలాలపేటలో అన్ని సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ గబ్బిలాలపేటలో ప్రభుత్వ పాఠశాల సాధన కోసం టీపీఎఫ్ చేస్తున్న పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రజల విద్యా హక్కు కోసం జరిగే ఉద్యమంలో భాగస్వాములుగా ఉంటామని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలపై ప్రైవేట్ విద్యా ఫీజుల భారాన్ని తగ్గించాలని టీపీఎఫ్ నాయకులు కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకుని బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఐఏఎస్ అధికారులు ఎంవీ రెడ్డి, ఎం. చంపాలాల్, సృజన యాదవ్, షేక్ షావలి, సీపీఐ, సీపీఎం నాయకులు, గబ్బిలాలపేట కాలనీ ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలి

• నంగునూరులో 'మాల విద్యార్థి గర్జన' పోస్టర్ ఆవిష్కరణ

• విద్య, ఉద్యోగాల్లో అర్హులైన మాల విద్యార్థులకు న్యాయం చేయాలి

**నంగునూరు, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** విద్య, ఉద్యోగ నియామకాల్లో అమలవుతున్న రోస్టర్ విధానాన్ని సమగ్రంగా పునః సమీక్షించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో 'మాల విద్యార్థి గర్జన' మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ వద్ద రోస్టర్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ నియామకాల్లో అమలవుతున్న ప్రస్తుత రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమానంగా అందేలా నియామక ప్రక్రియలోని రోస్టర్ విధానాన్ని ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 'మాల విద్యార్థి గర్జన' మహాసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో తమకు జరుగుతున్న అన్యాయాలను మహాసభ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అర్హులైన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మాల విద్యార్థులు, నిరుద్యోగ యువత తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని నాయకులు కోరారు. రోస్టర్ విధానంపై సమగ్ర చర్చ జరిపి, సామాజిక న్యాయం, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నియామక విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రోస్టర్ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, నంగునూరు గ్రామ సర్పంచ్ సనాదుల బాల పోచయ్య, మాలమహానాడు నాయకులు శ్రవణ్, అల్లిబిల్లి నరసింహారావు, బడే రాజయ్య, రాగుల కనకయ్య, పులి రవి, రాగుల కృష్ణ, దాసరి రమేశ్, జెల్ల



మహేందర్, దండు ఆనంద్, సాయి శ్యామ్, బడే అజయ్, రాకేశ్, ఈశ్వర చందు, కార్యదర్శి రాజు ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ నాస్తిక్, ఎంఎన్ఎస్ జిల్లా సభ్యులు శేఖర్, బుట్టి సాయి, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు, మండల స్థాయి బాధ్యులు, యువకులు హాజరయ్యారు. 'మాల విద్యార్థి గర్జన' మహాసభకు విద్యార్థులు, నిరుద్యోగ యువత, సామాజిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ప్రాథమిక విద్య రక్షణకు ప్రభుత్వం పాటుపడాలి



**మనోరహాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ప్రాథమిక విద్య పరిరక్షణకు పాటుపడాలని ఎస్ జి టియు సంఘాల డిమాండ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, జీవో నంబర్ 25 సవరణ కోసం సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్‌జీటీయూ) ఆధ్వర్యంలో అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి తెలిపారు. తూప్రాన్‌లోని లింగారెడ్డి గార్డెన్‌లో ఆదివారం ఎస్‌జీటీయూ తెలంగాణ రాష్ట్ర స్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సంకినేని మధుసూదన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, అదనపు కార్యదర్శి పండుగ అంజయ్య, రాష్ట్ర కార్యదర్శులు సోమసుందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షుడు జింక అశోక్‌తో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ జీవో నంబర్ 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఎస్‌జీటీలను నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను విదేశీ పర్యటనలకు పంపడం కంటే క్షేత్రస్థాయిలో ప్రాథమిక పాఠశాలలను సందర్శించి అక్కడి సమస్యలను అధ్యయనం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ కాంపిటెంట్ స్కూళ్లలో ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పీఆర్సీలో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్ల మధ్య ఉన్న వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో హెడ్‌మాస్టర్లుగా పనిచేస్తున్న ఎస్‌జీటీలకు హెచ్‌ఎం అలవెన్స్ పెంచాలని, విద్యాశాఖలో జీవో 190ను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలకు వెంటనే జీవోలు విడుదల చేయాలని కోరారు. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి అమలు చేయడంతో పాటు పెండింగ్ బిల్లులన్నింటినీ త్వరితగతిన చెల్లించాలని అన్నారు. జీవో 11, 12లను సవరించి స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులకు ఎస్‌జీటీలకు అవకాశం కల్పించాలని కోరారు. ఎఫ్‌ఎల్‌ఎన్ కాంపిటెంట్ స్కూళ్ల నుంచి ఎస్‌జీటీలను వర్క్ అడ్జస్ట్‌మెంట్ నుంచి మినహాయించాలని అన్నారు. విదేశాల్లో మాదిరిగా ప్రాథమిక విద్యకు, ప్రాథమిక పాఠశాలలకు, అక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వివిధ కారణాలతో దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో విద్యా వాలంటీర్లను నియమించాలని సూచించారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సంకినేని మధుసూదన్‌రావు మాట్లాడుతూ ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ పంచాయతీ కేంద్రంగా నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఒక హెడ్‌మాస్టర్ ఉండే విధంగా విద్యా వ్యవస్థను రూపొందించాలని కోరారు. దీర్ఘకాలంగా పదోన్నతులకు నోచుకోని ఎస్‌జీటీలకు క్రమం తప్పకుండా పదోన్నతులు కల్పించాలని, 12 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్ హోదా, 24 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఎస్‌జీటీలకు గెజిటెడ్ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక విద్య పరిరక్షణతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2న చేపట్టనున్న ఆమరణ నిరాహార దీక్షను విజయవంతం చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

## 15 రోజుల్లో క్రీడా మైదానానికి హద్దులు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు



**ఖిల్లా ఘనపురం, 27 సెప్టెంబర్ (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వెనుక, అన్‌పహాడ్ శివారులోని సర్వే నంబర్ 39లో ఉన్న క్రీడా మైదానం స్థలానికి హద్దులు ఏర్పాటు చేసి సంరక్షించాలని క్రాంతి క్రీడా అసోసియేషన్ మండల అధ్యక్షుడు యాదయ్య జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై కలెక్టర్ ఆదర్శ్ సురభి సానుకూలంగా స్పందించారు. క్రీడా మైదానానికి సంబంధించిన సుమారు 7 ఎకరాల స్థలాన్ని గుర్తించి, 15 రోజుల్లోగా హద్దులు ఏర్పాటు చేయాలని మండల తహశీల్దార్ బి. సుగుణను ఆదేశించారు. అలాగే స్థల వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఈ స్థలంలో మినీ స్టేడియం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నందున, క్రీడా మైదానానికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో స్థానిక క్రీడాకారులు, క్రాంతి క్రీడా అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## అనుమతులు లేకుండా ప్రహరీ గోడ నిర్మాణం

- మూడు నోటీసులు ఇచ్చిన స్పందన కరువు



**కొండాపూర్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** కొండాపూర్ మండలంలోని మనసాన్పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పలు సర్వే నంబర్లలో గ్రామపంచాయతీ ముందస్తు అనుమతి లేకుండా ప్రహరీ గోడ నిర్మిస్తున్నారనే ఆరోపణలపై కాంగ్రుయెంట్ రియల్టీ ఎల్‌ఎల్‌పీకి గ్రామపంచాయతీ అధికారులు మూడో నోటీసు జారీ చేశారు. సర్వే నంబర్లు 36, 37, 40 నుంచి 55 వరకు, 80 నుంచి 86 వరకు ఉన్న భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించినట్లు నోటీసులో పేర్కొన్నారు. గతంలో రెండు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో మూడో నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసు అందిన మూడు రోజుల్లో నిర్మాణ పనులు నిలిపివేసి, నిర్మించిన ప్రహరీ గోడను తొలగించాలని, నిర్మాణాలకు అనుమతులు ఉంటే సంబంధిత అనుమతి పత్రాలు, స్థల దస్తావేజులను గ్రామపంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. లేనిపక్షంలో అనుమతిలేని నిర్మాణంగా పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని కొండాపూర్ మండల పంచాయతీ అధికారి, సంగారెడ్డి డివిజనల్ పంచాయతీ అధికారికి సమాచారం కోసం పంపినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు మానుకోవాలి




**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** డీసీసీ ఉపాధ్యక్షులు టి. సాయి చరణ్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తగోళ్ల కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక పాత్రికేయుల భవనంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగోళ్ల కృష్ణయ్య మాట్లాడుతూ.. గత రెండు రోజుల క్రితం వనపర్తి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సాయి చరణ్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రెస్‌మీట్ నిర్వహించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై, పార్టీ నాయకులపై బురదజల్లడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటుగా మారిందని విమర్శించారు. సాయి చరణ్ రెడ్డిపై ఏసీబీ దాడులు జరిగాయని ఆరోపిస్తున్న వారు అందుకు సంబంధించిన ఆధారాలను చూపించాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దిశ కమిటీ జిల్లా సభ్యులు మూడవత్ రవి నాయక్ మాట్లాడుతూ.. సాయి చరణ్ రెడ్డిపై వ్యక్తిగతంగా పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎవరో రాసిన వ్యాఖ్యలను చదివి ఆరోపణలు చేయకుండా, ముందుగా సాయి చరణ్ రెడ్డి గురించి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. ఇకపై ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తగిన విధంగా స్పందిస్తారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజాయి రమేష్, పార్టీ యూత్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, లచ్చి రెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు చిన్న భీమయ్య, దేవన్న యాదవ్, శ్రీనివాస్ గౌడ్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలి
- జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రషీద్



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రం శివారులోని మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రషీద్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యా బోధన, విద్యార్థుల హాజరు, వసతి, భోజన సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించారు. ముందుగా కళాశాలలోని లెక్చరర్ల హాజరు రిజిస్టర్, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌తో పాటు కళాశాలకు సంబంధించిన వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, విద్యార్థుల హాజరు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా అందుతున్న తీరును కూడా పరిశీలించి, వారి విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం కళాశాలలోని స్టోర్ రూమ్‌ను పరిశీలించిన ఆయన అక్కడ నిల్వ ఉంచిన వంట సామగ్రి, ఇతర ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని వంట ఏజెన్సీ నిర్వాహకులకు స్పష్టం చేశారు. వంట సామగ్రిని ఎప్పటికప్పుడు పరిశీలించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వాటినే వంటకు వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా పాలు, నూనె తదితర ఆహార పదార్థాలను వినియోగించే ముందు వాటి గడువు ఎక్సపిరి డేటు తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. గడువు ముగిసిన లేదా నాణ్యత లోపించిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే పండ్లు, గుడ్లు, ఇతర పౌష్టికాహార పదార్థాలు నాణ్యతతో, తాజాగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, భోజనం తయారీ సమయంలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వంటగది, స్టోర్ రూమ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహార పదార్థాలను సక్రమంగా నిల్వ చేయాలని సూచించారు. కళాశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కళాశాల సిబ్బందికి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రషీద్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందేలా సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆదర్శనీయం

**సంగారెడ్డి, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను సంగారెడ్డి లోని ఫ్రూట్ రీసెర్చ్ స్టేషన్ (ఎఫ్‌ఆర్‌ఎస్) వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, శాసనసభ్యులు చింతా ప్రభాకర్ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. సమాజంలోని అణగారిన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బాపూజీ చూపిన సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాసేవ మార్గాలను నేటి ,తరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమాజంలోని అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## సమాజ సేవా దృక్పథంతో యువత కృషి చేయాలి

- కుమ్మరి సంఘం అధ్యక్షుడు సూగురు కుమ్మరి రాములు
- కుమ్మరి సంఘం జిల్లా యువజన అధ్యక్షుడిగా ఎస్. రామకృష్ణ



**వనపర్తి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎన్వీఆర్ బకెట్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం వనపర్తి జిల్లా 15 మండలాల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా కుమ్మరి సంఘం అధ్యక్షుడు సూగురు కుమ్మరి రాములు, ప్రధాన కార్యదర్శి సూర్యవంశం కుమ్మరి పరశురాముడు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు, 15 మండలాల అధ్యక్షులు, మండల యువజన అధ్యక్షులు, కులబంధువుల సమక్షంలో జిల్లా యువజన కమిటీ ఎన్నికను నిర్వహించారు. కుమ్మరి కులస్తుల ఏకాభిప్రాయంతో జిల్లా యువజన అధ్యక్షుడిగా ఎస్. రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్. రాముడు, కోశాధికారిగా ఎస్. రాంబాబు, యువజన ఉపాధ్యక్షుడిగా ఎస్. తేజ, కార్యదర్శిగా జి. ఎల్లస్వామిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కుమ్మరి సంఘం అధ్యక్షుడు సూగురు కుమ్మరి రాములు, ప్రధాన కార్యదర్శి సూర్యవంశం కుమ్మరి పరశు రాముడు మాట్లాడుతూ.. సమాజంలో కుమ్మరి యువత ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కలిగి, సమాజ సేవా దృక్పథంతో సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. యువతను చైతన్యపరిచి, సంఘాన్ని మరింత సంఘటితం చేస్తూ సభ్యుల సమస్యల పరిష్కారానికి చురుకుగా పనిచేయాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుమ్మరి కుటుంబానికి సకాలంలో అందేలా కృషి చేయాలని, యువజన సంఘాన్ని బలోపేతం చేసి ఐక్యతతో ముందుకు సాగాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం నాయకులు, 15 మండలాల అధ్యక్షులు, మండల యువజన అధ్యక్షులు, సంఘం ప్రతినిధులు, కులబంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ భారతి సర్వేకు గ్రామస్థులు సహకరించాలి



**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** మండల పరిధిలోని అంతాయపల్లి గ్రామంలో ఆదివారం భూ భారతి సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి తహశీల్దార్ బి. సుగుణ హాజరై గ్రామ రైతులు, ప్రజలకు భూ భారతి సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి. సుగుణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి భూ సర్వేలో భాగంగా వనపర్తి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఖిల్లా ఘనపురం మండలంలోని అంతాయపల్లి గ్రామం ఎంపికైందని తెలిపారు. సర్వే ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు గ్రామంలోని రైతులు, ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. సర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచి, అధికారులకు అవసరమైన సహకారం అందించాలని ఆమె సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి సర్వే ప్రక్రియ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ ఆనంద్, గ్రామ సర్పంచ్ నర్సిములు గౌడ్, ఉప సర్పంచ్ తోక శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గం

- ఘనంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నారాయణఖేడ్ డివిజన్ 3వ మహాసభ
- జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం నిరంతరం కృషి చేస్తాం
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి
- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్నాయకుల పిలుపు

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నారాయణఖేడ్ డివిజన్ 3వ మహాసభ డివిజన్ కార్యదర్శి కైసర్,మనిక్ ప్రభు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ మహాసభలో ఆక్టివ్‌అధ్యక్షుడు రామచందర్, ఉపాధ్యక్షులు రఘు, రాజశేఖర్, మేకల కృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పండు, జాతీయ కౌన్సిల్ సభ్యులు సుదర్శన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సిలంకోటి సురేందర్ లు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించడం తగదన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు సైతం సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వృత్తి నిర్వహణలో స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు. చిన్న, మధ్యతరహా పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల సాధన కోసం చేపట్టే ప్రతి కార్యక్రమంలో సభ్యులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంఘాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతే సంఘానికి బలం.. హక్కుల సాధనే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు.



# వ్యవసాయ క్షేత్రాల్లో వరుస చోరీలు

- వేలాది రూపాయలు నష్టపోతున్న రైతన్నలు
- విలువైన కాపర్ తీగ కోసం దొంగతనాలు



**కాజీపేట, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** వర్షాలు కురియక బావులలోని అరకోర నీటితో వ్యవసాయం చేస్తున్న సోమిడీ రైతులను దొంగలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అప్పులు చేసి, విద్యుత్ మోటార్లను సమకూర్చుకొని..వరి పంట వేసుకున్న రైతులను వరుస చోరీలు తీవ్ర నష్టానికి గురిచేస్తున్నాయి. వరుసగా రెండు రోజులు జరిగిన ఈ చోరీలతో.. రైతులు లక్షల రూపాయలు నష్టపోయారు. విద్యుత్ ను ఆన్ చేసే స్టార్టర్ నుంచి బావి లోపలికి మోటార్ ను కలిపి ఉన్న విద్యుత్ తీగలు చోరీకి గురవుతున్నాయి. ఈ తీగల విలువ దాదాపు పదివేల రూపాయల వరకు ఒక్కొక్క మోటార్కు ఉంటుంది. రెండు రోజులపాటు జరిగిన చోరీలలో దాదాపు 20 మంది సోమిడీ రైతులకు చెందిన విద్యుత్ తీగలను దొంగలు ఎత్తుకెళ్లారు

### విలువైన కాపర్ కోసమే..

సోమిడి రైతుల వెంట దొంగలు పడడం చర్చనీయాంశంగా మారింది. చాలా విలువైన కాపర్ కోసమే విద్యుత్ తీగల దొంగతనం జరుగుతుంది. ఇలా దొంగిలించిన విద్యుత్ తీగలను అక్కడే కాల్చి అందులోని కాపర్ ను ఎత్తుకెళ్లారు. ఇప్పటికైన పోలీసులచే పెట్రోలింగ్ ను చేయించేలా ప్రజాప్రతినిధిలు తగు చర్యలు తీసుకోవాలని సోమిడి రైతులు కోరుతున్నారు

# మత్తు పదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో నిర్వహించిన "నశా ముక్త్ యువ – వికసిత్ భారత్" 100 వారాల నశా ముక్త్ యువ అభియాన్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య, అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజి రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ వెంకన్న తదితరుల పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులు, యువతలో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగ సాధన, ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు సత్ప్రవర్తనను అలవర్చుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.వ్యసనం మనిషిని క్రమంగా బానిసగా మారుస్తుందని, దానికి లోనుకాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రతి ఒక్కరూ తమకు తామే బాధ్యత వహించడంతో పాటు, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటి విద్యార్థులను కూడా చైతన్యపరచాలని కలెక్టర్ సూచించారు.యువత తమ శక్తి, సామర్థ్యాలను విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, సమాజ సేవ వంటి సానుకూల కార్యక్రమాల వైపు మళ్లించాలని అన్నారు.మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వ శాఖలతో పాటు విద్యాసంస్థలు, వైద్యులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు.ప్రతి ఒక్కరు మరొక్కరితో పోచుకోనుండా.. మన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్ రిలీజ్ తో పాటు ప్రతి ఒక్కరి తో ప్రతిజ్ఞ చేయించారు..ఈ కార్యక్రమం ఏం జి యం డాక్టర్లు, అధికారులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** హనుమకొండ ప్రెస్ క్లబ్లో సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు గుడిమళ్ళ రవికుమార్ సభాధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా పివి శ్రీనివాస రావు సమాచార హక్కు చట్టం కమీషనర్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచారా హక్కు పై ప్రజలకు అహగహన ఎంతో అవసరమని ప్రతి మనిషికి ఏదో ఒక సమయంలో ఉపయోగ పడే ఆయుధం అన్ని దీన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన వివరించారు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సు కు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుత వ్యవస్థలో సమస్సలు ఎవరికీ చెప్పుకోవాలో తెలియని పరిస్థితి లో ప్రజలు ఉన్నారని ఇలాంటి సదస్సుల వలన సమాచార హక్కు చట్టం ఎంతో దోహద పడుతుందని ఆయన అన్నారు చాలా సందర్భాల్లో అధికారులకు సమస్యలు వినే ఓపిక లేకపోవడం బాధకరం అని ఆయన అన్నారు అనంతరం గుడిమళ్ళ రవికుమార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యం లో ప్రముఖ పాత్ర పోసిస్తుందని దీనిపై అవగాహనా చేయల్సిన అవసరం ఎంతైనా ఉందన్ని ఆయన అన్నారు ఈ కార్యక్రమం లో నేరెళ్ల శోభ,. శ్రీనివాస్ కుమార్, ప్రో. జ్యోతి రాణి, కొలురు వెంకన్న, పెద్ద ఆంజనేయులు, నిమల్ల శ్రీనివాస్, కూతురు సత్యనారాయణ, యం. రమేష్, మండల పరుషరాములు, తది తరులు పాల్గొన్నారు.

# మూడు తరాల ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** స్వాతంత్ర్య పోరాటం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ మూడు తరాల ఉద్యమ నేతగా పేరు గడించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మంజూరునగర్లోని బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు, వెనుకబడిన తరగతుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాపూజీ నిజాయితీ, నిస్వార్థతకు ప్రతీకగా నిలిచారని స్పష్టం చేశారు. ఐదుసార్లు శాసనసభ్యుడిగా, మంత్రిగా ప్రజలకు విశేష సేవలందించారని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇ. ఇందిర, ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్ అప్పం కిషన్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్, ఎలగొండ రాజేంద్ర ప్రసాద్, సత్యనారాయణ, గూట్ల తిరుపతి, కృష్ణమోహన్, అడ్డగట్ల శ్రీధర్, భాగవతం భిక్షపతి, కూచన కిషన్ ప్రసాద్, గొనె భాస్కర్, శేఖర్, పాశికంటి శ్రీనివాస్, షేరు కుమారస్వామి, గుండా వీరస్వామి, సుజాత, ప్రభాకర్, శ్రీధర్ తో పాటు వివిధ వెనుకబడిన తరగతుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### బాపూజీ సేవలు చిరస్మరణీయం : జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్..



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజా సేవకు, సామాజిక న్యాయానికి అంకితమైన మహోన్నత వ్యక్తి అని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన బాపూజీ ఆశయాలు, సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, రిజర్వు ఇన్ స్పెక్టర్ రత్నం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఆధునిక ఫ్రూట్ మార్కెట్కు స్థల పరిశీలన

**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** రైతులు, వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఆధునిక ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటుకు ఆదివారం స్థల పరిశీలన చేశారు.గీసుకొండ మండలం విశ్వనాథపురం గ్రామ పరిధిలో ప్రతిపాదిత స్థలాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ పులి ప్రియాంక సంబంధిత అధికారులు పరిశీలించారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం, పండ్ల ఉత్పత్తుల విక్రయానికి అనువైన మౌలిక వసతుల ఏర్పాటు చేయడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మార్కెట్ ను అభివృద్ధి చేయడం లక్ష్యంగా స్థల పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, వరంగల్ ఆర్డీవో సుమ,జిల్లా ల్యాండ్ సర్వే మరియు రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు,మార్కెటింగ్ డైరెక్టర్ రుద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# 26 కేంద్రాల్లో ఉల్లాస్ పరీక్ష



**గుడిహత్నూర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** గుడిహత్నూర్ మండలవ్యాప్తంగా 26 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ఉల్లాస్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 756 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరై పరీక్ష రాసినట్టు నిర్వాహకులు తెలిపారు. జవహర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, శ్రీ సాయికృష్ణ స్వయం సహాయక సంఘం కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి, సెర్ప్ ప్రత్యేక అధికారి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, మండల ప్రాజెక్టు సహాయకుడు, సమన్వయ కర్తలు, గ్రామ సంస్థ సహాయకులు సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

# ఆపన్నులకు అండగా సుందర్ చారిటబుల్ ట్రస్ట్

- నడవలేని ఇద్దరు మహిళలకు ఉచితంగా వీల్చైర్ల అందజేత



**దేవరుప్పుల, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు దేవరుప్పుల మండల కేంద్రంలో నడవలేని స్థితిలో ఉన్న ఇద్దరు మహిళలకు సుందర్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. దేవరుప్పుల గ్రామానికి చెందిన రెడ్డిరాజుల సోమలక్ష్మి, అప్పిడి లక్ష్మి తమ పరిస్థితిని ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి వారికి ఉచితంగా వీల్చైర్లను అందజేశారు. ఆపన్నులకు అండగా నిలుస్తున్న ట్రస్ట్ సేవలను స్థానికులు అభినందించారు. వీల్చైర్లు అందజేసిన ఏల సుందర్ కు అభినందలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిత్తూరి అశోక్ రెడ్డి, నర్రా సోమశేఖర్, రెడ్డిరాజుల రమేష్, కారూపోతుల సందీప్, నీలరపు వేణు యాదవ్, పల్సం నరసింహ, కారుపోతుల యాదగిరి, రెడ్డిరాజుల కొండయ్య, సత్తయ్య, బిక్షపతి, సోమయ్య, శివరాత్రి గంగయ్య, దుంపల సంపత్, దూలం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు వెళ్లాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కార్మిక సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ కార్మికులు, ముఖ్యంగా సింగరేణి బొగ్గు గని కార్మికుల సంక్షేమం కోసం గతంలో కెసిఆర్ నాయకత్వంలో అనేక కీలక నిర్ణయాలతో ఎంతో మంది కార్మికులకు మేలు జరిగిందని అన్నారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం శాఖ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, సింగరేణి కార్మికులు, భారత రాష్ట్ర సమితి నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థను పరిరక్షించడంతో పాటు కార్మికుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సింగరేణి భవిష్యత్తు బాగుండాలంటే కార్మికుల సమస్యలను బలంగా ప్రశ్నించే గుర్తింపు పొందిన కార్మిక సంఘం అవసరమని పేర్కొన్నారు. గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరైంది కాదని అన్నారు. ఎన్నికల నిర్వహణపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, న్యాయస్థానం తీర్పు అనంతరం ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కార్మికుల సమస్యలపై పోరాడేందుకు సంఘం నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. గత నెలల్లో మూడు సింగరేణి గనులలో కార్మికులను కలిసినప్పుడు వారు తమ సమస్యలను వివరిస్తూ, కెసిఆర్ నాయకత్వంలో సింగరేణి, కార్మిక సంక్షేమం కోసం జరిగిన కార్యక్రమాలను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. సింగరేణి సంస్థ బలోపేతం కావాలి, కార్మికుల హక్కులు కాపాడబడాలి, కార్మికుల భవిష్యత్తుకు భద్రత కల్పించాలనే లక్ష్యంతో సంఘం కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు.

## ఉపాధి హామీ పథకంలో జరిగిన

# అవినీతిపై విచారణ చేయించండి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి లింగమడుగు పల్లె గ్రామస్తులు మొర
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి ఎమ్మెల్యే ఫిర్యాదు

ఆత్మకూర్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి): జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేయకుండానే అక్రమంగా లక్షలాది రూపాయల ప్రభుత్వం నిధులు దుర్వినియోగంకు పాల్పడ్డ అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. శనివారం ఆత్మకూరు మండలంలోని లింగమడుగు పల్లె గ్రామసభ ప్రారంభం కాకముందే జిల్లా కలెక్టర్ వచ్చి విచారణ చేసి అవినీతి అధికారులను సస్పెండ్ చేసే వరకు గ్రామసభ వద్దని గ్రామస్తులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి లింగమడుగు పల్లి గ్రామస్తులు జరిగిన అవినీతి అక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే స్పందించి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి జిల్లా స్థాయి అధికారుల చేత విచారణ చేయించి అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే కోరారు. అలాగే ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో కూడా అవినీతి అక్రమాలు జరిగాయని పలు గ్రామల ప్రజలు రైతులు మహిళలు చర్చించుకుంటున్నారు. సోషల్ ఆడిట్ కు వచ్చిన అధికారులకు మర్యాదపూర్వకంగా కలవడంతో వారు కూడా చూసి చూడనట్లు వదిలిపెట్టినట్లు పలు గ్రామల కూలీలు అంటున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి వారి అవినీతి అక్రమాలు భారీ సంఖ్యలో గుట్టురట్టు అవుతుందని అంటున్నారు.

# కాలిన మృతదేహం లభ్యం


- హత్యగా అనుమానం
- పోలీసుల అదుపులో నలుగురు
- ఆయుధాలు స్వాధీనం



**చెన్నూర్, సెప్టెంబర్ 27(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం సోమనపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కాలిపోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు నీల్వాయి గ్రామానికి చెందిన కుడుకల శ్రీనివాస్గా గుర్తించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.ఈ నెల 20న మృతుడి కుటుంబ సభ్యులు నీల్వాయి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. విచారణలో హత్యకు సంబంధించిన ఆధారా లు లభించినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు ఉపయోగిం చినట్లు అనుమానిస్తున్న ఆయు ధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.ఘటన స్థలానికి వైద్య, పోలీసు అధికారులు చేరుకుని సీన్ రీకన్స్ట్రక్షన్ నిర్వహించడంతో పాటు అక్కడే పోస్టుమార్టం ప్రక్రియ చేపట్టారు.హత్యకు గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఊర చెరువులో మట్టి తవ్వకాలను ఆపేదెవరు?

- ఎల్లాయగూడెంలో యదేచ్ఛగా చెరువు మట్టి తరలింపు
- పగలు, రాత్రి కొనసాగుతున్న మట్టి దందా
- గుంతల మయమై ప్రమాద భరితంగా మారిన ఊరచెరువు
- ఊర చెరువును కాపాడాలని కోరుతున్న గ్రామస్తులు, రైతులు, మత్స్యకారులు, ఉపాధి హామీ కూలీలు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ఊర చెరువులో కొనసాగుతున్న అక్రమ మట్టి దందాను ఆపేదెవరని ఎల్లాయగూడెం గ్రామస్తులు, రైతులు, మత్స్యకారులు, ఉపాధి హామీ కూలీలు ప్రశ్నిస్తున్నారు. పట్టపగలు, రాత్రి వేళల్లో జెసిబిల సహాయంతో ఎల్లాయగూడెం గ్రామంలోని ఊర చెరువులో చెరువుకొమ్ము తండా, 16 చింతల తండా, బోడ మాణిక్యం తండా గ్రామాలకు చెందిన జెసిబి యజమానులు అక్రమ తవ్వకాలను చేపడుతూ పై గ్రామాల ట్రాక్టర్లతో పాటు ఎల్లాయగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్లలో అక్రమంగా మట్టిని బయటికి తరలించుకుపోతున్నారు.ఈ అక్రమ మట్టి దందాను అడ్డుకొని అరికట్టాల్సిన నీటిపారుదల, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఫోన్లు చేసి సమాచారం అందించిన 'మామూలు' గా తీసుకుంటున్నారని పలువురు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఎల్లాయగూడెం గ్రామంలోని ఊర చెరువులో కొందరు రాత్రి, పగలు తేడా లేకుండా జెసిబిల సహాయంతో అక్రమంగా మట్టి తవ్వకాలను చేపడుతున్నారు. తవ్వకాలను చేపట్టిన మట్టిని ట్రాక్టర్లలో బయటికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రిప్పు మట్టిని రూ 800 నుండి రూ. 1000, రూ. 1200 వరకు అమ్మకాలను చేపడుతూ తమ మట్టి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

### గుంతలతో ప్రమాదకరంగా మారిన ఊరచెరువు

గ్రామంలోని ఊర చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టడం మూలంగా చెరువు మొత్తం గుంతల మయంగా మారింది. అంతేకాక ఊర చెరువు ప్రమాద భరితంగా తయారైంది. వర్షాలు అధికంగా పడి చెరువు నిండితే తెలియక ఎవరైనా చెరువులోకి దిగితే గుంతలలో పడి చనిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు, ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే గ్రామానికి చెందిన ఓ బాలుడు చెరువులోని గుంతలో పడి మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా చెరువు మొత్తం గుంతల మయంగా మారిందని వేసవిలో ఉపాధి హామీ పనులు ఏ విధంగా చేపట్టాలని గ్రామంలోని ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఊర చెరువులో చేపలు పోసుకోవాలన్న పట్టాలన్న ఈ గుంతలతో అనేక ఇబ్బందులు ప్రమాదాలను ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామంలోని మత్స్యకారులు, ముదిరాజ్ కులస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు తగిన చర్యలు చేపట్టాలి

ఉర చెరువులో మట్టి దందా కొనసాగుతున్న ఎందుకు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు, మత్స్యకారులు, ఉపాధి హామీ కూలీలు, రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉర చెరువులో పగలు రాత్రి తేడా లేకుండా మట్టి దందా కొనసాగుతుందని సంబంధిత నీటిపారుదల, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు సమాచారం అందించిన తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి ఊర చెరువులో అక్రమంగా మట్టి దందా కొనసాగిస్తున్న వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకొని ఉర చెరువు మొత్తం గుంతల మయంగా కాకుండా కాపాడాలని పలువురు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
28 సెప్టెంబర్ 2026

# పల్లె ప్రకృతి వనంలో అడ్డగోలుగా చెట్ల నరికివేత

- విక్రయించి సొమ్ము చేసుకున్న బాధ్యులు!
- రూ.. వెయ్యిల విలువైన ప్రజాధనం బూడిద పాలు..
- బోసిపోయిన ఇందుగుల పల్లె ప్రకృతి వనం
- ఫీల్డ్ అసిస్టెంట్, మరో అధికారి కుమ్మక్కై సాగించిన దందాపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- వివరణకు అధికారులు అందుబాటులోకి రాని వైనం




**మాడుగులపల్లి, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పరిఢవిల్లాలని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందాలనే ఉన్నతాశయంతో ప్రభుత్వం రూ. లక్షల ప్రజాధనాన్ని వెచ్చించి పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అయితే, అధికారుల నిర్లక్ష్యం, కొందరు సిబ్బంది కాసుల కక్కుర్తి కారణంగా ఆ ఆశయం నీరుగారిపోతోంది రక్షించాల్సిన చేతులే భక్షకులుగా మారి పచ్చని చెట్లను తెగనరుకుతూ సొమ్ము చేసుకుంటున్న ఘాతుకం నల్గొండ జిల్లాలో వెలుగుచూసింది నల్గొండ నియోజకవర్గ పరిధిలోని మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో ఉన్న పల్లె ప్రకృతి వనంలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసి, గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకున్నట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## అనుమతుల్లేవు నిబంధనలకు పాతర!

సాధారణంగా ప్రభుత్వ ఆస్తుల్లో లేదా పల్లె ప్రకృతి వనాల్లో ఉన్న చెట్లను తొలగించాలన్నా, నరకాలన్నా అటవీ శాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన అనుమతులు ఉండాలి కానీ, ఇందుగుల గ్రామంలోని ప్రకృతి వనంలో మాత్రం ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండానే చెట్ల నరికివేత ప్రక్రియ అడ్డగోలుగా సాగిపోయింది ఏళ్ల తరబడి ఎంతో కష్టపడి, ప్రజాధనంతో పెంచిన పచ్చని చెట్లను గొడ్డళ్లకు బలిచ్చారు వనంలో దట్టంగా ఉండాల్సిన చెట్లు మాయమైపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాంతం బోసిపోయి ఎడారిని తలపిస్తోంది

## రక్షకులే భక్షకులు ఫీల్డ్ అసిస్టెంట్, సదరు అధికారి హస్తం..?

గ్రామంలోని పలువురు ప్రజలు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన నమ్మదగిన సమాచారం ప్రకారం ప్రకృతి వనాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, ఆయనతో పాటు గ్రామానికి చెందిన మరో అధికారి ఇద్దరూ కలిసి ఈ అక్రమానికి తెరతీసినట్లు తెలుస్తోంది గ్రామంలో తమకు తిరుగులేదనే ధోరణితో, స్థానికులకు అనుమానం రాకుండా పక్కా పథకం ప్రకారం చెట్లను నరికించి, రాత్రికి రాత్రే ప్రైవేటు వ్యక్తులకు, వ్యాపారులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారని గ్రామస్తులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు

## ప్రజాధనం దుర్వినియోగంపై స్థానికుల ఆగ్రహం

ఉపాధి హామీ నిధులు, పంచాయతీ గ్రాంట్ల ద్వారా రూ. లక్షలు వెచ్చించి మొక్కలు నాటి, వాటికి నీళ్లు పోసి పెంపొందించిన చెట్లను సొంత లాభం కోసం అమ్ముకోవడంపై ఇందుగుల గ్రామస్తులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు గ్రామానికి వెలుగు తెస్తుందనుకున్న ప్రకృతి వనాన్ని, అధికారులే తమ స్వార్థానికి వాడుకోవడం దారుణం ప్రశ్నించే నాథుడు లేడనే ధీమాతోనే ఈ అక్రమాలకు పాల్పడ్డారు అని స్థానికులు వాపోతున్నారు

ఫోన్‌కు స్పందించని అధికారులు

ఈ అక్రమ చెట్ల నరికివేత, విక్రయాల వ్యవహారమై వివరణ కోరేందుకు విలేకరి సంబంధిత మండల స్థాయి అధికారులకు ఫోన్ చేయగా, ఆదివారం కావడంతో అధికారులు ఎవరూ ఫోన్ ఎత్తలేదు ఫోన్ కు స్పందించకపోవడంతో అధికారుల వివరణ లభించలేదుకఠిన చర్యలు తీసుకోవాలి గ్రామస్తుల హెచ్చరిక ఇందుగుల పల్లె ప్రకృతి వనంలో జరిగిన ఈ చెట్ల నరికివేత, అక్రమ విక్రయాల ఘటనపై జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈఓ, ఎంపీడీఓ తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు దీనిపై ఉన్నతస్థాయి విచారణ కమిటీని నియమించి, అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆయనకు సహకరించిన సదరు అధికారిపై సస్పెన్షన్ వేటు వేయడమే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేస్తున్నారు అంతేకాకుండా, చెట్లను అమ్మి ఆర్జించిన సొమ్మును వారి నుంచి రికవరీ చేయాలని కోరుతున్నారు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే మండల పరిషత్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# ఉల్లాస్ పరీక్షకు మహిళల నుంచి విశేష స్పందన

- 1,431 మంది మహిళలకు గాను 1,367 మంది పరీక్షకు హాజరు
- మహిళలు విద్యావంతులై చైతన్యవంతులు కావాలి
- ఉల్లాస్ డైరెక్టర్ బీఎన్ఎన్ లక్ష్మీజీ రావు



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** తిరుమలాయపాలెం మండలం లో మహిళా సంఘాల్లోని నిరక్షరాస్య సభ్యులకు ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత పరీక్ష నిర్వహించారు. మండలంలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలో మహిళా సంఘాలకు చెందిన 1,431 మంది సభ్యులను పరీక్షకు ఎంపిక చేయగా, వారిలో 1,367 మంది పరీక్షకు హాజరై తమ విద్యా సామర్థ్యాన్ని చాటుకున్నారు.పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించేందుకు రాష్ట్ర ఉల్లాస్ డైరెక్టర్ బీఎన్ఎన్ లక్ష్మీజీ రావు, జిల్లా అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ సీహెచ్. రాజేంద్రప్రసాద్, ఉల్లాస్ జేఏ డీడీ ఏ. శ్రీనివాస్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలు పరీక్ష రాస్తున్న విధానాన్ని పరిశీలించి, వారికి పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ సందర్భంగా ఉల్లాస్ డైరెక్టర్ బీఎన్ఎన్ లక్ష్మీజీ రావు మాట్లాడుతూ ప్రతి మహిళ విద్యను అభ్యసించి అక్షరాస్యత సాధించడంతో పాటు సమాజంలో చైతన్యవంతురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. అక్షరాస్యత ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలో వారు మరింత కీలక పాత్ర పోషించగలరని తెలిపారు.మహిళా సంఘాల సభ్యులకు విద్యపై ఆసక్తి కల్పిస్తూ ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా సంబంధిత అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమం లో ఏపీఎం ఐ. సత్యనారాయణ రాజు, సీసీ ప్రభాకర్, వివో ఏ లు మేకల కృష్ణవేణి, పరికపల్లి స్రవంతి, గోపోజు ఉపేంద్ర, కరుణ, కళ్యాణి, ధనలక్ష్మి, కుసుమ, వేల్పుల సుశీల, నాగమణితో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం



**రంగారెడ్డి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ఎన్నికల వేళ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చటంతో పాటు గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా పని చేద్దామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మంచాల మండలం అంబోతుతండా గ్రామసర్పంచ్ రాణీశ్రీనివాస్, మాజీ సర్పంచ్ రఘు, వార్డు సభ్యులు హరి, మౌనికాచందర్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, గ్రామాల అభివృద్ధికి కలిసి పనిచేయాలని సూచించారు. ఈ చేరికలతో గ్రామంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక వసతులతో పాటు సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా కలిసి పని చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, బాధ్యతలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను భావితరాలకు అందించాలి

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** నీతి, నిజాయితీతో ముక్కుసూటిగా వ్యవహరిస్తూ న్యాయం, ధర్మం కోసం పోరాడిన గొప్ప పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా ఆదివారం నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో పాల కేంద్రం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ బి. చంద్రశేఖర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ పాల్గొన్నారని తెలిపారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారని, స్వాతంత్ర్యానంతరం ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. నిక్కచ్చితనం, నీతి, నిజాయితీలతో ముక్కుసూటిగా వ్యవహరించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఆయన పేరుతో ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. బాపూజీ చూపిన మార్గంలో నడుస్తూ న్యాయం, ధర్మాన్ని పాటించాలని, ఆయన ఆశయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మండల కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తూ ఆయన సేవలను ప్రజలకు తెలియజేస్తున్నామని చెప్పారు.నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం, తెలంగాణ సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్యం, తెలంగాణ కోసం పోరాడిన మహనీయుడని అన్నారు. భువనగిరి నుంచి శాసనసభ్యుడిగా ప్రజలకు సేవలందించారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయన జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాపూజీ



ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సంజీవ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ మామిడి కార్తీక్, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు పొట్టబోతుల సత్యనారాయణ, బీసీ జాతీయ నాయకుడు మిర్యాల యాదగిరి, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు దూకుడు సత్యనారాయణ, పున్నా కైలాస్ నేత, ఎంబీసీ జాతీయ నాయకులు కొండూరు సత్యనారాయణ, ఎన్సీపీ నాయకులు రషీద్, అధికారులు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సాయం అందిస్తాం

- పేదలకు కొండంత అండగా సీఎంఆర్ఎఫ్
- నియోజకవర్గంలో రూ.21.62 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ
- 8 మండలాల్లోని 5,319 మంది లబ్ధిదారులకు ఆర్థిక భరోసా
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని వివిఎం స్కూల్లో నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ అనారోగ్య సమస్యలతో కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని 8 మండలాలకు చెందిన మొత్తం 5,319 మంది బాధితులకు దాదాపు రూ.21.62 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ అనారోగ్యం బారినపడి ఆర్థికంగా చితికిపోయిన పేద కుటుంబాలను ఆదుకోవడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేయించి బాధితులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య ఖర్చుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తున్నామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు 5,319 కుటుంబాలకు ఏకంగా రూ.21.62 కోట్ల మేర ఆర్థిక సాయం అందడం నియోజకవర్గ చరిత్రలోనే ప్రత్యేకమని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా లభించిన ఈ నిధులు ఎన్నో కుటుంబాలను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించాయని చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం

ప్రజారోగ్య పరిరక్షణతో పాటు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, మెరుగైన వైద్య సేవలు



అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. సహాయం అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తమ కష్టకాలంలో ఇంతటి భారీ మొత్తంలో ఆర్థిక సాయం అందించి ఆదుకున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పి కె. నరసింహ, రాష్ట్ర పేరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ హరి సింగ్, ఆర్డిఓ శ్రీనివాసులు, మునిసిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, ఎఎంసి రాధికా దేశ్ ముఖ్, గ్రంధాలయం చైర్మన్ బచ్చు రామారావు, తహసీల్దార్ కవిత , స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు

**కల్హేర్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, ఇదివరకే ఇళ్లు మంజూరైన వారికి బిల్లులు అందేలా చూస్తానని ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మూడవ మహాసభలు, డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నిక అనంతరం నియోజకవర్గ జర్నలిస్టులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశమై తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే గృహాలు నిర్మించుకున్న జర్నలిస్టులకు మున్సిపల్ అనుమతులు ఇప్పించడంతో పాటు పెండింగ్ లో ఉన్న ఇళ్ల బిల్లుల మంజూరుకు కృషి చేస్తానని, ఈ ప్రాసెస్ ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు.



ఈ సమావేశంలో ఆత్మ చైర్మన్ వినోద్ పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

# ఖమ్మంలో సాఫ్ట్ టెన్నిస్‌కు కొత్త ఊపు..

- రాష్ట్రవ్యాప్తంగా క్రీడను విస్తరించడమే లక్ష్యం
- స్పిన్ ఆటలో నైపుణ్యమే విజయానికి కీలకం..
- సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్ర కార్యదర్శి జుజ్జూరు వెంకటేశ్వర్లు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఖేలో ఇండియా అస్మిత లీగ్స్-2026లో సాఫ్ట్ టెన్నిస్ క్రీడకు ప్రత్యేక స్థానం లభించింది. ఇప్పటివరకు హైదరాబాద్‌కే పరిమితమైన ఈ క్రీడను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు పరిచయం చేసే లక్ష్యంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొలిసారిగా పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ సౌత్‌జోన్‌కు చెందిన డాక్టర్ జుజ్జూరు వెంకటేశ్వర్లు తెలిపారు. 1984లో జపాన్‌లో పరిచయమైన సాఫ్ట్ టెన్నిస్ క్రీడను 2010లో తాను ఏపీ సౌత్‌జోన్‌లో పరిచయం చేసినట్లు ఆయన వివరించారు. లాన్ టెన్నిస్‌ను ఆధారంగా చేసుకుని అభివృద్ధి చెందిన ఈ క్రీడలో ప్రత్యేకమైన సాఫ్ట్ బాల్‌ను ఉపయోగిస్తారని తెలిపారు. ప్రత్యేక రబ్బరుతో తయారు చేసే ఈ బంతి సాఫ్ట్ టెన్నిస్‌లో మరో ప్రత్యేకత అని పేర్కొన్నారు.సాఫ్ట్ టెన్నిస్‌లో బంతికి స్పిన్ ఇవ్వడం ద్వారా ప్రత్యర్థిపై ఆధిపత్యం సాధించే అవకాశం ఉంటుందని,




ఆటలో స్పిన్‌ను సమర్థవంతంగా వినియోగించే క్రీడాకారులు విజయాలు సాధించగలరని వెంకటేశ్వర్లు వివరించారు. క్రీడాకారులకు చిన్న వయసు నుంచే శిక్షణ అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

## జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి..

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా యువజన, క్రీడల అధికారి వై. సునీల్‌రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో కొత్తగా పరిచయం అవుతున్న సాఫ్ట్ టెన్నిస్‌ను క్రీడాకారులు పెద్ద ఎత్తున ఆదరించాలని కోరారు. నిరంతర సాధనతో రాష్ట్ర, జాతీయ స్థాయిని దాటి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బ్లూమింగ్ మైండ్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాల అధినేత, కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి, ఖమ్మం జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి గోవింద్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి మూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సాఫ్ట్ టెన్నిస్ కార్యదర్శి రామ్‌కిషోర్, రిటైర్డ్ ఎంఈఓ రామాచారి, సీనియర్ టెన్నిస్ క్రీడాకారుడు పి. సుధాకర్, కోచ్ కైలాస్, లాలకాశప్, పి. హర్షిత్‌కుమార్ రాయల్, పీఈటీలు నందిని, పవన్‌తో పాటు క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీనియర్ బాలికల్లో విజేతలకు పతకాలు..

ఖేలో ఇండియా అస్మిత లీగ్స్--2026లో భాగంగా సెప్టెంబర్ 27న నిర్వహించిన సాఫ్ట్ టెన్నిస్ సీనియర్ బాలికల విభాగంలో బొమ్మ భానుశ్రీ, జవ్వాజి హర్షిత చౌదరి, పూజిత శ్రీ, శివాని విజేతలుగా నిలిచారు. విజేతలకు అశోక్‌రెడ్డి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో పోటీలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొంటుండటంతో ఖమ్మంలో సాఫ్ట్ టెన్నిస్‌కు మంచి ఆదరణ లభిస్తోంది.

# ప్రమాద హెచ్చరికకు చేరిన గోదావరి

- 43 అడుగులకు చేరిన వరద నీటిమట్టం..
- రాత్రి నుంచి తగ్గుముఖం పట్టే అవకాశం.



**భద్రాచలం, సెప్టెంబరు 27 (జనంసాక్షి) :** భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుంది. ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరుకోవడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు నీటిమట్టం స్వల్పంగా పెరిగి 43.1 అడుగులకు చేరుకుని ప్రస్తుతం నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో గోదావరి వరద ప్రవాహం రాత్రి నుంచి క్రమేపీ తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి 12 గంటలకు 35.80 అడుగులుగా ఉన్న గోదావరి నీటిమట్టం ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు 38.70 అడుగులకు, ఉదయం 7 గంటలకు 40.40 అడుగులకు, ఉదయం 11 గంటలకు 41.50 అడుగులకు చేరింది. సాయంత్రం 4 గంటలకు 42.90 అడుగులకు చేరుకుని, 5.30 గంటలకు 43 అడుగుల ప్రమాద హెచ్చరిక స్థాయిని తాకింది. దీంతో భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ట మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అనంతరం వరద ప్రవాహం స్వల్పంగా పెరిగి 43.1 అడుగులకు చేరినప్పటికీ ప్రస్తుతం గోదావరి నిలకడగా ఉంది. పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.




# ఏసీ, టీవీలు మరింత ప్రియం

**పండగ సీజన్ వేళ.. వినియోగదారులపై భారం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
పండగ సీజన్‌కు ముందు.. వినియోగదారులకు ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ కంపెనీలు షాక్ ఇచ్చాయి తమ ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఎయిర్ కండీషనర్లు, ఎల్‌ఈడీ టీవీలు, వాషింగ్ మెషిన్లు సహా ఇతర గృహోపకరణాల ధరలను 5-8 శాతం మేర సవరించాయి. కొత్త ధరలు అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతల వల్ల రాగి, స్టీల్, క్రూడాయిల్ వంటి ముడి పదార్థాల ధరలు పెరగడం, రూపాయి విలువలో హెచ్చుతగ్గులు ఇందుకు కారణాలుగా కంపెనీలు తెలిపాయి. ఎయిర్ కండీషనర్ల ధరలను 5-8 శాతం పెంచినట్లు ఆయా సంస్థల ఎగ్జిక్యూటివ్స్ తెలిపారు. వాషింగ్ మెషిన్లు, ఎల్‌ఈడీ టీవీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు 3-4 శాతం వరకు పెరిగాయి. ఈ నిర్ణయంతో పండగ సీజన్‌పై ప్రభావం పడుతుందని కొన్ని కంపెనీలు ఆందోళన వ్యక్తం చేయగా.. మరికొన్ని కంపెనీలు ఇది తాత్కాలికమేనని అంటున్నాయి. ముడిపదార్థాల ధరలు పెరగడంతో ఏసీ, రిఫ్రిజిరేటర్ల ధరలను 5-8 శాతం పెంచినట్లు బ్లూ స్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్ తెలిపారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలే ఇందుకు కారణమన్నారు. కాపర్, ప్లాస్టిక్, స్టీల్ ధరలు భారీగా పెరిగాయన్నారు. గతేడాది పండగ సీజన్‌తో పోలిస్తే ఈ సారి దాదాపు 15 శాతం ధరలు పెరిగాయన్నారు. కాగా, ఈ ఏడాది సదరు కంపెనీ ధరలు పెంచడం ఇది మూడోసారి. ముడిసరుకు రేట్లు 8-10 శాతం పెరిగాయని గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ బిజినెస్ విభాగానికి చెందిన కమల్ నంది అన్నారు. అన్ని క్యాటగిరీలపై దాదాపు 5-7 శాతం ధరలు పెంచినట్లు తెలిపారు. ఇవి అక్టోబర్ నుంచి నవంబర్ వరకు దశల వారీగా అమల్లోకి వస్తాయన్నారు. ముడిసరకుల ధరలు ఇలానే పెరిగితే వచ్చే ఏడాదీ వినియోగదారులపై భారం అనివార్యం అవుతుందని హైయర్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీష్ అన్నారు. ఎల్‌ఈడీ టీవీలు, వాషింగ్ మెషిన్లు ఇతర ఉత్పత్తులపై 2-3 శాతం వరకు రేట్లు పెంచామన్నారు. వచ్చే ఏడాది జనవరి వరకు దశల వారీగా తమ ఉత్పత్తుల ధరలను 15 శాతం వరకు పెంచుతామన్నారు. కాపర్ డిమాండ్ కారణంగానే తమ ఉత్పత్తుల ధరలను 8-10 శాతం పెంచినట్లు డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ఇండియా సీఎండీ కన్వల్జీత్ జావా తెలిపారు.దీపావళి వరకు పాత ధరలే!పండుగ సీజన్ ముందు ఈ పెంపు చేపట్టినప్పటికీ.. డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద పాత ధరలకే కొనుగోలు చేసిన సరకు ఉందని కంపెనీలు తెలిపాయి. ఈ క్రమంలో దీపావళి వరకు వినియోగదారులకు పాత ధరలకే కొన్ని ఉత్పత్తులు అందుబాటులో ఉండొచ్చు. ఆ తర్వాత పూర్తి స్థాయిలో కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి.



# జీసీసీల్లోనూ ఉద్యోగ కోతలు!

**మాతృసంస్థలు ఏఐ సామర్థ్యాలను పెంచుతుండడమే కారణం**

**కఠిన వ్యయ నియంత్రణ చర్యలూ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
భారత్‌లోని గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ)లోనూ ఈ ఏడాది వేల సంఖ్యలో ఉద్యోగ కోతలు చోటుచేసుకున్నాయని సమాచారం. ఆయా కంపెనీల మాతృసంస్థలు ఏఐ (కృత్రిమమేధ) ఆధారిత సామర్థ్యాన్ని పెంచుకోవడం, ఉద్యోగుల సంఖ్య విషయంలో కఠిన విధానాలను అవలంబించడం ఇందుకు కారణమని చెబుతున్నారు. అయితే తొలగింపునకు గురైన ఉద్యోగుల సంఖ్యపై వివిధ పరిశీలనా సంస్థలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం మనదేశంలోని 2,100కి పైగా జీసీసీ కేంద్రాల్లో సుమారు 25 లక్షల మంది నిపుణులు పనిచేస్తున్నారు. ఈ ఏడాది ఇందులో 25,000-30,000 మంది తొలగింపునకు గురైనట్లు ఈఐఐఆర్ ట్రెండ్ సీఈఓ పరీఖ్ జైన్ తెలిపారు. అయితే తొలగింపులు 4000-5000 మాత్రమేనని 3ఏఐ సీఈఓ సమీర్ ధన్రాజని పేర్కొంటున్నారు. ఇటీవల పేపాల్ సంస్థలో సుమారు 600 మంది ఉద్యోగులను తొలగించారు. వీసా దాదాపు 1,500 మందిని,



సర్వీస్‌నౌ, ఇతర చిన్న జీసీసీలు 100 మందికి పైగా ఉద్యోగులను తొలగించినట్లు తెలుస్తోంది. 'ఈ ఏడాది ప్రధాన చర్చ అంతా ఉద్యోగుల సంఖ్య, నియామకాలు- తొలగింపుల చుట్టూనే ఉంది. కీలక విషయం ఏమిటంటే.. గతంలో ఆయా సంస్థల ప్రపంచ ప్రధాన కార్యాలయాల పరిధిలో ఉన్న ఏఐ, ఇంజినీరింగ్ ఉత్పత్తి విభాగాలకు సంబంధించిన నిర్ణయాలను తీసుకోవడంలో ఇప్పుడు భారతీయ జీసీసీలకు అధిక ప్రాధాన్యం, బాధ్యత లభిస్తున్నాయ'ని జిన్నోవ్ పార్ట్‌నర్ సుకన్యా రాయ్ చెబుతున్నారు.


55% పనులపై ఏఐ ప్రభావం

జీసీసీల పనితీరులో సాధారణ స్థాయి పనులు 17.7% కాగా.. సంక్లిష్టమైనవి 38.1 శాతంగా ఉంటాయి. మొత్తం పనిలో 55% వరకు ఏఐ ప్రభావానికి లోనయ్యేలా ఉన్నట్లు చెబుతున్నారు. అంటే ఈ 55% ఉద్యోగాలు కనుమరుగు అవుతాయని కాదు. పని చేసే విధానాన్ని ఏఐ మారుస్తున్నందున, ఆయా ఉద్యోగాల్లోని పనులను పునర్వ్యవస్థీకరించే అవకాశం మాత్రమే ఉంటుంది. జీసీసీ కేంద్రాలు మరింత కీలకమైన బాధ్యతలను స్వీకరిస్తూనే, కొత్తగా తక్కువ మంది ఉద్యోగులను చేర్చుకోవడం లేదా ఉన్న ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడం వంటివి చేయొచ్చు. ఈ ప్రభావం అన్ని రంగాల్లోనూ విస్తరించి ఉన్నప్పటికీ.. రిటెయిల్, సాంకేతిక రంగాలు అధికంగా ప్రభావితమవుతున్నాయి. రిటెయిల్ కంపెనీల ఆదాయ వృద్ధి బలహీనంగా ఉండటం, వేగవంతమైన టెక్నాలజీ మార్పుల వల్ల ప్రస్తుతం ఉన్న కొన్ని నైపుణ్యాలు నిరుపయోగంగా మారుతున్నాయని సుకన్యా రాయ్ వివరించారు. సాంకేతిక సామర్థ్యాలను వ్యాపార విచక్షణతో మిళితం చేయగల ఉద్యోగులకు ప్రాధాన్యం పెరుగుతోందని తెలిపారు.

# ఫోన్‌పేలో 20,000 నియామకాలు

**ఆరో అంచె పట్టణాలు, గ్రామాలకు కార్యకలాపాల విస్తరణ**

దిల్లీ: వ్యాపార నెట్‌వర్క్ విస్తరణను వేగవంతం చేయడంతో పాటు డిజిటల్ చెల్లింపుల మౌలిక సదుపాయాలను దేశంలోని పట్టణాలు, గ్రామాలకు తీసుకువెళ్లే ప్రణాళికలను ఫోన్‌పే ప్రకటించింది.





కార్యకలాపాల విస్తరణలో భాగం గా, వచ్చే ఏడాది కాలంలో 20, 000 మందికి పైగా ఫ్రంట్‌లైన్ సేల్స్ సిబ్బందిని నేరుగా నియమిం చుకోవాలని ఫోన్‌పే యోచిస్తోంది. అలాగే 12 నెలల్లో స్మార్ట్‌స్పీకర్లు, పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్స్) పరికరాలతో పాటు 50 లక్షలకు పైగా పేమెంట్ పరికరాలను కంపెనీ అందుబాటులోకి తీసుకురానుంది. వీటిలో సుమారు 50 శాతం పరికరాలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం ద్వారా డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని ఆరో అంచె పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించనుంది.

# ప్రభుత్వ సైట్లలోకి చొరబాటు..

**ఓపెన్‌ఏఐ కీలక నిర్ణయం**

తమ ఏఐ ఏజెంట్లు అదుపుతప్పి ప్రవర్తిస్తున్నాయనే నివేదికలు పెరుగుతోన్న నేపథ్యంలో ఓపెన్ ఏఐ సంచలన నిర్ణయం తీసుకుంది. ఏఐ మోడళ్ల శిక్షణను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ప్రకటించింది. అవి తాము అప్పగించిన పనులకు మించి ముందుకు వెళ్తుండడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఇటువంటి హ్యాకింగ్‌లను ఎదుర్కొనేలా అదనపు భద్రతా చర్యలు అందుబాటులో ఉన్నాయని తమకు పూర్తి నమ్మకం కలిగిన తర్వాతే శిక్షణను తిరిగి ప్రారంభిస్తామంది. ఏఐ అభివృద్ధి చెందుతున్న కొద్దీ.. ఇతర సమస్యలు తలెత్తుతుండడంతో పలుమార్లు తమ మోడళ్ల ట్రైనింగ్‌ను నిలిపివేయాల్సి వస్తోందని పేర్కొంది. మూడు నెలల్లో ఓపెన్ ఏఐ తన మోడళ్ల అభివృద్ధిని నిలిపివేయడం ఇది రెండోసారి. జులైలో ఎఐ స్టార్టప్ 'హగ్గింగ్ ఫేస్'ను లక్ష్యంగా చేసుకున్నట్లు గుర్తించడంతో కొద్ది రోజుల పాటు ట్రైనింగ్‌ను నిలిపివేసింది. దీంతో ఏజెంట్లు సొంతంగా ప్రవర్తించడం, వెబ్‌సైట్లను హ్యాక్ చేయడం, గోప్య సమాచారాన్ని బహిర్గతం చేయడం వంటి వాటిని నిరోధించేందుకు.. రక్షణ చర్యలు చేపట్టాలని అమెరికా చట్టసభ సభ్యులు ఏఐ ల్యాబ్‌లపై ఒత్తిడి పెంచుతున్నారు. ఓపెన్‌ఏఐ ప్రత్యర్థి ఆంథ్రోపిక్ అధిపతులు కూడా ఏఐ అభివృద్ధికి కళ్లెం వేయాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మరోసారి శిక్షణను నిలిపివేసింది.




అమెరికా ప్రభుత్వ వెబ్‌సైట్లలోకి తమ ఏఐ ఏజెంట్లు చొరబడినప్పటికీ..వాటికి సంబంధించిన విలువైన సమాచారాన్ని, ప్రజలకు అందుబాటులో లేని సమాచారాన్నిగానీ అవి సేకరించలేదని ఓపెన్ ఏఐ స్పష్టం చేసింది. ప్రజలకు అందుబాటులో ఉండే సమాచారాన్నే యాక్సెస్ చేసినట్లు తెలిపింది. భద్రతా ఉల్లంఘనలకు సంబంధించిన చర్యలను తాము నిరంతరం పరిశీలిస్తున్నామంది.

# పండగల సీజన్‌లో రుణాలకు భారీ గిరాకీ

**బ్యాంకుల వద్ద అదనపు నిధులు మార్కెట్లోకి..**

**ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రోహిత్ జైన్**

**ముంబయి:** వచ్చే పండగల సీజన్‌లో రుణాలకు భారీగా గిరాకీ ఉండటంతో, బ్యాంకులు తమ వద్ద ఉన్న అదనపు నగదు లభ్యతను మార్కెట్లోకి విడుదల చేసే అవకాశం ఉందని రిజర్వ్ బాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్ రోహిత్ జైన్ తెలిపారు. ముంబయిలో జరిగిన 13వ ఎస్‌బీఐ బ్యాంకింగ్ అండ్ ఎకనామిక్స్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన పలు విషయాలు పంచుకున్నారు. విదేశీ కరెన్సీ నాన్ రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్ఆర్-బి) ప్రత్యేక డిపాజిట్ పథకం ద్వారా భారతీయ బ్యాంకులు ఏకంగా 133 బిలియన్ డాలర్ల (సుమారు రూ.12.63 లక్షల కోట్ల) నిధులను సేకరించాయని తెలిపారు. ప్రవాస భారతీయుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో, షెడ్యూల్ కంటే ఒక నెల ముందే (ఆగస్టు 31న) ఈ పథకాన్ని ముగించినట్లు పేర్కొన్నారు. ఈ అదనపు నిధులను ఫలానా రంగానికే (రిటెయిల్, పరిశ్రమలు, వ్యవసాయం) రుణాల రూపంలో ఇవ్వాలని తాము బ్యాంకులకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని డిప్యూటీ గవర్నర్ స్పష్టం చేశారు. నిధుల ప్రవాహం తర్వాత బ్యాంకుల ఆర్థిక పరిస్థితి, నగదు లభ్యతపై ఆర్‌బీఐ ఇప్పటికే బ్యాంకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమీక్షించిందని తెలిపారు. ఈ అదనపు నగదు లభ్యత అందుబాటులోకి రావడం వల్ల వచ్చే పండగ రోజుల్లో గృహ రుణాలు, కారు రుణాలు, వ్యాపార రుణాల పంపిణీ మరింత వేగవంతం కావొచ్చని పేర్కొన్నారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,62,254 | ₹ 1,77,008 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,50,000

# ఔషధ రంగ ఆదాయం భళా..

**దిల్లీ:** ఎగుమతులు వేగవంతం కావడం, దేశీయంగా గిరాకీ బలపడటం కారణంగా గత ఆర్థిక సంవత్సరంలోని 8% వృద్ధితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో భారత ఔషధ రంగం 11-13% ఆదాయ వృద్ధిని నమోదు చేయనుందని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక అంచనా వేసింది. అయితే ముడి సరుకులు, ఇంధనం, రవాణా వ్యయాలు పెరగడం వల్ల నిర్వహణ లాభాల మార్జిన్లు 150-200 బేసిస్ పాయింట్లు (1.5-2%) తగ్గి, 21-21.5 శాతానికి పరిమితం కావొచ్చని అంచనా వేసింది. ఫలితంగా కంపెనీల అధికాదాయ వృద్ధి, పూర్తిగా నికర లాభాల్లోకి ప్రతిబింబించే అవకాశం తక్కువని క్రిసిల్ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో ఔషధ రంగ ఆదాయంలో సగం వాటా కలిగి ఉన్న, క్రిసిల్ రేటింగ్ పొందిన సుమారు 190 ఔషధ కంపెనీల గణాంకాల విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక వెలువడింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూపాయి విలువ పరంగా ఎగుమతుల వృద్ధి 14-16% ఉంటుందని, ఇదే ఆదాయానికి ప్రధాన చోదక శక్తిగా నిలుస్తుందని క్రిసిల్ తెలిపింది. ఎగుమతుల్లో 83% వాటా ఫార్ములేషన్లదే (ఔషధ రూపాలదే) కాగా, ఇందులో 57% నియంత్రిత మార్కెట్లకు, మిగిలిన 43% పాక్షిక నియంత్రిత మార్కెట్లకు ఎగుమతి కానున్నాయి.దేశీయ వృద్ధి 9-11%ఈ ఆర్థిక సంవత్సరంలో 9-11% వృద్ధిని నమోదు చేయడం ద్వారా, కంపెనీల వృద్ధికి రెండో బలమైన చోదక శక్తిగా దేశీయ విపణి నిలవనుందని




క్రిసిల్ పేర్కొంది. దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలు, 5-6% వార్షిక ధరల పెంపు, గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో నమోదైన 2 శాతం వృద్ధితో పోలిస్తే 4-5 శాతానికి పుంజుకోనున్న అమ్మకాల పరిమాణ వృద్ధి దీనికి తోడ్పడనున్నాయి. కొత్త ఉత్పత్తుల విడుదల, ప్రిస్క్రిప్షన్ మందులకు పెరిగిన గిరాకీ, రెండు, మూడో అంచె విపణులకు విస్తరించడం వంటి అంశాలు అమ్మకాల పరిమాణం పెరగడానికి దోహదపడతాయని నివేదిక తెలిపింది. 'ఎగుమతుల వృద్ధి అమెరికాను మించి విస్తరిస్తోంది. సంక్లిష్టమైన జనరిక్‌లు, బయోసిమిలర్లు ఐరోపాలో ఈ రంగం ఉనికిని మరింత బలోపేతం చేస్తాయని అంచనా వేస్తున్నాం. బ్రాండెడ్ జెనరిక్‌లు, కొత్త ఉత్పత్తుల విడుదలలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా అంతటా వృద్ధిని వేగవంతం చేస్తాయి. అమెరికాలో విభిన్నమైన ఉత్పత్తుల విడుదల, నిల్వల సాధారణీకరణ వంటివి కొనసాగుతున్న ధరల ఒత్తిడిని పాక్షికంగా తగ్గించగలవ'ని క్రిసిల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సెహుల్ భట్ వెల్లడించారు.

# 'గేమ్ క్రాఫ్ట్'కు షాక్..

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆన్‌లైన్ గేమింగ్ మోసాల ఆరోపణలు ఎదుర్కొంటున్న 'గేమ్స్ క్రాఫ్ట్', సంస్థకు భారీ షాక్ తగిలింది. ఇది వరకే రూ.2,400 కోట్లకుపైగా ఆస్తుల్ని జప్తు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా మరో రూ.442 కోట్ల విలువైన ఆస్తుల్ని అటాచ్ చేసింది. సంస్థకు చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, వాణిజ్య భవనాలు, విల్లాలు, నివాససముదాయాలు, గ్రేమ్ క్రాఫ్ట్ టెక్నాలజీస్ యజమానుల పేరిట ఉన్న స్థిర, చరాస్థులు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. మనీలాండరింగ్ చట్టం కింద ఆస్తుల్ని అటాచ్ చేస్తున్నట్లు ఆదివారం ఈడీ నోటీసులు పంపింది. ఇప్పటి వరకు గేమ్ క్రాఫ్ట్ సంస్థకు చెందిన రూ.2,800 కోట్లకు పైగా విలువైన ఆస్తుల్ని ఈడీ జప్తు చేసింది.గేమ్ క్రాఫ్ట్, రమ్మీ టైమ్ టెక్నాలజీస్ సంస్థలు.. రమ్మీ కల్చర్, రమ్మీ ప్రైమ్, ప్లేషిప్ తదితర మొబైల్ యాప్‌లను అభివృద్ధి చేసి, వాటి ద్వారా ఆన్‌లైన్ రియల్ మనీ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. తద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ వాదన. ఆయా యాప్‌లను వినియోగిస్తున్న వారి సంఖ్య దేశ వ్యాప్తంగా 3 కోట్లకు పైబడే ఉంటుందని చెబుతోంది. ఈ యాప్‌లను వినియోగించి డబ్బు పోగొట్టుకున్న వారిలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకకు చెందిన వారు కూడా ఉన్నట్లు తెలిపింది. ఆయా యాప్‌లను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు వినియోగదారులను గ్రేమ్ క్రాఫ్ట్ నమ్మించిందని, అయితే, వారికి తెలియకుండా ప్రత్యేక అల్గారిథమ్‌తో పని చేసే బాట్‌లను వినియోగించడంతో.. ఆన్‌లైన్ గేమ్స్ ఆడినవారు పెద్ద మొత్తంలో కోల్పోయారని ఈడీ చెబుతోంది

# 2న 'నో యూపీఐ డే'..

**ఎండీఆర్‌కు వ్యతిరేకంగా మొబైల్ రిటెయిలర్ల ఆందోళన**



దిల్లీ: యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటును విధించడాన్ని మొబైల్ రిటెయిలర్లు వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల తమ ఆదాయానికి గండిపడుతోందని పేర్కొంటున్నారు. ఇందుకు నిరసనగా అక్టోబర్ 2న (గాంధీ జయంతి) 'నో యూపీఐ డే' నిర్వహించనున్నట్లు ఆలిండియా మొబైల్ రిటెయిలర్స్ అసోసియేషన్ వెల్లడించింది.వ్యక్తులు వ్యాపారులకు రూ.2వేలు పైబడి చేసే లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటును విధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. వ్యక్తిగతంగా చేసే లావాదేవీలకు, చిరు వ్యాపారులకు మినహాయింపు ఇచ్చారు. అయితే, ఈ రుసుముల వల్ల రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు యూపీఐ ద్వారా స్వీకరించే చిన్న వ్యాపారులపై సగటున రూ.2 నుంచి రూ.12వేల వరకు ఆదాయానికి గండిపడుతోందని అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తర్వీంద్ సింగ్ తెలిపారు. మొత్తంగా రిటైయిలర్లపై నెలకు రూ.40 కోట్లు, ఏడాదికి రూ.500 కోట్లు భారం కానుందని తెలిపారు.దీన్ని నిరసిస్తూ గాంధీ జయంతి రోజున 'నో యూపీఐ డే'ను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ రోజు క్యూఆర్ కోడ్‌లపై నల్లటి వస్త్రం కప్పి ఉంచుతామని, యూపీఐ లావాదేవీలను అనుమతించబోమని స్పష్టంచేశారు. డిజిటల్ ఇండియా కావాలంటే జీరో ఎండీఆర్ ఉండాలని డిమాండ్ చేశారు. డిజిల్ పేమెంట్స్ వృద్ధి చెందాలంటే రిటెయిల్ ఎకోసిస్టమ్‌పై ఎలాంటి ఛార్జీల భారం ఉండకూడదని తర్వీంద్ సింగ్ అన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో వ్యాపార, వర్తక సంఘాలు అక్టోబర్ 2న 'నో యూపీఐ డే'ను నిర్వహించ తలపెట్టాయి.

# పండగల వేళ సిబ్బందికి ప్రోత్సాహకాలు

**తమను వీడకుండా ఇ-కామర్స్ సంస్థల జాగ్రత్తలు**

**హైదరాబాద్:**దసరా, దీపావళి పండగల నేపథ్యంలో వెల్లువలా వచ్చే ఆర్డర్లను తట్టుకునేందుకు ఇ-కామర్స్, లాజిస్టిక్స్ కంపెనీలు సన్నాహాలు వేగవంతం చేశాయి. ఏటా పండగల సమయంలో గోదాములు, రవాణా విభాగాల్లో పనిచేసే సిబ్బంది ఒక్కసారిగా విధులకు దూరమవ్వడం పెద్ద సవాలుగా మారుతోంది. ఈ సీజన్‌లో సరకులు ప్యాక్ చేసేవారు, డెలివరీ చేసే సిబ్బంది వైదొలిగే రేటు 35-40 శాతానికి చేరుతుండటంతో ఆర్డర్లు నిలిచిపోయే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో కొత్త వారిని చేర్చుకోవడం కంటే, ప్రస్తుత ఉన్నవారిని చివరి దాకా నిలబెట్టుకోవడమే మేలని భావిస్తున్న సంస్థలు ఈసారి ప్రోత్సాహకాల బడ్జెట్‌ను 15-20 శాతం వరకూ పెంచేందుకు సిద్ధం అవుతున్నాయి.సంప్రదాయ ఇ-కామర్స్ సంస్థలకు క్విక్ కామర్స్ సంస్థల నుంచి వస్తున్న పోటీ పెరుగుతోంది. దీంతో గతంలోలాగా ప్రతి ఒక్కరికీ ఒకే రకమైన బోనస్ ఇచ్చే పద్ధతికి కంపెనీలు స్వస్తి పలుకుతున్నాయి. నిర్ణీత లక్ష్యాలు దాటిన వారికే అదనపు సొమ్ము చెల్లించే విధానాన్ని ఇప్పటికే అమల్లోకి తెచ్చినట్లు పేర్కొంటున్నాయి. వారంలో ఎన్ని రోజులు పనిచేశారు? పండగల గిరాకీ పూర్తయ్యే దాకా పనిలో కొనసాగారా లేదా అనే అంశాలకే ఆఫర్లను ముడిపెడుతున్నాయి. ఫ్లిప్‌కార్ట్, మింత్రలాంటి పెద్ద ఇ-కామర్స్ వేదికలు వేర్వేరు రకాల




ప్రోత్సాహ కాలతో సిబ్బందిని ఆకట్టుకుంటున్నాయి. తక్షణ రివార్డులు, డిజిటల్ గిఫ్ట్ వోచర్లు, కొత్త వారిని చేర్పిస్తే ఇచ్చే రిఫరల్ బోనస్‌లను విరివిగా ఉపయోగిస్తున్నాయి.లాజిస్టిక్స్ రంగంలో ప్రాథమిక వేతనాలు పెద్దగా మారనప్పటికీ, పనితీరును బట్టి, వచ్చే అదనపు ఆదాయం బాగా పెరిగింది. ద్వితీయ శ్రేణి పట్టణాల్లోని గోదాముల సిబ్బందికి మూల వేతనంపై 18 నుంచి 22 శాతం వరకూ అదనపు ఆదాయం లభిస్తోంది. మెట్రో నగరాల్లో ఈ పెంపు 12 నుంచి 15 శాతంగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.కంపెనీలు ఇచ్చే ప్రోత్సాహకాలు బాగున్నా, వాటిని అందుకునేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోందని గిగ్ కార్మిక వర్గాలు చెబుతున్నారు. లక్ష్యాలను చేరుకునేందుకు రోజుకు 12 నుంచి 14 గంటలదాకా పనిచేయాల్సి వస్తోందని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అంటోంది. తక్కువ వ్యవధిలో ఇంతటి తీవ్రమైన ఒత్తిడి మధ్య కార్మికుల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, దీర్ఘకాలంలో ఇది నిలబడటం కష్టమని స్పష్టం చేసింది.

# ప్రెస్టీజ్ గ్రూప్ రూ.2,700 కోట్ల ఐపీఓ వాయిదా

**అనిశ్చిత మార్కెట్ పరిస్థితులే కారణం**

**దిల్లీ:** అనిశ్చిత మార్కెట్ పరిస్థితులు, ఇతర కారణాలతో స్థిరాస్తి సంస్థ ప్రెస్టీజ్ ఎస్టేట్స్ తన హోటల్ వ్యాపారానికి సంబంధించిన తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రణాళికను వాయిదా వేసింది. గత ఏడాది ఏప్రిల్‌లో ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ వెంచర్స్ లిమిటెడ్ (పీహెచ్‌వీఎల్) ఐపీఓకు వచ్చేందుకు మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి ముసాయిదా పత్రాల (డీఆర్‌హెచ్‌పీ)ను దాఖలు చేసింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.2,700 కోట్ల వరకు నిధులు సమీకరించాలని కంపెనీ ప్రణాళిక వేసింది. వ్యూహాత్మక కారణాలు, అనిశ్చిత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా డీఆర్‌హెచ్‌పీని ఉపసంహరించుకోవాలని డైరెక్టర్ల బోర్డు నిర్ణయించినట్లు కంపెనీ నియంత్రణ సంస్థకు సమర్పించిన నివేదికలో తెలిపింది. కెనడాకు చెందిన పెట్టుబడి సంస్థ సీపీపీఐబీ తమ ఆతిథ్య రంగ విభాగంలో రూ.3,000 కోట్ల వరకు పెట్టుబడి పెడుతుందని ఆగస్టులో ప్రెస్టీజ్ ఎస్టేట్స్ వెల్లడించింది. కోల్‌కతాకు చెందిన అన్మోల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.1,800 కోట్ల నిధుల సమీకరణ కోసం ఐపీఓకు వచ్చేందుకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది.జే ఇన్‌ఫ్రాటెక్ రూ.600 కోట్ల నిధుల సేకరణ కోసం ఐపీఓకు




రాబోతోంది. అరేటి 22 లిమిటెడ్ రూ.440 కోట్ల ఐపీఓకు సిద్ధమైంది. ఈ రెండు సంస్థలు సెబీ వద్ద డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేశాయి.బాన్‌గంగా గోల్డ్ అండ్ డైమండ్ రూ.720 కోట్ల నిధుల సమీకరణ నిమిత్తం ఐపీఓకు రాబోతోంది. తాజా షేర్ల జారీ ద్వారా రూ.540 కోట్లు, ఓఎఫ్ఎస్‌లో రూ.180 కోట్లు సేకరించనుంది. సెబీ వద్ద ముసాయిదా పత్రాలు సమర్పించింది.డియాన్ ఎనర్జీ ఐపీఓకు వచ్చేందుకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. 72 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో ప్రమోటర్లు 20 లక్షల వరకు షేర్లను విక్రయించనున్నారు. ధరల శ్రేణి, ఇష్యూ తేదీలు వెల్లడించాల్సి ఉంది. విశాల్ నిర్మితి రూ.178 కోట్ల ఐపీఓ ఈ నెల 30న ప్రారంభమై అక్టోబరు 5న ముగియనుంది. ఈ ఇష్యూకు ధరల శ్రేణి రూ.208-220.

# 29 లక్షల కార్లను రీకాల్ చేసిన ఫోక్స్‌వ్యాగన్

దిల్లీ: స్టీరింగ్ సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 28.6 లక్షల వాహనాలను వెనక్కి పిలిపిస్తున్నట్లు (రీకాల్ చేస్తున్నట్లు) జర్మనీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ ప్రకటించింది. జర్మనీ రవాణా సంస్థ కేబీఏ ప్రకారం, 2013 నుంచి 2024 మధ్య తయారైన ఫోక్స్‌వ్యాగన్ టిగువాన్, టూరాన్, గోల్ఫ్, క్యాడీ మోడళ్లు ఈ లిస్ట్‌లో ఉన్నాయి. 2017 నుంచి 2024 మధ్య తయారైన సుమారు 7 లక్షల ఆడి కార్లనూ పిలిపిస్తున్నట్లు తెలిపింది. వాహనాల నాణ్యతా నియంత్రణ తనిఖీల్లో కొన్ని భాగాల్లో తుప్పు ఉన్నట్లు గుర్తించారు. తుప్పు కారణంగా ఒక బోల్ట్ విరిగిపోయే అవకాశం ఉందని, దాని వల్ల స్టీరింగ్ పనిచేయకుండా పోయే ప్రమాదం ఉందని కేబీఏ తెలిపింది. అయితే ఈ సమస్య కారణంగా ఇప్పటివరకు ఎలాంటి ఘటనలు నమోదు కాలేదని అధికారులు పేర్కొన్నారు. అయినా కూడా ముందు జాగ్రత్త చర్యగా ప్రభావిత వాహనాలను పిలిపించి, మరమ్మతులు చేస్తామని వివరించారు. డీలర్ నుంచి సమాచారం వచ్చేవరకు వాహనాలను వినియోగించొచ్చనీ పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
28 సెప్టెంబర్ 2026




## రూ 5.04 లక్షలు ఇల్లు కట్టుకున్న వారికి ఇవ్వాలని డిమాండ్

గత ఎన్నికల సమయంలో ప్రతినిర్వాసితునికి రూ 5.04 లక్షలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ తదితరులు ఇచ్చిన హామీ మేరకు ఇల్లు కట్టుకున్న ప్రతి నిర్వాసితునికి రూ 5.04 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇల్లు నిర్మించుకొని వారికి 4696 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ప్రభుత్వం ఇల్లు నిర్మించుకున్న నిర్వాసితుల గురించి ఆలోచన చేయడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# సీఎం పర్యటనతో నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం లభించేనా?

**నాడు పీసీసీ అధ్యక్షుడిగా, ఎంపీ హోదాలో నిర్వాసితులకు మద్దతు..**

- కాంగ్రెస్ అధికారంలోకి మూడేళ్లు గడిచిన అలాగే ఉన్న సమస్యలు
- 30న సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :**

*మిడ్ మానేరు ప్రాజెక్ట్ నిర్మాణంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులు తమ సమస్యల పరిష్కారం కోసం రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. నాడు ప్రతిపక్ష హోదాలో పీసీసీ అధ్యక్షుడిగా, ఎంపీగా ఉన్న సమయంలో నిర్వాసితుల నిరసనలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని మద్దతుగా నిలిచారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచిన వారి సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఈ నెల 30 న సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వారు ఆశగా ఎదురు చూస్తున్నారు.*

బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర జలాశ యంలో కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, శాబాష్పల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, చీర్లవంచ, చింతల తాణ, గుర్రంవాణి పల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల్లో ఆనాడు సర్వే నిర్వహించి 10,683 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు అధికారులు గెజిట్ ప్రచురించారు. నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ కాలనీలను ఏర్పాటు చేసి ఒక్కో నిర్వాసితుడికి 242 చదరపు గజాల ఇంటి స్థలం, నిర్వాసితుడి వృత్తి ఆధారంగా కుటుంబ పరిహారం చెల్లింపులు చేశారు.

**నేటికి అందని పరిహారం...**

ఇప్పటి వరకు సుమారుగా 639 మంది నిర్వాసితులకు కుటుంబ పరిహారం చెల్లింపులు చేయాల్సి ఉంది. 2,303 మంది యువతులు ఉండగా ఇంకా 424 మందికి.. 1,614 మందికి యువకులు ఉండగా 77 మంది యువకులకు రూ 2 లక్షల చొప్పున పరిహా రం అందాలి. వీరితో పాటు అనేక మంది నిర్వాసితులకు కుటుంబ పరిహారం,ఇంటి స్థలం పట్టాలు,వ్యవసాయ భూముల, ఇళ్ల పరిహారం అందాలని కోరుతూ ఆయా గ్రామాల్లో 3,500 మంది దరఖాస్తులు చేసుకున్న వీటిపై నేటికీ అధికారులు విచారణ ప్రారంభించలేదు.

**నిర్వాసితులకు లభించని ఉపాధి..**

జలాశయంలో సర్వం కోల్పోయిన మధ్యమానేరు నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తామని పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పిన పాల కుల మాటలు నీటి మూటలుగా మారాయి. ఉపాధి లేకపోవడంతో నిర్వాసితులు వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ప్రతిరోజు పనులకు వెళ్తున్నారు. నాడు రైతులుగా ఉన్నవారు నేడు కూలీలుగా సమీప గ్రామాల్లో వ్యవసాయ పనులకు వెళ్తుండడం యిక్కడి పరిస్థితులకు అర్థం పడుతుంది

**ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి సమస్యలు..**

జిల్లాకు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో అన్ని పార్టీల రాజకీయ నాయ కులు నిర్వాసితులు ఐక్యవేదికగా ఏర్పడి తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు సమావేశమై ముఖ్యమంత్రికి వివరించా ల్సిన తమ సమస్యలపై చర్చించారు. బిఆర్ఎస్,బిజెపి నియోజకవర్గ బాధ్యులు ఇప్పటికే వేర్వేరుగా వారి నాయకులు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నిర్వాసి తుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమం త్రి రాకతోనైనా ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారం అవుతాయ అని నిర్వాసితులు గంపడాశతో ఉన్నారు.

## కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

**మల్యాల సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** బలవంతపూర్ గ్రామ శివారులో శివాలయం దగ్గర ఉన్న వేప చెట్టుకు రాచుటి అద్దాల చరణ్ (24) ఉరివేసుకొని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. దొరపల్లి గ్రామం డోన్ మండలం నంద్యాల ఆంధ్రప్రదేశ్‌కి చెందిన రాచూటి అద్దాల ఎల్లయ్య భార్య,కొడుకు మరియు కోడలితో జగిత్యాల జిల్లాలోని నర్సింగాపూర్ శివారులో ఉంటూ చిల్లర బట్టల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కొడుకు రాచుటి అద్దాల చరణ్ కొన్ని సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడని. సెప్టెంబర్ 27వ తేదీ ఆదివారం ఉదయం 6:30 గంటలకు బట్టలు వ్యాపారం కొనసాగించుటకు కొండగట్టుకు ఈభూతి శేఖర్‌తో కలిసి వచ్చి తిరిగి 11 గంటలకి కూడా ఇంటికి రాకపోగా కాల్ చేస్తే లిఫ్ట్ చేయకపోయేసరికి చుట్టుపక్కల గ్రామాలలో వెతుకగా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందని మృతుని తండ్రి రాచోటి అద్దాల ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**వీణవంక, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సంధి రఘుపతిరెడ్డి (39) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం రాత్రి చల్లూరు నుంచి మల్లారెడ్డి పల్లికి నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ (TS 20 T 3542) ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన రఘుపతిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. మృతుడికి భార్య, 12 ఏళ్ల కుమార్తె, 9 ఏళ్ల కుమారుడు ఉన్నారు.

## సారు.. మా గోడు వినండి చర్యలు తీసుకోండి

**క్రషర్ల వల్ల ఇబ్బందులు పడుతున్నాం**



**మల్యాల సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** మల్యాల మండలం ముత్యంపేట గ్రామం నుండి ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టుకు వెళ్లే ప్రధాన రహదారిపై నంబర్ ప్లేట్లు లేకుండా టిప్పర్ల,క్రషర్ల వాహనాలు అధిక లోడ్,ద్వారా రాకపోకలు సాగిస్తుండడంతో రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని వాహనదారులు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,క్రషర్ల నుంచి వచ్చే దుమ్ము వల్ల ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతోందని. ఈ విషయంపై సంబంధిత అధికారులకు మరియు ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని దెబ్బతిన్న రహదారికి తక్షణ మరమ్మతులు చేయించాలని,అధిక లోడుతో మరియు నంబర్ ప్లేట్లు లేని టిప్పర్లపై ఆర్టీవో అధికారులు చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకుడు గత ఎన్నికల్లో ముత్యంపేట సర్పంచిగా పోటీ చేసిన అభ్యర్థి రమేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు.

# కార్యకర్తల్లో, ప్రజల్లో జోష్ నింపనున్న ముఖ్యమంత్రి పర్యటన

- 60 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించనున్న సీఎం
- మూడుకోట్ల సుడా నిధులతో హెలిప్యాడ్, సింథటిక్ వాకింగ్ ట్రాక్, మెయిన్ రోడ్డు, గార్డెన్స్ నిర్మాణం
- ఇన్నిరోజులు ఒక లెక్క ఇప్పటినుండి మరో లెక్క ఇక కాస్కో కేటిఆర్
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :**

ఈ నెల 30 న సీఎం రేవంత్ రెడ్డి కరీంనగర్, సిరిసిల్ల పర్యటన కార్యకర్తల్లో, ప్రజల్లో జోష్ నింపడం ఖాయం అని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. 60 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభిస్తారని తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని ఇంకా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని నరేందర్ రెడ్డి తెలిపారు. సుడా నిధులు కోటి రూపాయలతో కలెక్టరేట్ ఉత్తరం వైపునుండి ప్రధాన రహదారి నిర్మాణం చేశామని, హెలిప్యాడ్ నిర్మాణానికి 65 లక్షలు, గార్డెన్లకు, సింథెటిక్ ట్రాక్ నిర్మాణానికి కోటి రూపాయలు, పాత బిల్డింగ్ ఫేస్ లిఫ్ట్ కు 30 లక్షలు అన్ని కలిపి 3 కోట్ల సుడా నిధులు వెచ్చించామని నరేందర్ రెడ్డి తెలిపారు. బీజేపీ నాయకులకు డ్రామాలు, దాడులు నిత్యకృత్యమయ్యాయని మొన్న నీటి విడుదల పై డ్రామా చేశారని, శనివారం రోజు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలో దాడికి పాల్పడ్డారని దాడుల సంస్కృతి మంచిది కాదని ఓపిక పడుతున్నామని, ఇక చూస్తూ, ఊరుకోబోమని నరేందర్ రెడ్డి హెచ్చరించారు. కేబుల్ బ్రిడ్జ్ పై లైట్లు వెలుగక పోవడానికి కారణం ఆనాడు లోపభూయిష్టంగా చేసిన టెండర్ ప్రక్రియ వల్లనే అని ఆర్వోబి నిర్మాణం ఆలస్యానికి కారణం 3 సంవత్సరాల తర్వాత మెయిన్ పియర్స్ డిజైన్స్ ఇవ్వడం వల్లనే అని బీజేపీ బీఆర్ఎస్ ల మధ్య ఉన్న చీకటి ఒప్పందం వల్ల ఈ రెండు పార్టీలు ఏనాడు విమర్శించుకోవని నరేందర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతల భూభాగోతాన్ని బట్టబయలు చేసిన నేపథ్యంలో సీఎం పర్యటన అనగానే బీఆర్ఎస్ నాయకులు ఉలిక్కిపడుతున్నారని, ఇన్నిరోజులు ఒక లెక్క ఇప్పుడొక లెక్క అని కేటిఆర్ ఇక కాస్కో అని నరేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పోరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, జగన్ రెడ్డి, నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, షబానా మహమ్మద్, ఆస్తపురం తిరుమల, జ్యోతి రెడ్డి, భారీ, కీర్తి కుమార్, అంజయ్య, మామిడి సత్యనారాయణ రెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- బస్సులు తగ్గించి చార్జీలు పెంచుతున్నారు : పుట్ట మధూకర్
- హైదరాబాద్, భద్రాచలం ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఎక్కడ?
- మహిళల ప్రయాణాలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆరోపణ
- ఆర్టీసీ సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం



**మంథని, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మహాలక్ష్మి పథకం పేరుతో మహిళా లోకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం మంథని ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాకముందు ఒకలా.. వచ్చాక మరోలా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానంగా మారిందని ఆరోపించారు. మహిళలు, ఆర్టీసీ ఉద్యోగులు, ఆటో కార్మికులే ఎక్కువగా నష్టపోతున్నారని అన్నారు.
మహాలక్ష్మి పథకం పేరుతో ఉచిత ప్రయాణం కల్పిస్తూనే ఎక్స్‌ప్రెస్ బస్సులను తగ్గించి వాటి స్థానంలో డీలక్స్ బస్సులు నడుపుతూ అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని మధూకర్ ఆరోపించారు. మంథని నుంచి హైదరాబాద్, దిల్‌సుఖ్‌నగర్, మియాపూర్‌కు గతంలో నేరుగా బస్సులు నడిచేవని.. ప్రస్తుతం వాటిని రద్దు చేసి సిద్దిపేట వరకు పరిమితం చేశారని తెలిపారు. మంథని నుంచి భద్రాచలానికి నడిచే ఎక్స్‌ప్రెస్‌ను సైతం లగ్జరీ సర్వీసుగా మార్చారని పేర్కొన్నారు. ఫలితంగా మహిళలకు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కొరత ఏర్పడిందన్నారు. తక్షణమే హైదరాబాద్, మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్, భద్రాచలం వరకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉచిత ప్రయాణం అమలు తర్వాత కండక్టర్లపై అధిక ఆదాయం తీసుకురావాలని, డ్రైవర్లపై మైలేజీ కోసం ఒత్తిడి చేస్తున్నారని మధూకర్ ఆరోపించారు. మంథని డిపోలో 360 మంది సిబ్బంది అవసరం ఉండగా కేవలం 190 మంది మాత్రమే ఉన్నారని, దీంతో ఉద్యోగులపై తీవ్ర పనిభారం పడుతోందన్నారు. మహిళా ఉద్యోగులు రాత్రి వరకు విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారని, ఉద్యోగుల బకాయిలు, ఇతర సమస్యలు పరిష్కరించడం లేదని విమర్శించారు. మంథని బస్టాండ్, డిపో దుస్థితిపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న వర్షానికే డిపో బురదమయంగా మారుతోందని, అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. ప్రజలకు అవసరమైన ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో లేకుండా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మేనిఫెస్టో హామీల అమలుతో పాటు ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని, మంథని నుంచి హైదరాబాద్, భద్రాచలం వరకు ఎక్స్‌ప్రెస్ బస్సులను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

**బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న**

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న అన్నారు. ఆదివారం హైదరాబా ద్ జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూ జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఓ డాక్టర్ సురేందర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా జి.ఆశన్న మాట్లాడుతూ.. తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాంతం పోరాడారని తెలిపారు. ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ఆయన స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజా నాయకుడిగా సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వయ సును సైతం లెక్కచేయకుండా ఉద్యమించిన ఆయన త్యాగం, నిబద్ధత భావితరాలకు స్ఫూర్తి దాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యాటకాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కీలకం

- యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు
- కీసర, శామీర్‌పేట, కండ్లకోయకు విస్తృత అవకాశాలు
- కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం
- భావితరాలకు ఆయన ఆశయాలు మార్గదర్శకం: ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** పర్యాటక రంగ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహిం చారు. 'డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం' అంశంపై నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పర్యాటక రంగంపై అవగాహనతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే పోటీల ఉద్దేశమని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని కీసర రామలింగేశ్వరస్వామి ఆలయం, శామీర్‌పేట చెరువు, కండ్లకోయ ఆక్సిజన్ పార్కు, జీనమ్ వ్యాలీతోపాటు పలు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం జిల్లాకు అదనపు ప్రయోజనమన్నారు. విద్యార్థులు పర్యాటక, పర్యావరణ అంశాలపై రూపొందించిన చిత్రాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనతోపాటు సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. బాపూజీ ఆశయాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, బీసీ సంక్షేమ అధికారి ఝాన్సీరాణి, బీసీ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యాచారంలో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

- ముగ్గురి అరెస్టు.. 7.30 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం
- మూడు సెల్‌ఫోన్లు సీజ్ చేసిన పోలీసులు

**యాచారం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** యాచారం పోలీసులు డ్రగ్స్ ముఠా గుట్టురట్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం చేపట్టిన తనిఖీల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 7.30 గ్రాముల ఎండీఎంఏ సింథటిక్ డ్రగ్‌తోపాటు నేరానికి ఉపయోగించిన మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని హైదరాబాద్‌కు చెందిన సమాలు వికాస్‌రెడ్డి (29), గిర్కటి భానుప్రసాద్‌గౌడ్ అలియాస్ భాను అలియాస్ బాబులు, దినేష్‌కుమార్ అలియాస్ దినేష్ (28)గా గుర్తించారు. ప్రాథమిక విచారణలో నిందితులు నగరంలో మాదకద్రవ్యాలను కొనుగోలు చేసి యువతకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఎండీఎంఏ ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరెవరికి విక్రయించేందుకు ప్రయత్నించారు? ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. డ్రగ్స్ విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య..

**భార్యపై రోకలి బండతో దాడి చేసిన భర్త..అక్కడికక్కడే మృతి చెందిన భార్య**

**ముషీరాబాద్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం దారుణ హత్య ఘటన చోటుచేసుకుంది. బాగ్‌లింగంపల్లిలోని మాచర్ల జ్యువెలరీ షాప్ సమీపంలో ఉదయం సుమారు 11:22 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. కుటుంబ కలహాల నేపథ్యంలో నరేందర్ (34) తన భార్య తేజస్వి (29)పై రోకలి బండతో దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో తేజస్వి తలకు తీవ్ర గాయాలు కావడంతో భారీగా రక్తస్రావం జరిగినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే స్పృహ కోల్పోయినట్లు సమాచారం. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే తేజస్వి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఘటన అనంతరం నరేందర్ అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. దీంతో నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. హత్యకు దారితీసిన కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.




## చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఉద్రిక్తత

**కుల వివాదం కాస్తా రాజకీయ వివాదంగా మారిన వైనం.. ఇరువర్గాలపై కేసులు**

**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** కరీంనగర్ పట్టణంలోని చిట్టెల్ల ఐలమ్మ చౌరస్తా వద్ద శనివారం నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కార్యక్రమంలో ఏర్పాట్లు, ప్రజాప్రతినిధుల ఆలస్యంపై రజక సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేయగా, ఓ వ్యక్తితో వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. అనంతరం ఇరువర్గాల మధ్య తోపులాట, ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది.
ఈ ఘటనపై బాధితులు, రజక సంఘం నాయకులు కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ నరేష్ మాట్లాడుతూ.. వేడుకల్లో చాకలి ఐలమ్మను, రజకులను అవమానించేలా కొందరు వ్యవహరించారని ఆరోపించారు. రజక యువనేత మహేష్‌పై దాడి జరిగినట్లు పేర్కొన్నారు. ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఐలమ్మ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మరోవైపు ఘటనకు సంబంధించి ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. వేడుకల సందర్భంగా చోటుచేసుకున్న వివాదం రాజకీయ రంగు పులుముకోవడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# రిజిస్ట్రేషన్ పేరుతో రూ.29 లక్షల మోసం!

- ఏడు గుంటల భూమి ఇప్పిస్తామని మహిళకు వల
- బాయనాగా రూ.5 లక్షలు.. బంగారం తాకట్టు పెట్టి మరో రూ.24 లక్షలు
- తహసీల్దార్ కార్యాలయంలో నకిలీ ప్రక్రియ నిర్వహించారని ఆరోపణ




**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** భూమి రిజిస్ట్రేషన్ పేరుతో ఓ మహిళను నమ్మించి రూ.29 లక్షలు కాజేశారని ఆరోపణలు కరీంనగర్ జిల్లాలో కలకలం రేపుతున్నాయి. బెజ్జంకి మండలం శనిగరం ప్రాంతంలో ఏడు గుంటల వ్యవసాయ భూమిని ఇప్పిస్తామంటూ అలీమ్, జబ్బార్, బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి ఆపరేటర్‌గా పనిచేస్తున్న అశోక్ తనను సంప్రదించారని రషీదా తబ్బుసుమ్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. రూ.29 లక్షలకు భూమి ఇప్పిస్తామని చెప్పి 2025 డిసెంబర్‌లో రూ.5 లక్షలు బాయనాగా తీసుకున్నారని ఆరోపించారు. జూలైలో తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి రిజిస్ట్రేషన్, కేవైసీ ప్రక్రియ పేరుతో ఫొటోలు, వేలిముద్రలు తీసుకున్నారని ఆమె పేర్కొన్నారు. జబ్బార్ పట్టేదారుగా నటించి నకిలీ సంతకాలు చేశారని, అశోక్ రిజిస్ట్రేషన్ పూర్తయిందంటూ నమ్మించారని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ పూర్తయిందని భావించిన ఆమె.. బంగారం తాకట్టు పెట్టి రూ.24 లక్షలు తీసుకుని అలీమ్‌కు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
మరుసటి రోజు రిజిస్ట్రేషన్ పత్రాల కోసం వెళ్లగా అసలు రిజిస్ట్రేషన్ జరగలేదని గుర్తించినట్లు తెలిపారు. ముగ్గురూ ముందస్తు పథకం ప్రకారం నకిలీ ప్రక్రియ నిర్వహించి మొత్తం రూ.29 లక్షలు తీసుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ సిబ్బంది పాత్ర ఉందా? నకిలీ సంతకాలు, వేలిముద్రలు ఎలా తీసుకున్నారు? అనే అంశాలపై విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## జిల్లాస్థాయి పోటీల్లో నాగంపేట విద్యార్థుల ప్రతిభ

**ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా అవార్డు.. రాష్ట్రస్థాయికి ఎంపిక**

**గంభీరావుపేట, (జనంసాక్షి):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నాగంపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రతిభకు గుర్తింపుగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులు అవార్డును అందుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బాల ఎల్లయ్య పి.టి. శాంత, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామిక విలువలకు ఎస్టీయూ ప్రతీక

- 80 వసంతాల వైభవోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- డీఏ, పీఆర్సీపై వేగంగా కదలిక: మంత్రి
- ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ వేడుకలు.. సీనియర్ నేతలకు సన్మానం



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** నిజాం పాలనలోని అసంబద్ధ విధానాలను ప్రశ్నిస్తూ ఆత్మాభిమానం కోసం ఆవిర్భవించిన స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) 80 ఏళ్లుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతూ, విద్యా విధానాలపై నిర్మాణాత్మక చర్చకు వేదికగా నిలిచిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎస్టీయూ 80 వసంతాల వైభవోత్సవాన్ని ఆదివారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. శాసనమండలికి 10 మంది నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులను పంపి విద్య, జాతీయ విద్యా విధానాలపై సమగ్ర నివేదికలు అందించడం సంఘం ప్రత్యేకత అన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టామని, మెగా డీఎస్సీ నిర్వహించి అప్‌గ్రేడేషన్ పూర్తి చేశామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పూర్వ ప్రాథమిక విద్య, విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందని, హెల్త్‌కార్డులోని లోపాలను సరిచేస్తామని చెప్పారు. డీఏ, పీఆర్సీ అంశాల్లో వేగంగా కదలిక ఉందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగించి ప్రభుత్వ విద్యను, గ్రామీణ విద్యార్థులను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం-ఉద్యోగుల మధ్య భయాందోళనలు కాకుండా పరస్పర విశ్వాసం, సూచనలతో వ్యవస్థ ముందుకు సాగాలని అన్నారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఎమ్మెల్సీ చాడ వెంకటరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. దాసరి శ్రీధర్ సంపాదకత్వంలో రూపొందించిన ఎస్టీయూ చరిత్ర పుస్తకం 'అష్టపది'ని ఆవిష్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ మాట్లాడుతూ పూర్వ నాయకుల త్యాగాల ఫలితంగానే ఉపాధ్యాయులు అనేక హక్కులు సాధించుకున్నారని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో రెండు డీఏ బకాయిలు సాధించామని, పీఆర్సీ సాధించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎస్టీయూ కీలకంగా పోరాడిందన్నారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు, వివిధ రాష్ట్రాల నాయకులు, జిల్లా బాధ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సీనియర్ నాయకులను సన్మానించారు.

# కేసీఆర్ పాటలను ఆపే దమ్ముందా?

- గణేష్ నిమజ్జనంలో కేసీఆర్ పాటలు మార్మోగాయని పైలెట్ రోహిత్‌రెడ్డి వ్యాఖ్య
- పోలీసుల హెచ్చరికలున్నా యువత పాటలు ప్లే చేసిందని వెల్లడి
- కేసీఆర్ అభిమానాన్ని అడ్డుకోలేరని మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్య



**తాండూరు, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వ్యాఖ్యానించారని, అయితే హైదరాబాద్‌లో జరిగిన గణేష్ నిమజ్జన వేడుకల్లో కేసీఆర్ పాటలు మార్మోగడం ఇందుకు భిన్నమైన పరిస్థితిని చూపించిందని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. సెక్రటేరియట్ పరిసరాల్లోనూ కేసీఆర్ పాటలు వినిపించాయని పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనంలో టస్కర్లు, డీసీఎం వాహనాలపై కేసీఆర్ పాటలు ప్లే చేశారని, పోలీసులు హెచ్చరించినప్పటికీ యువత వాటిని కొనసాగించిందని రోహిత్‌రెడ్డి తెలిపారు. 'దేఖ్‌లేంగే' పాటకు యువత నృత్యాలు చేయడం, జై కేసీఆర్ నినాదాలు చేయడం కనిపించింద న్నారు. ఈ దృశ్యాలు కేసీఆర్‌పై ప్రజల్లో ఉన్న అభిమానానికి సంకేతమని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియాలోనూ 'దేఖ్‌లేంగే' పాటకు సంబంధించిన రీల్స్ విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయని తెలిపారు. గణేష్ నిమజ్జన వేడుకల్లో యువతతో పోలీసులు కలిసి నృత్యాలు చేశారన్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. కేసీఆర్ అభిమానులను ఆంక్షలతో అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. అదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తల నుంచి పెద్దగా నినాదాలు, పాటలు వినిపించలేదని రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. నిమజ్జన వేడుకల్లో కనిపించిన దృశ్యాలు తెలంగాణలో కేసీఆర్‌పై ఉన్న అభిమానానికి ప్రతిబింబమని ఆయన అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో ప్రచారాల కంటే క్షేత్రస్థాయిలో ప్రజల స్పందనే ముఖ్యమని అన్నారు.

# ప్రవక్త బోధనలు సర్వమానవాళికి ఆదర్శం

**మత సామరస్యంతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలి: మౌలానా వలి ఉల్లాహ్ ఫాలహి**




**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :** మహా ప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు సర్వమానవాళికి ఆదర్శమని జమాతే ఇస్లామీ హింద్ అఖిల భారత ఉపాధ్యక్షులు మౌలానా వలి ఉల్లాహ్ ఫాలహి అన్నారు. ఆదివారం కరీంనగర్ సర్కస్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రవక్త బోధించిన మానవత్వం, ప్రేమ, సోదరభావం, న్యాయం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. ప్రవక్త ముహమ్మద్ (స) చూపిన మార్గం మానవ సమాజానికి శాంతి, సౌభ్రాతృత్వం, నైతిక విలువలను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో పరస్పర గౌరవం, మత సామరస్యం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మతాల మధ్య ఐక్యత, పరస్పర అవగాహనతోనే సమాజంలో శాంతి నెలకొంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా వివిధ మతాలు, వర్గాలకు చెందిన ప్రముఖులు ఒకే వేదికపై పాల్గొని ఐక్యతను చాటారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షులు అజహరుద్దీన్ ఖాన్, సామాజిక ఇస్లామిక్ సంస్థ రాష్ట్ర కార్యదర్శులు ఇమాదుద్దీన్, సోహెబ్ అహ్మద్ ఖాన్, జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ నగర అధ్యక్షులు డాక్టర్ ముస్తాక్, ఎంఐఎం అధ్యక్షులు అహ్మద్ హుస్సేన్, మైనారిటీ ప్రజా ఉద్యమం అధ్యక్షులు సాజిద్ ఖాన్, జమాత్ నాయకులు ఖైర్ ఉద్దీన్, షోయబ్ లతీఫీ, క్రైస్తవ సమాజ ప్రతినిధి రేవంత్ క్రిస్టోఫర్, శివాలయ పూజారి పురాణం మహేశ్వర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లిం, క్రైస్తవ తదితర వివిధ వర్గాలకు చెందిన సోదరసోదరీమణులు పెద్ద సంఖ్యలో సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వివిధ మతాల ప్రతినిధులు ఒకే వేదికపై పాల్గొనడం ద్వారా పరస్పర సౌభ్రాతృత్వం, మత సామరస్యానికి సభ వేదికగా నిలిచింది. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులను పలువురు అభినందించారు.

## 2బీ బార్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

**చేవెళ్లలో ఒకటి.. మొయినాబాద్‌లో రెండు బార్లకు అవకాశం**

చేవెళ్ల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా 2బీ బార్ల ఏర్పాటుకు ముందస్తు అనుమతి (ప్రయర్ క్లియరెన్స్) కోసం దరఖాస్తులను ఆహ్వానించినట్లు చేవెళ్ల ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.కల్పన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 41 కొత్త బార్ల ఏర్పాటుకు అవకాశం కల్పించగా, చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రెండు బార్లను నోటిఫై చేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు నిబంధనల ప్రకారం నిర్దేశిత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.1 లక్ష రుసుము చెల్లించాల్సి ఉంటుందని, ఈ రుసుము తిరిగి చెల్లించబడదని తెలిపారు. దరఖాస్తులను అక్టోబర్ 12 సాయంత్రం 5 గంటల వరకు సమర్పించవచ్చని, అర్హుల ఎంపికను అక్టోబర్ 16 ఉదయం 11 గంటలకు లాటరీ విధానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులను జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, ఫ్యూచర్ సిటీ కార్యాలయం, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్, రంగారెడ్డి డివిజన్ కార్యాలయం లేదా హైదరాబాద్ నాంపల్లిలోని అబ్కారి భవన్‌లో ఉన్న కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సమర్పించవచ్చని కల్పన తెలిపారు. నోటిఫికేషన్‌లోని నిబంధనలు, అర్హతలు, అవసరమైన పత్రాలను పూర్తిగా పరిశీలించిన అనంతరం దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

# తపాలా బిళ్లతో డా. జావేద్‌కు అరుదైన గుర్తింపు

- 1,572 మంది రచయితల ప్రపంచ రికార్డులో భాగస్వామ్యం
- రైతు సేవలకు గుర్తింపుగా రూ.5 విలువైన ప్రత్యేక తపాలా బిళ్ల




**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** జయనగర్ కాలనీకి చెందిన డా. జావేద్ విద్య, పరిశోధన, సాంకేతిక విజ్ఞానం, రైతు సంక్షేమం, సామాజిక సేవ, రచనా రంగాల్లో విశేష కృషితో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. తాజాగా 1,572 మంది రచయితలు ఒకేసారి తమ పుస్తకాలపై సంతకాలు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నందుకు గిన్నిస్ ప్రపంచ రికార్డు ధ్రువపత్రం అందుకున్నారు. చెన్నైలో జూలై 26న నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గతంలో సుమారు 19.4 అడుగుల ఎత్తు, 1.1 లక్షలకు పైగా పేజీలతో రూపొందిన భారీ పుస్తకానికి సంపాదకుడిగా వ్యవహరించగా, దానికి కూడా గిన్నిస్ రికార్డు గుర్తింపు లభించింది.

రైతుల సంక్షేమానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా తమిళనాడు తపాలా శాఖ ఆయన పేరుతో రూ.5 విలువైన ప్రత్యేక తపాలా బిళ్లను విడుదల చేసింది. భూమిబంధన్ సంక్షేమ సంస్థ వ్యవస్థాపకుడు, సంచాలకుడిగా 40కి పైగా గ్రామాల్లో రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించారు. స్వయంచాలక ఎరువుల పంపిణీ యంత్రం, బిందు సేద్యం, పంట వ్యాధులను ముందుగానే గుర్తించే విధానాల అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యారు. డా. జావేద్ 70కి పైగా అంతర్జాతీయ పరిశోధనా వ్యాసాలను ప్రచురించగా, 15కి పైగా అంతర్జాతీయ పరిశోధనా పత్రికలకు సంపాదక, సలహా, పరిశీలకుడిగా సేవలందిస్తున్నారు. 12 మేధోసంపత్తి హక్కుల నమోదు పత్రాలు ప్రచురితమయ్యాయి. 13 అంతర్జాతీయ పరిశోధనా పురస్కారాలతో పాటు సామాజిక సేవకు జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నారు. భారత్‌తోపాటు మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, దుబాయ్, నేపాల్ తదితర దేశాల్లో 15కి పైగా అంతర్జాతీయ సదస్సుల్లో ప్రసంగాలు, పరిశోధనా ప్రదర్శనలు చేశారు. గత 12 ఏళ్లుగా వందలాది విద్యార్థుల ప్రాజెక్టులకు మార్గదర్శకత్వం వహిస్తూ, వినూత్న ఆలోచనలను ఉత్పత్తులు, ఉపాధి అవకాశాలుగా మలిచేందుకు ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని బ్రిగ్-ఐసీలో ఎలక్ట్రానిక్స్, సమాచార ప్రసార విభాగంలో ఆచార్యుడిగా సేవలందిస్తున్నారు. సూక్ష్మ ఎలక్ట్రానిక్ వ్యవస్థలు, డిజిటల్ చిత్ర విశ్లేషణ, వస్తు అంతర్జాలం, కృత్రిమ మేధ, యంత్ర మానవ సాంకేతికత తదితర రంగాల్లో పరిశోధనలు చేస్తున్నారు. ఆయన సేవలకు వరుసగా జాతీయ, అంతర్జాతీయ గుర్తింపులు లభించడంపై స్థానికులు, విద్యార్థులు, సహచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

**కొడంగల్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** కొడంగల్ పురపాలక పరిధిలోని అంబేద్కర్ కూడలి వద్ద డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. కొడంగల్ ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు పరిగి మండలం రూప్‌ఖాన్‌పేటకు చెందిన ఇమామ్ పాషా కోస్గి వైపు వెళ్తూ అంబేద్కర్ కూడలి వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇమామ్ పాషా సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మహబూబ్ మైనుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం



**కొడంగల్, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం బండివాడ గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అంజిలప్పకు చెందిన రేకుల ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షులు వెంకట్రావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు అంజిలప్పను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంజిలప్ప కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తిరుపతిరెడ్డి దృష్టికి ఘటనను తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరన్న, దస్తప్ప, బండివాడ గ్రామ సర్పంచ్ సూర్య నాయక్, ఉపసర్పంచ్ వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

# 70 వేలకుపైగా విగ్రహాల నిమజ్జనం.. ప్రశాంతంగా ముగిసిన వేడుకలు

- 39 కేంద్రాల్లో నిమజ్జనాలు.. 134 క్రేన్లతో ఏర్పాట్లు
- 1,356 మంది పారిశుద్ధ్య సిబ్బందితో 24 గంటల సేవలు
- 1,350 మెట్రిక్ టన్నుల అదనపు వ్యర్థాల సేకరణ
- ప్రజలు, ఉత్సవ సమితుల సహకారంతో విజయవంతం: కమిషనర్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సాఫీగా ముగిశాయని కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. 39 నిమజ్జన కేంద్రాల్లో 70 వేలకు పైగా విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు వెల్లడించారు. ప్రజలు, ఉత్సవ సమితులు, ప్రభుత్వ శాఖలు, ఎంఎంసీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం విజయవంతమైందన్నారు. నిమజ్జన మార్గాలు, కేంద్రాల్లో సుమారు 10 వేల తాత్కాలిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. రహదారుల గుంతలను పూడ్చడంతోపాటు అవసరమైన చోట్ల కొత్త రోడ్లు వేశారు. విగ్రహాల నిమజ్జనానికి 134 క్రేన్లు, చెట్ల కొమ్మల తొలగింపునకు ప్రత్యేక వాహనాలు, 64 మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్య నిర్వహణకు 1,356 మంది సిబ్బంది 24 గంటలూ విధులు నిర్వర్తించారు. సాధారణ రోజులతో పోలిస్తే అదనంగా సుమారు 1,350 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి కాగా, వాటిని సకాలంలో సేకరించి తరలించారు. 168 గణేష్ యాక్షన్ టీమ్‌లు పనిచేశాయి. పూల వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి రీసైక్లింగ్ ద్వారా అగరుబత్తీలు, ధూప్‌స్టిక్స్ తదితర ఉత్పత్తుల తయారీకి తరలించినట్లు కమిషనర్ తెలిపారు. నిమజ్జన కేంద్రాల్లో దోమల నియంత్రణకు ఎంటమాలజీ సిబ్బంది ఏఎల్‌ఓ, ఫాగింగ్ చేపట్టారు. వీధి కుక్కల నియంత్రణకు వెటర్నరీ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. పోలీసు, వాటర్ వర్క్స్, ఆరోగ్యం, విద్యుత్, హైడ్రా తదితర శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాయని కమిషనర్ తెలిపారు. ఏర్పాట్లను ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారని, సహకరించిన ప్రజలు, ఉత్సవ సమితులు, అధికారులు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# పంచాయతీలకు సొంత భవనాలే లక్ష్యం: ఎమ్మెల్యే కవ్వంపల్లి

- ముస్కానిపేటలో వీవో, అంగన్‌వాడీ భవనాల ప్రారంభం
- రూ.30 లక్షల చిరుధాన్యాల గోదాముకు భూమిపూజ
- ఎస్సీ కాలనీ, ఇల్లంతకుంట బస్టాండ్‌లో డ్రైనేజీ పనులకు శ్రీకారం
- గ్రామీణ మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే



ఇల్లంతకుంట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి): సొంత భవనాలు లేని గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వీవో, అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు. రూ.30 లక్షలతో నిర్మించనున్న చిరుధాన్యాల గోదాం, రూ.20 లక్షలతో చేపట్టనున్న ఎస్సీ కాలనీ డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. ఇల్లంతకుంట బస్టాండ్ ఆవరణలోనూ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం అంతగిరి ముత్యాల పోచమ్మ ఏడో వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి, ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

గత బీఆర్ఎస్ పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పలువురు నేతలు పాల్పడ్డారని పేర్కొన్నారు. 22-ఏ పరిధిలోని భూముల విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, అక్రమంగా ఉన్నట్లు తేలిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆదర్శనీయం: ఎమ్మెల్యే బండారి

- తెలంగాణ కోసం జీవితాంతం పోరాటం చేసిన మహనీయుడు
- పదవులు త్యజించి ప్రజా ఉద్యమాలకు అంకితం
- బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి

**ఉప్పల్, (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం వరకు ప్రజల కోసం పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బాపూజీ జయంతి సందర్భంగా ఉప్పల్ వివేకానంద కమ్యూనిటీ హాల్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బాపూజీ తన జీవితాన్ని అంకితం చేశారని, పదవులను సైతం త్యజించి ప్రజా ఉద్యమాలకు సేవలందించారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 5,500 మందితో కరీంనగర్‌లో మారథాన్

- నాలుగో ఎడిషన్‌లో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా పాల్గొన్న పరుగుదారులు
- అంబేద్కర్ స్టేడియం నుంచి పరుగుల సందడి.. ఆరోగ్యంపై అవగాహన
- ఈగిల్ ఫోర్స్ ఆధ్వర్యంలో యువతతో మత్తు పదార్థాలకు వ్యతిరేక ప్రతిజ్ఞ



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** 'ఆరోగ్యం కోసం పరుగు.. మాదకద్రవ్యాలకు నో చెప్పండి' అనే నినాదంతో నిర్వహించిన కరీంనగర్ మారథాన్-2026కు నగరం నుంచి విశేష స్పందన లభించింది. కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగో ఎడిషన్‌లో 5,500 మందికి పైగా పరుగుదారులు పాల్గొన్నారు. ఆదివారం తెల్లవారుజామున అంబేద్కర్ స్టేడియం పరిసరాలు సందడిగా మారాయి. చిన్నారులు, యువత, మహిళలు, ఉద్యోగులు, వయో వృద్ధులు ఉత్సాహంగా పరుగులో పాల్గొని ఆరోగ్యం, శారీరక దారుఢ్యంపై అవగాహన కల్పించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. తేజస్ రక్షణ శిక్షణ సంస్థ చైర్మన్ సతీష్‌రావు, ముల్కనూర్ డైరీ మార్కెటింగ్ అధికారి రుద్రప్రతాప్, సిద్ధార్థ పాఠశాలల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ పోలీసుల ఈగిల్ ఫోర్స్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఉపేందర్ విద్యార్థులు, యువతతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. క్రీడలు, వ్యాయామాన్ని జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. ఐవీవై, సిద్ధార్థ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక దుస్తుల్లో క్రమశిక్షణగా పాల్గొని ఆకట్టుకున్నారు. మారథాన్ విజయవంతానికి అసోసియేషన్ సభ్యులు రెండు నెలలుగా ఏర్పాట్లు చేసినట్లు అధ్యక్షుడు పసుల మహేష్ తెలిపారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు, ప్రాయోజకులు, పరుగుదారులు, నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.





# 5 వేల మందితో భూవిజ్ఞాన విశేషాలకు ఓపెన్ డే

**ఘనంగా సీఎస్ఐఆర్ 85వ వ్యవస్థాపక దినోత్సవం**

- విద్యార్థులకు ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధనలపై అవగాహన
- భూకంపాలు, భూగర్భ జలాలు, ఖనిజాలపై ప్రత్యక్ష ప్రదర్శనలు
- శాస్త్రవేత్తలతో మమేకమైన విద్యార్థులు.. క్విజ్‌కు విశేష స్పందన

**హబ్సిగూడ/ఉప్పల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** సీఎస్ఐఆర్ 85వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని హబ్సిగూడలోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ డే-2026కు సుమారు 5 వేల మంది విద్యార్థులు, ప్రజలు తరలివచ్చారు. శాస్త్రీయ పరిశోధనలను ప్రజలకు చేరువ చేయడం, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలను సందర్శించే అవకాశం కల్పించారు. దాదాపు 20 అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లు, పనిచేసే నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. భూకంప అధ్యయనాలు, భూగర్భ జలాల అన్వేషణ, ఖనిజ వనరులు, సునామీ ప్రమాదాల అంచనా, భూమి అయస్కాంత క్షేత్రం, శిలలు, గ్రహ శాస్త్రం, భూ రసాయన శాస్త్రం తదితర అంశాలను శాస్త్రవేత్తలు వివరించారు. భూకంపాలను నమోదు చేసి విశ్లేషించే విధానం, భూగర్భ జలాల గుర్తింపు, భూగర్భ నిర్మాణాలను త్రిమితీయ దృశ్యీకరణతో గుర్తించే సాంకేతికతలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు.

మొబైల్ ఫోన్లలో వినియోగించే రాళ్లు, ఖనిజాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనతోపాటు భూమి పరిణామ క్రమాన్ని నమూనాల ద్వారా వివరించారు. హిమనదుల కదలికలు, ప్రకృతి వైపరీత్యాలపై పనిచేసే నమూనా, భూకంపాలపై శబ్ద హెచ్చరికలు అందించే ఆండ్రాయిడ్ యాప్ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'మిరాకిల్ ఇన్ అంటార్కిటికా' వీడియో ద్వారా అక్కడి పరిశోధనా యాత్రల సవాళ్లను వివరించారు. రోజంతా శాస్త్రవేత్తలు విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ప్రకృతి వైపరీత్యాల అంచనా, భూగర్భ జలాల నిర్వహణ, సహజ వనరుల సుస్థిర వినియోగంలో భూవిజ్ఞాన పరిశోధనల ప్రాధాన్యాన్ని వివరించారు. విద్యార్థుల శాస్త్రీయ క్విజ్‌కు విశేష స్పందన లభించింది. ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్ ప్రదర్శనలను పరిశీలించి శాస్త్రవేత్తలు, పరిశోధకులను అభినందించారు. డాక్టర్ బి.పి.కే. పత్రో, శాస్త్రవేత్త 'జి', వ్యవస్థాపక దినోత్సవ కమిటీ చైర్మన్ తదితరుల సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు.



# మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సయ్యద్ రఫీ కృతజ్ఞతలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి సంబంధించి రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమర్పించిన డిమాండ్లలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ముఖ్యమైన అంశాలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించి, వాటి అమలు కోసం పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు ఎండార్స్ చేయడంపై, సెప్టెంబర్ 11 నుంచి కొనసాగిన తెలంగాణ రైస్ మిల్లుల నిరవధిక బంద్‌ను విరమించిన అనంతరం మంత్రిని సామాజిక రాజకీయ వ్యాఖ్యాత, ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఈసీ మెంబర్ సయ్యద్ రఫీ వ్యక్తిగతం కలిసారు. మంత్రి ఎండార్స్ చేసిన డిమాండ్లను వీలైనంత త్వరగా అమలు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని మరోసారి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. టెస్ట్ మిల్లింగ్ ద్వారా ఖరీఫ్, రబీ పంటలకు ఔట్‌టర్న్ రేషియోను నిర్ణయించాలి. కలర్ సార్టర్ రిజెక్షన్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, మిల్లింగ్ ఛార్జీని క్వింటాల్‌కు రూ.150కు పెంచాలని, పాత గన్నీ బ్యాగ్ ధరను క్వింటాల్‌కు రూ.11గా నిర్ణయించాలని, 25 శాతం షార్టేజ్ పెనాల్టీతో పాటు 12 శాతం వడ్డీని మాఫీ చేయాలని, రైస్ మిల్లులకు 200 హెచ్‌పీ వరకు విద్యుత్‌ను ఎల్టీ కేటగిరీలో అందించాలని ఎండార్స్ చేశారు. అదే సమయంలో, 23 సెప్టెంబర్ 2026న కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పత్రంలోని కఠిన నిబంధనలు నాన్-విల్ఫుల్ డిఫాల్టర్లపైనా వర్తిస్తే, తెలంగాణలోని చిన్న, మధ్యతరహా రైస్ మిల్లులు తీవ్ర సంక్షోభంలోకి వెళ్లి మూతపడే ప్రమాదం ఉందని మంత్రికి వివరించారు. దీంతో భవిష్యత్తులో మిల్లింగ్ రంగం గుత్తాధిపత్య కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని, అందువల్ల కేంద్ర నిబంధనలకు అనుగుణంగా నాన్-విల్ఫుల్ డిఫాల్టర్లను రక్షించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన పరిష్కారాలను చూపించాలని కోరారు. ఆయనతోపాటు రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పాడి గణపతి రెడ్డి, కార్యదర్శి ఊట్కూరి వీరేశం కూడా మంత్రిని కలిశారు.

# తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం



- 'మిషన్ 2028' పోస్టర్ ఆవిష్కరణ

**షేక్‌పేట (జనంసాక్షి) :** యువతను పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని రూపుమాపడానికి, తెలంగాణను 'డ్రగ్ ఫ్రీ స్టేట్'గా మార్చడానికి రూపొందించిన 'మిషన్ 2028' కార్యాచరణ ప్రణాళికను తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఐపీఎస్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. అలాగే బెస్ట్ ఆంటీ నార్కోటిక్ టాస్క్ ఫోర్స్ ఇన్ ఇండియా అవార్డుని పొందిన తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ మరియు టీంకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డిఎస్పి శ్రీనివాస్, తెలంగాణ యువత అధ్యక్షులు ఇమ్మడి సతీష్, కార్యదర్శి మల్లికార్జున్ నరుకుడు బిందెల, ఈవెంట్ ఆర్గనైజర్ శ్రీనివాస్, వై స్టూడియోస్ మేనేజింగ్ డైరెక్టర్స్ సంతోష్ మరియు సంతోషిని, తెలంగాణ సైకిల్ మారథాన్ నిర్వాహకులు లోకేష్ దీూచీ పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంట్రల్ లోని ఈగల్ ఫోర్స్' కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, 'భారత్ ఎగైనెస్ట్ నార్కోటిక్స్' పేరిట ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే సందేశాన్ని వ్యాప్తి చేయడానికి ఈ పోస్టర్లను ఆవిష్కరించినట్లు తెలిపారు. అక్టోబర్ 24న నెక్లెస్ రోడ్ లోని పీపుల్స్ ప్లాజా వద్ద భారీ సంఖ్యలో నాయకులు, విద్యార్థులు, సామాజికవేత్తలు పాల్గొని డ్రగ్స్ లేని సమాజం కోసం సైకిల్, బైక్, క్యాండిల్ ర్యాలీ నిర్వహించబోతున్నామని నిర్వాహకులు తెలియజేశారు. 2028 నాటికి తెలంగాణను పూర్తిగా మాదకద్రవ్య రహితంగా మార్చడం ఈ 'మిషన్' ముఖ్య ఉద్దేశమని వారు వెల్లడించారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా స్కూళ్ళు, కాలేజీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నారు. ఈ కార్యక్రమంలో 'త్రినేత్ర', 'వరల్డ్ లీడర్షిప్ కౌన్సిల్' , 'సేవ్' వంటి వివిధ సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని తమ మద్దతు తెలిపారు. డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

# సన్నబియ్యం పథకం సంతృప్తినిచ్చింది

- గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదు
- రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- హుజూర్ నగర్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్న బియ్యం పథకం ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర భారీ నీటిపారుదల, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్ నగర్ వివిఎం స్కూల్ లో హుజూర్ నగర్, మఠంపల్లి మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి ఆయన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ చరిత్రలో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం తమ కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. దేశంలో అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పథకం అమలు కాలేదన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క తెల్ల రేషన్ కార్డు ఇవ్వలేదని వ్యక్తం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక 16,32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. తెలంగాణలో మొత్తం కలిపి1,06,28,092 రేషన్ కార్డులు ఉన్నాయని, దీంతో 3,42,57,109 మంది నిరుపేదలు ఆహార భద్రత లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం కలిపి 3,72,658 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో మొత్తం రేషన్ కార్డులు 1,08,011 ఉండగా కొత్తగా హుజూర్ నగర్ మండలంలో 21,395, మట్టంపల్లి మండలంలో 16,203 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని మంత్రి అన్నారు. సన్న బియ్యం పంపిణీతో పేద ప్రజలకు కడుపునిండా భోజనం పెడుతున్నామని, గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన దొడ్డుబియ్యం కోళ్ల ఫారాలు, బీర్ల తయారీ, రైస్ మిల్లర్లు అక్రమ వ్యాపారానికి స్కామ్ గా ఉపయోగపడ్డాయని, తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి తెల్ల రేషన్ కార్డు ఇచ్చి, ప్రతి ఒక్క మనిషికి 6 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందిస్తున్నామని రాష్ట్రంలో 85% మంది జనాభా కు కడుపునిండా అన్నం పెట్టే పథకం పెట్టడం చాలా సంతృప్తినిచ్చిందని అన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, అర్హులై ఉండి ఎవరికైనా కార్డు రాని వారు రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నచో కొత్త రేషన్ కార్డు ఇప్పించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ కే నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా దేశ్ ముఖ్, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, గ్రంధాలయ చైర్మన్ బచ్చు రామారావు, హుజూర్ నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత, ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తెచ్చిన కృత్రిమ కరువిదీ!

- తక్షణమే కాళేశ్వరం జలాలను ఎత్తిపోయాలి
- మూడేళ్లుగా కాళేశ్వరం బ్యారేజీలకు కనీస మరమ్మతులు చేయని ప్రభుత్వం
- బీఆర్ఎస్ నేత టీ. జీవన్ రెడ్డి ఫైర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, నీళ్లు పుష్కలంగా ఉన్నా వాడుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కృత్రిమ కరువని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టీ. జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలకు కనీసం చిన్న మరమ్మతులు కూడా చేయలేకపోయిందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు సాగు, తాగునీరు, విద్యుత్ కొరతతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. లక్షల క్యూసెక్కుల నదీ జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నివేదిక ఆధారంగా కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి జలాలను అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లికి ఎత్తిపోసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లిలో 20 టీఎంసీలు, ఎస్సారెస్పీలో 46 టీఎంసీల నీళ్లు ఉన్నాయని, రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి నీటిని ఎత్తిపోస్తే రబీ (సెకండ్ క్రాప్)కి సాగునీరు అందించవచ్చని ఆయన సూచించారు. నాడు కేసీఆర్ దూరదృష్టితో గ్రావిటీ కెనాల్స్, పంపింగ్ వ్యవస్థను నిర్మించారని గుర్తుచేశారు. లక్ష కోట్ల ప్రాజెక్టులో కుంగిపోయిన మేడిగడ్డ బ్లాక్ ఆస్తి విలువ కేవలం రూ. 200 కోట్లు (0.2 శాతం) మాత్రమేనని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ పాలిట శనిలా దాపురించారని జీవన్ రెడ్డి దుయ్యబట్టారు. ఎన్నికల ముందు తుమ్మిడిహట్టి నుంచి నీళ్లు తెస్తామని చెప్పి మూడు బడ్జెట్లు పూర్తయినా ఎలాంటి పురోగతి లేదన్నారు. ఈ నెల 30న సిరిసిల్ల పర్యటనకు వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. ముందుగా కాళేశ్వరం, ఎస్సారెస్పీల ద్వారా సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల ప్రాంతాలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరమ్మతులకు సమయం పట్టినా, తక్షణమే కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల నుంచి నీటిని ఎత్తిపోసి రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ పక్షాన ఆయన డిమాండ్ చేశారు.




## వైద్యం వికటించి మహిళ మృతి

**హన్మకొండ సెప్టెంబర్ 27(జనం సాక్షి):** హన్మకొండ కేంద్రంలోని ఓజస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన మారుపట్ల పూలమ్మ (50) అనారోగ్యంతో ఓజస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అయితే చికిత్స సమయంలో పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందినట్లు తెలిసింది. వైద్యం వికటించడం వల్లే మృతి సంభవించిందా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే విషయం తెలియాల్సి ఉంది.

# నలుగురికి ప్రాణం పోసిన మహిళా తేజం దీప్తి రెడ్డి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** 'మహిళా సాధికారతే లక్ష్యంగా వుమెన్ ఎనర్జీ, వీ ఏయిమ్ సంస్థలను స్థాపించి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన యువ మహిళా పారిశ్రామికవేత్త మడుగుల దీప్తి రెడ్డి తీవ్ర అనారోగ్యంతో బ్రెయిన్ డెడ్‌కు గురికావడం అత్యంత బాధాకరం. భౌతికంగా మనల్ని వీడినా.. నలుగురి ప్రాణాల రూపంలో ఆమె సజీవంగా నిలిచారు అని సీపీ సజ్జనార్ ఎక్స్ లో ట్వీట్ చేశారు. తీవ్ర విషాదంలో ఉండి కూడా ఆమె కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం సమాజానికే ఆదర్శప్రాయంగా నిలిచిందని కొనియాడారు. మానవత్వాన్ని చాటుతూ ఆమె భర్త ప్రదీప్ రెడ్డి తీసుకున్న ప్రాణదాన నిర్ణయంతో దీప్తి రెడ్డి గుండె, కాలేయం (లివర్), రెండు కిడ్నీలను అవయవదానం చేశారు. దీంతో మృత్యువు అంచున ఉన్న నలుగురి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాయని పేర్కొన్నారు. 'భౌతికంగా మనల్ని వీడినా నలుగురి ప్రాణాల రూపంలో దీప్తి రెడ్డి సజీవంగా నిలిచారు. ఈ ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్న వారి కుటుంబ సభ్యుల ఔదార్యం అత్యంత గొప్పది. మరణం తర్వాత కూడా జీవించేందుకు అవయవదానాన్ని మించిన మార్గం లేదు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలి, విలువైన ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలి' అని సజ్జనార్ పిలుపునిచ్చారు.

## బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో జరగనున్న బ్యాంకు ఉద్యోగుల మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారానికి ఐదు రోజుల పని విధానం అమలు చేయాలని, 12వ వేతన ఒప్పందంలోని సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. 2023లో కుదిరిన ఒప్పందాలను అమలు చేయకుండా, లాభాల ఆధారంగా ఇచ్చే పీఎల్ఐ పథకంలో కేంద్రం ఏకపక్ష మార్పులు చేస్తూ ఉద్యోగుల మధ్య విభజన సృష్టిస్తోందని విమర్శించారు. గత 60 ఏళ్లుగా అమలవుతున్న ద్వైపాక్షిక ఒప్పందాలను విచ్ఛిన్నం చేస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను శరవేగంగా ప్రైవేటీకరిస్తున్నారని జాన్ వెస్లీ మండిపడ్డారు. 28గా ఉన్న బ్యాంకులను 12కు కుదించడమే కాకుండా, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను సైతం కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ ఉద్యోగ భద్రతను ప్రమాదంలో పడేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రైవేటీకరణ విధానాలను ఏకతాటిపై ప్రతిఘటించాలని, బ్యాంకు ఉద్యోగులు తలపెట్టిన సమ్మెను కార్మికవర్గం, ప్రజలు విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వం దృష్టికి పంచాయతీ కార్యదర్శుల సమస్యలు

- ఉద్యోగుల జేపీసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేలా కృషి చేయనున్నట్టుగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్ లోని ఖైరతాబాద్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, గ్రామ పాలనా అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు పాల్గొన్నారు. టీపీఎస్ఎఫ్ స్టేట్ ప్రెసిడెంట్ ఏ.శ్రీకాంత్ గౌడ్, జనరల్ సెక్రటరీ ఎన్. నాగరాజు, ట్రెసరర్ ఎం. శశిధర్, గౌరవ అధ్యక్షులు ఎం. సందీప్ ఈ సందర్భంగా లచ్చిరెడ్డి గారి దృష్టికి పలు సమస్యలను తెచ్చారు. ఓపీఎస్ ద్వారా వచ్చిన పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని కోరారు. ఇదే కాకుండా వాళ్ళు పని చేసిన కాలాన్ని కూడా పరిగణలోకి తీసుకొని రెగ్యులర్ చేయాలన్నారు. జూనియర్ పంచాయతి కార్యదర్సులుగా పని చేసిన నాలుగేళ్ల కాలాన్ని నోషనల్ సర్వీస్ గా గుర్తించాలని కోరారు. న్యాయబద్ధమైన ప్రతి డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయనున్నట్టుగా ఈ సందర్భంగా లచ్చిరెడ్డి తెలిపారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ, పంచాయతీరాజ్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అప్పుడే ప్రజలకు కావాల్సిన సేవలు అందడంతో పాటు అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు.

## సాంకేతిక లోపంతో పట్టాలపై ఆగిపోయిన శాతవాహన ఎక్స్‌ప్రెస్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సికింద్రాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరిన శాతవాహన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12714) రైలు సాంకేతిక లోపంతో మౌలాలి వద్ద నిలిచిపోయింది. సికింద్రాబాద్ నుంచి బయల్దేరిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య తలెత్తింది. ఇంజిన్ పై ఉండే ప్యాంటోగ్రాఫ్ విరిగిపోవడంతో రైలు ఆగిపోయింది. దాంతో రైలులోని ప్రయాణికులు ఏమైందోనని కంగారు పడ్డారు. సుమారు గంట సమయంపాటు పట్టాలపైనే పడిగాపులు కాశారు. ఘటనా స్థలికి చేరుకున్న రైల్వే ఇంజినీర్లు, సిబ్బంది.. వెంటనే మరమ్మతులు చేపట్టగా.. రైలు అక్కడి నుంచి బయల్దేరింది. ప్రస్తుతం 1 గంట 20 నిమిషాలు ఆలస్యంగా నడుస్తుండగా.. విజయవాడకు 10.20 గంటలకు చేరుకోవలసిన శాతవాహన ఎక్స్‌ప్రెస్.. 11.20 గంటల వరకు చేరుకోవచ్చునని రైల్వే అధికారులు తెలిపారు.

# 41 కొత్త 2బీ బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈనెల 28 నుంచి స్వీకరణ..



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలో 41 కొత్త 2బీ బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. క్యూర్ పరిధిలో 14, మిగిలిన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో 27 బార్లకు దరఖాస్తుల స్వీకరణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష రుసుము చెల్లించాలి. క్యూర్ ఏర్పాటు, కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు, మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం తదితర కారణాలతో పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త 2బీ బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి ప్రాంతాల్లోని 14 బార్లకు సంబంధించి అబ్కారీ భవన్‌లోని కమిషనర్ కార్యాలయంతో పాటు సంబంధిత డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. మిగిలిన జిల్లాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని బార్లకు సంబంధించిన దరఖాస్తులను ఆయా ఉమ్మడి జిల్లాల డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలు, కమిషనర్ కార్యాలయం, డీపీఈఓ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులను ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే స్వీకరిస్తారు. సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ పరిధిలోని అలియాబాద్‌లో ఒకటి, మూడుచింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో రెండేసి 2బీ బార్లకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇందుకోసం సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంతో పాటు కుత్బుల్లాపూర్ డీపీఈఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చు. రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పరిధిలోని ఫ్యూచర్ సిటీ, చేవెళ్ల మున్సిపాలిటీలో ఒకటి, మొయినాబాద్ మున్సిపాలిటీలో రెండు 2బీ బార్లకు దరఖాస్తులను ఆహ్వానించారు. వికారాబాద్ జిల్లాలో కొడంగల్, పరిగి మున్సిపాలిటీల్లో, సంగారెడ్డి జిల్లాలో గడ్డిపోతారం, కోహిర్ మున్సిపాలిటీల్లో ఒక్కొక్కటి, గుమ్మడాల మున్సిపాలిటీలో రెండు 2బీ బార్లకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అదిలాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్, ఖమ్మం జిల్లాలో అశ్వారావుపేట, కల్లూరు, మహబూబ్‌నగర్ జిల్లాలో మక్తల్, మహబూబ్‌నగర్, దేవరకద్ర, నిజామాబాద్ జిల్లాలో బోధన్, కామారెడ్డి జిల్లాలో బీబీపేట, వరంగల్ జిల్లాలో నర్సంపేట, జనగామ జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్, మహబూబాబాద్ జిల్లాలో కే సముద్రం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ములుగు మున్సిపాలిటీల్లో కొత్త 2బీ బార్లకు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించారు. క్యూర్ పరిధిలోని 2బీ బార్లకు సంవత్సరానికి రూ.44 లక్షలు ఎక్సైజ్ ఫీజుగా చెల్లించాలి. నిజామాబాద్ జిల్లా బోధన్ బార్‌కు రూ.42 లక్షలు, మిగిలిన 2బీ బార్లకు సంవత్సరానికి రూ.30 లక్షల ఎక్సైజ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఎక్సైజ్ శాఖ పేర్కొంది. మరిన్ని వివరాల కోసం తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సూచించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370